PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 117 | విజయవాడ, శుక్రవారం 28 నవంబర్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday 28 November 2025 | Rs




తిరుమల పవిత్రతను కాపాడుతాం

అమరావతి వేంకటేశ్వరుని ఆలయం అభివృద్ధికి సిఎం శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తిరుమల వేంకటేశ్వరస్వామి వారి ప్రతిష్టకు భంగం కలగకుండా చూస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాజధాని అమరావతిలో రూ.260 కోట్లతో చేపట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. చంద్రబాబు మాట్లాడుతూ..ఈ పనులను రెండున్నర ఏళ్లలో పూర్తి చేయాలని అధికారులను కోరారు. 'స్వామికి అప్రతిష్ట కలిగించే ఏ పనీ చేయను... ఎవరినీ చేయనివ్వను' అని అన్నారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. తిరుమల తరహాలోనే వెంకటపాలెంలో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అమరావతిలో విధ్వంసం తప్ప చేసిందేమీ లేదన్నారు. రాజధాని రైతులు న్యాయస్థానం టూ దేవస్థానం పేరుతో మహా పాదయాత్ర చేశారని గుర్తు చేశారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు, పక్కన మంత్రులు ఆనం, నారాయణ తదితరులు

ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, నాదెండ్ల మనోహర్, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఎమ్మెల్యేలు, టిటిడి బోర్డు సభ్యులు పాల్గొన్నారు. వెంకటపాలెం ఆలయ విస్తరణలో భాగంగా మొదటి దశలో రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం, రూ.48 కోట్లతో ఏడంతస్తుల మహా రాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయ స్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ నిర్మిస్తారు. రూ.120 కోట్లతో రెండోదశలో శ్రీవారి ఆలయ మాఢవీధులు, అప్రోచ్ రోడ్లు, అన్నదాన కాంప్లెక్స్, యాత్రికులకు విశ్రాంతి భవనం, అర్చకులు-సిబ్బందికి క్వార్టర్స్, రెస్ట్ హౌస్, పరిపాలనా భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు తెలిపారు.

డ్రైవర్ కం గైడ్ సేవలు

● రాపిడోతో పర్యాటకశాఖ ఒప్పందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాపిడో సంస్థతో కలిసి పర్యాటక శాఖ 'డ్రైవర్ కం గైడ్' విధానాన్ని ప్రవేశపెట్టనుందని ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పర్యాటకశాఖ, రాపిడో మధ్య ఇందుకు సంబంధించిన ఒప్పందం ఇటీవల విశాఖపట్నం సిఐఐ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో జరిగిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒప్పందం మేరకు ఈ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. రాపిడోలో మంచి రేటింగ్ ఉన్న డ్రైవర్లను ఎంపిక చేసి, వారికి రాష్ట్రచరిత్ర, సంస్కృతి, ఆతిథ్యం, భద్రతపై డిసెంబర్ నుంచి పర్యాటక శాఖ ప్రత్యేక శిక్షణ ఇస్తుందని వెల్లడించారు. తర్వాత విజయవాడ, తిరుపతి, విశాఖపట్నంలో ఈ సేవలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రాపిడో యాప్‌లోనే టూరిస్ట్ ఆటోలు, క్యాబ్‌లు, పర్యాటక సర్క్యూట్ల వివరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. దీనివల్ల క్యాబ్, ఆటో డ్రైవర్లకు ఆదాయం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుండి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విశ్లేషణలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపవలసిన చిరునామా:

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కాని editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

వైకుంఠ దర్శన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం అయ్యింది. మొదటి మూడు రోజుల దర్శన టోకెన్ల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. డిసెంబరు ఒకటి నుండి టిటిడి వెబ్‌సైట్, మొబైల్ యాప్, ప్రభుత్వ వాట్సాప్ సర్వీసెస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఎంపికైన యాత్రికుల ఫోన్లకు టోకెన్ వివరాలు మెసేజ్ ద్వారా అందుతాయని టిటిడి ఒక ప్రటకనలో పేర్కొంది.

కల్తీ నెయ్యి కేసులో టిటిడి ఇఇ అరెస్ట్

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల కల్తీ నెయ్యి కేసులో విచారణ కొనసాగుతున్న సమయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మరొకరు అరెస్ట్ అయ్యారు. గతంలో టిటిడి మార్కెటింగ్ జిఎంగా, ప్రస్తుత ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యంను పోలీసులు అరెస్ట్ చేశారు. సుబ్రమణ్యం అరెస్ట్‌తో ఈ కేసులో మొత్తం సంఖ్య పదికి చేరుకుంది. 2019 - 2024 మధ్య 20.01 కోట్ల వేంకటేశ్వరస్వామి లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేశారని సిట్ విచారణలో తేలింది. మొత్తం 48.76 కోట్ల లడ్డూలను తయారు చేయగా.. ఆ లడ్డూల్లో 40 శాతం పామాయిల్, పామ్‌కెర్నల్ ఆయిల్‌తో పాటూ ఇతర రసాయనాలతో తయారు చేశారని నిర్ధారణ అయింది. టిటిడిలోని అప్పటి ధర్మకర్తల మండలి నెయ్యి సరఫరా కోసం.. ఉత్తరాఖండ్‌కు చెందిన భోలేబాబా డెయిరీ, తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ, తిరుపతి జిల్లా పునబాకలోని వైష్ణవి డెయిరీతో పాటూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన మాల్‌గంగ డెయిరీలకు రూ.250 కోట్లు చెల్లించింది. ఈ డెయిరీల నుంచి మొత్తం 1.61 కోట్ల కిలోల నెయ్యి కొనుగోలు చేశారు. అయితే ఇందులో 68 లక్షల కిలోలు కల్తీ నెయ్యి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కల్తీ నెయ్యి కేసులో సిట్ అధికారులు ఇటీవల టిటిడి మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని ప్రశ్నించిన విషయం తెలిసిందే.

దళారుల చేతిలో మోసపోవద్దు

● రైతులకు మంత్రి నాదెండ్ల సూచన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



దళారుల మాటలు నమ్మి తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు సూచించారు. విజయవాడ సమీపంలోని కానూరు సివిల్ సప్లయ్స్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వాతావరణ శాఖ సూచనల మేరకు ఈ నెల 30వ తేదీ వరకూ రాష్ట్రంలో వర్షాలు లేవని అన్నారు. అనంతరం ఐదు జిల్లాలకు వర్ష సూచనలు ఉన్నందున కృష్ణా, గుంటూరు, ఏలూరు, బాపట్ల, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఐసోలేషన్ సెంటర్లను వచ్చే నెల 1వ తేదీ నుంచి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ధాన్యం తరలించేందుకు 24 వేల లారీలు జిపిఎస్‌తో సహా సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. వర్షాల నుంచి కౌలు రైతులను ఆదుకునేందుకు టార్పాలిన్ పట్టాలను సిద్ధంగా ఉంచామన్నారు. ఈ-క్రాప్ నమోదైన పొలంలో వచ్చే దిగుబడిని పూర్తిగా కొంటామన్నారు. కల్లాలోనే ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, 4 నుంచి 6 గంటల్లో నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రైతులకు రూ.1,674 కోట్లు బకాయిలు పెడితే కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. ప్రస్తుత సీజన్‌లో నేటి వరకూ 8.22 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.1,713 కోట్లు జమ చేశామని చెప్పారు. 7.53 కోట్ల గోనె సంచులను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. మూడు నెలల్లో జరగాల్సిన ధాన్యం సేకరణ ప్రక్రియను వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా రైతుల ఆందోళనను గుర్తించి వేగవంతం చేశామన్నారు. ప్రభుత్వం చాలా వేగంగా స్పందించి చర్యలు తీసుకుంటున్న విషయం రైతులు అర్థం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల మార్గదర్శకత్వంలో కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. 75 కిలోల బస్తాకు రూ.1792 మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

విద్యుత్ ప్రాజెక్టులు వేగవంతం

● సమీక్షలో మంత్రి గొట్టిపాటి ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భవిష్యత్ విద్యుత్ అవసరాలకు తగినట్లుగా ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ఇంధన శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ సంస్థల అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌కో, ఎపిఎస్‌పిడిసిఎల్ ఉన్నతాధికారులతో తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ట్రాన్స్‌కో, పంపిణీ సంస్థల్లో చేపట్టిన ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న పరిశ్రమలకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా ముఖ్యమైన విద్యుత్‌ను అందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. భవిష్యత్తు విద్యుత్ లోడ్‌ను దృష్టిలో ఉంచుకుని, పరిశ్రమలు, గృహ వినియోగదారులు, వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేయాలని ఆదేశించారు. సరఫరాలో ఆటంకాలు లేకుండా ఉండేందుకు 132కెవి, 220కెవి, 400 కెవి సామర్థ్యాలతో 29 కొత్త ఉపకేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఇవి గ్రిడ్‌ను బలోపేతం చేయడంతోపాటు నిరంతర సరఫరా వ్యవస్థకు కీలకంగా మారతాయని తెలిపారు. వ్యవసాయ, గృహ కనెక్షన్ల సరఫరాలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని, దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని, సంబంధిత కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

రాజధానిలో బిసి కులాలకు భవనాలు : మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో అన్ని బిసి కులాలకు భవనాలు నిర్మించనున్నట్లు ఆ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయవాడ సమీపంలోని గొల్లపూడి బిసి భవన్‌లో నగర కార్పొరేషన్ పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. బిసిలకు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా గుర్తింపు తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. రాజ్యాధికారంలో బిసిలను భాగస్వాములు చేయాలనే లక్ష్యంతో నామినేటెడ్, ఇతర పదవుల కేటాయింపులో బిసిలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తితో వేతనాలు ముడిపెట్టొద్దు

చట్ట విరుద్ధ సర్క్యులర్‌ను రద్దు చేయాలని ఉక్కు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తితో వేతనాలను ముడిపెడుతూ యాజమాన్యం జారీ చేసిన తాజా సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు యు రామస్వామి మాట్లాడుతూ యాజమాన్యం ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలు దయాదాక్షిణ్యం కాదని, హక్కుల కోసం కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాడిన ఉద్యమాల ఫలితమని పేర్కొన్నారు. గత సంవత్సరం నుంచి సంపూర్ణ వేతనాలు చెల్లించకపోవడం, హెచ్‌ఆర్‌ఎను వాయిదా వేయడం, ఉక్కునగరంలోని ఆరువేలమంది కార్మికులపై అదనపు విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపడంవంటి చర్యలు కార్మికులపై దాడికి నిదర్శనాలని అన్నారు. చట్ట విరుద్ధంగా జారీ చేసిన తాజా సర్క్యులర్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఐఎన్‌టియుసి నాయకులు ఎం రాజశేఖర్ మాట్లాడుతూ ప్లాంట్ ఉత్పత్తి తగ్గడానికి కారణం ఉద్యోగులు కాదని, పాత యంత్రాలు, సమయానికి మరమ్మతులు లేకపోవడం, రా మెటీరియల్ కొరత వంటివేనని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు వల్ల ఆ కార్మికుల కుటుంబాలు వీధుల పాలయ్యేలా సిఎండి ఏకపక్ష నిర్ణయాలు చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు.



ధర్నా చేస్తున్న ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

నాసిరకం రా మెటీరియల్ కొనుగోలు వల్లే ఉక్కు ఉత్పత్తులు తిరస్కరణకు గురయ్యాయన్నారు. స్టీల్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి ఆదినారాయణ మాట్లాడుతూ నాలుగేళ్లుగా కార్మికుల హక్కులను యాజమాన్యం ధ్వంసం చేస్తోందని విమర్శించారు. ప్లాంట్‌ను ప్రైవేట్‌కు అప్పగించే కేంద్ర ప్రభుత్వ యత్నాలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతునిస్తోందని తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు ఎన్ రామారావు, జె అయోధ్యరాం, కార్మిక నేతలు రమణమూర్తి, డివి రమణారెడ్డి, దొమ్మేటి అప్పారావు తదితరులు మాట్లాడుతూ యాజమాన్యం వైఫల్యాన్ని ఉద్యోగులపై నెట్టేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తోందని అన్నారు. మెయింటెనెన్స్ లేమి వల్ల ప్లాంట్‌లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీసే చర్యలను ప్లాంట్ యాజమాన్యం మానుకోవాలని హితవు పలికారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే భావితరాలకు అందించేందుకు కార్మికులు పోరాటానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పి శ్రీనివాసరాజు, కెఎస్ఎన్ రావు, బిఎన్ రాజు, గణపతిరెడ్డి, పరంధామయ్య, డేవిడ్, జీఆర్‌కె నాయుడు, నీరుకొండ రామచంద్రరావు, టివికె రాజు, బి అప్పారావు, బి తౌడన్నతోపాటు పలు విభాగాల నాయకులు, కార్మికులు, రిటైర్డ్ ఉద్యోగులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల భూ హక్కులపై దాడి

● అసైన్డ్ చట్ట సవరణను నిలిపివేయాలి
● వ్యవసాయ కార్మిక సంఘాల డిమాండ్
● సిసిఎల్ఎ కార్యాలయం వద్ద భారీ ధర్నా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రమంత్రివర్గం ఇటీవల సవరించిన అసైన్డ్ చట్టం పేదల భూహక్కులపై ప్రత్యక్షంగా దాడులు చేయడమేనని వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. చట్టసవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ చట్టసవరణకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం వద్ద గురువారం భారీ ధర్నా జరిగింది. ఇరు సంఘాల అధ్యక్షులు దడాల సుబ్బారావు, సిహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం(ఎఐఎడబ్ల్యూ) ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దశాబ్దాలుగా తాము సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని పేదలు ఒక పక్క పోరాటం చేస్తున్నారని, మరో పక్క వీరి భూములను పెద్దలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు పేదల భూములను కట్టబెట్టేందుకు అసైన్డ్ చట్టసవరణను కుట్రపూరితంగా ప్రభుత్వం చేసిందని మండిపడ్డారు. ఈ నిర్ణయం వల్ల లక్షల మంది పేదలు తమ భూములను కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలకు పంపిణీ చేసిన భూములను కాపాడాల్సిన ప్రభుత్వం ఆక్రమణదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అన్యాయంగా భూములను ఆక్రమించుకున్న పెద్దలను శిక్షించడం లేదని పేర్కొన్నారు. పట్టాలు లేవనే పేరుతో భూములను వెనక్కి తీసుకొని పెట్టుబడిదారులకు ఇవ్వడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చట్ట సవరణను ఉపసంహరించు కోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. దడాల సుబ్బారావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో భూసేకరణ కార్యక్రమాన్ని ప్రతిఘటించాలని, వ్యవసాయ కార్మికులంతా సంఘటితంగా ఉద్యమించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ 1977 అసైన్‌మెంట్ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని ఆగ్రహించారు. 99 ఏళ్ల పాటు లీజుకిచ్చే విధంగా సవరణలు చేశారని, దీనివల్ల దళితులు, పేదల చేతిలో ఉన్న లక్షల ఎకరాల అసైన్డ్ భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా భూ పంపిణీ కార్యక్రమం నిలిచిపోయిందని, ఖాళీగా ఉన్న బంజరు భూములను ఇళ్లు లేని పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. బికెఎంయు సంఘం కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 33 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వీటిల్లో దాదాపు 13 లక్షల ఎకరాలు ధనికుల అధీనంలోనే ఉన్నాయని తెలిపారు. ధర్నా అనంతరం భూ పరిపాలన కార్యాలయ అధికారికి వినతిపత్రాన్ని అందించారు. ఈ ధర్నాలో ఉభయ సంఘాల నాయకులు వి రాణి, ఈమని అప్పారావు, కె కళ్యాణ్, అన్వేష్, ఏ వెంకటేశ్వరరావు, బి కోటేశ్వరి, జె బాలరాజు, ఎస్ కోటేశ్వరరావు, బి వెంకయ్య, ఈశ్వరరావు, కదిరప్ప, తదితరులు పాల్గొన్నారు.



సిసిఎల్ఎ కార్యాలయం వద్ద అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

తిరుపతి లడ్డూపై పదేపదే తప్పుడు ప్రచారం : వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తిరుపతి లడ్డూ ప్రసాదంపై పదే పదే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇకనైనా తప్పుడు ప్రచారాలకు ముగింపు పలకాలని వైసిపి రాజ్యసభ సభ్యులు, టిటిడి మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లడ్డూ ప్రసాదంపై జంతువుల కొవ్వు ఆరోపణలపై సిట్ ఇప్పటి వరకూ స్పష్టత ఇవ్వలేదని అన్నారు. తిరుమల లడ్డూ విషయంలో తాము ఎటువంటి తప్పు చేయలేదని అన్నారు. ప్రసాదాల పరీక్షల విషయంలో పటిష్టమైన వ్యవస్థ ఉన్నప్పుడు కల్తీ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. తమ హయంలో నాలుగు నెయ్యి ట్యాంకర్లను తిరస్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. తిరుమలలో ప్లాస్టిక్ వాడకాన్ని కూడా నిషేధించామని అన్నారు. లడ్డూ వివాదంపై టిటిడి ఇవో, సిఎం చంద్రబాబు పరస్పర విరుద్ధ ఆరోపణలు చేశారని, దానిపై ఇప్పటి వరకు సిట్ స్పష్టత ఇవ్వలేదని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు తప్పుడు ప్రచారం చేసి, కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు హయంలో భక్తుల కానుకలను ప్రైవేట్ బ్యాంకులో డిపాజిట్ చేయలేదా? అని ప్రశ్నించారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, తమ కుటుంబం ఎవరి వద్ద డబ్బు తీసుకోలేదని తెలిపారు. తాను లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమని పేర్కొన్నారు. అలాగే ఎస్ బ్యాంక్‌లో టిటిడి డబ్బు డిపాజిట్లు, శ్రీనివాస సేతు వ్యవహారంపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

రబీలో యూరియా కొరత లేకుండా చర్యలు : మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రబీ సీజన్‌లో యూరియా కొరత తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. రబీ సీజన్‌కు మొత్తం 20.69 లక్షల టన్నుల ఎరువుల అవసరం ఉండగా, ఇప్పటి వరకూ 2.38 లక్షల టన్నులు రాష్ట్రానికి చేరుకున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 26వ తేదీ నాటికి 9.38 లక్షల టన్నుల యూరియా అవసరమని, ప్రస్తుతం 2.10 లక్షల టన్నుల యూరియా రైతులకు అందజేశామని, ఇంకా 1.91 లక్షల టన్నుల యూరియా నిల్వగా ఉందని పేర్కొన్నారు. అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరు, కర్నూలు, కడప తదితర జిల్లాలో అవసరానికి అనుగుణంగా సరఫరా, నిల్వలు ఉన్నాయని తెలిపారు. అదనంగా 9,432 మెట్రిక్ టన్నుల యూరియా రవాణా దశలో ఉందని పేర్కొన్నారు. కృష్ణా, గంగవరం, కాకినాడ, గోదావరి జిల్లాలోని పోర్టుల్లో 1.35 లక్షల టన్నుల యూరియా నిల్వ ఉందని చెప్పారు.

అవసరాన్ని బట్టి ఈ స్టాక్ జిల్లాలకు తరలిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఇటీవల ఆగ్రోస్ సంస్థపై వస్తున్న అవినీతి కథనాలపై స్పందించిన ఆ సంస్థ కార్యకలాపాలపై విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశించారు. ఆగ్రోస్ ద్వారా రైతులకు సబ్సిడీపై అందజేసే వాహనాలలో మార్పు లేకుండా సరఫరా చేయాలన్నారు. తుపాన్లు తట్టుకునే విధంగా, మంచి దిగుబడిని అందజేసే వరి వంగడాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కూరగాయల ధరలు పెరగకుండా దృష్టి సారించాలని, వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలాని, జెడిలు కృషాదాస్, బాలు నాయక్, హరిబాబు చౌదరి, ఆగ్రోస్ మేనేజర్ కూర్మారావు, ఎపి సీడ్స్ మేనేజర్ జలందర్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు అనుకూల వాతావరణం

● మంత్రి వాసంశెట్టి సుభాష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం కల్పించినట్లు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. పారిశ్రామిక శాంతి, కార్మికుల హక్కులు, ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. విజయవాడలోని ఒక హోటల్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మిక సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సామాజిక భద్రత, పారిశ్రామిక వివాదాలు, వేతనాలు, ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్‌లు అమలులో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. సంఘటిత రంగం, గిగ్ వర్కర్లను సామాజిక భద్రత పరిధిలోకి తీసుకురావడంతో లక్షలాదిమంది కార్మికులకు రక్షణ లభిస్తుందన్నారు. మహిళా ఉద్యోగుల కోసం మాతృత్వ సెలవులు, ఇంటి నుంచి పని సౌకర్యం, రాత్రి వేళల్లో పనికి అనుమతులు వంటి సంస్కరణలు మహిళల సాధికారతకు మరింతకు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కార్మికులకు సమాన వేతనం, సకాలంలో వేతనం చెల్లింపు, సురక్షితమైన పనివాతావరణం కల్పించడం లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమల సమన్వయం పెంచుకుని, ఉద్యోగావకాశాలు, పెట్టుబడులు పెరిగేలా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. కార్మిక శాఖ కార్యదర్శి శేషగిరి బాబు మాట్లాడుతూ.. కార్మికుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర సోషల్ సెక్యూరిటీ ఫ్రేమ్ వర్క్ అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి సంస్థలో ఆరోగ్య పరీక్షలు, భద్రతా కమిటీలు, అపాయింట్‌మెంట్ లెటర్లు తప్పనిసరి చేశామన్నారు. వలస కార్మికుల కోసం జర్నీ అలవెన్స్, పిడిఎస్ పోర్టబిలిటీ, నిర్మాణ కార్మికుల ప్రయోజనాల పోర్టబిలిటీ అమలులోకి తెచ్చినట్లు వెల్లడించారు. డిజిటల్ మీడియా వర్కర్లు, డబ్బింగ్ ఆర్టిస్టులు కూడా ఈ కొత్త కోడ్ల కింద రక్షణ పొందుతున్నారని వివరించారు. ఉద్యోగాల తొలగింపులో రీ-స్కిల్లింగ్ ఫండ్ ద్వారా కార్మికులకు తక్షణ సహాయం అందించే విధానం అమల్లో ఉందన్నారు. విలేకర్ల సమావేశంలో అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

పిపిపి రోడ్లకు త్వరలో టెండర్లు

● రోడ్లు భవనాల శాఖమంత్రి జనార్ధన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో త్వరలో పబ్లిక్- ప్రైవేట్- పార్ట్‌నర్‌షిప్ (పిపిపి) విధానంలో టెండర్లు పిలవనున్నామని రోడ్లు, భవనాల శాఖమంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. 175 రహదారులు 5,130 కిలోమీటర్లు పూర్తిచేసేందుకు పనులు చేస్తున్నామని చెప్పారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్రంలో ఆర్‌అండ్‌బి శాఖపై రూ.2774 కోట్ల పెనుభారం పడిందన్నారు. జగన్ ప్రభుత్వంలో రహదారులను నిర్లక్ష్యం చేసి రూ.20వేల కోట్ల భారం పెట్టి వెళ్లారని విమర్శించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రహదారులు గుంతలమయమయ్యాయని పేర్కొన్నారు. 15వేల కిలోమీటర్ల రహదారులు ఎందుకు పనికిరాకుండా పోయాయని విమర్శించారు. 2014-19లో రూ.36 వేల కోట్ల విలువైన జాతీయ రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించామని, వైసిపి ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని పేర్కొన్నారు. రహదారుల నిర్మాణం, మౌలిక సౌకర్యాల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు.

పరకామణి కేసులో పెద్దతలలు : రవినాయుడు

పరకామణి కేసులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి కిందిస్థాయి నాయకుల వరకు చాలా మంది ఉన్నట్లు టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పరోక్షంగా ఒప్పుకున్నారని శాప్ చైర్మన్ రవినాయుడు ఆరోపించారు. పరకామణి కేసు రాజీకి భూమన ప్రమేయం లేదా? అని ప్రశ్నించారు. రవికుమార్, అతని బంధువుల ఆస్తులు వైసిపి నాయకులు కొట్టేశారని ఆరోపించారు. పరకామణి కేసులో రవికుమార్‌తో పాటు అనేక మంది నిందితులు ఉన్నారని తెలిపారు. ఈ కేసులో కరుణాకర్‌రెడ్డిని అరెస్టు చేసి విచారించాలని కోరారు. ఈ కేసులో ఫిర్యాదుదారుడు సతీష్‌కుమార్ మరణంపై వేగంగా దర్యాప్తు చేసి, విచారించాలని అన్నారు.

ఉద్యోగుల ఆరోగ్య పథకం ప్రక్షాళన

● సిఎస్ ఆధ్వర్యాన ఏడుగురితో కమిటీ
● వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులకు అమలవుతున్న ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఇహెచ్‌ఎస్) నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, లోపాలను గుర్తించి పరిష్కార మార్గాలను సూచించేందుకు రాష్ట్రప్రభుత్వం ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యోగ సంఘాల నేతలకు ఇచ్చిన హామీ మేరకు కమిటీని ఏర్పాటు చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ నేతృత్వం వహించే ఈ కమిటీలో సాధారణ పరిపాలన ప్రధాన కార్యదర్శి / ముఖ్యకార్యదర్శి, వ్యయ విభాగం కార్యదర్శి, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఎన్‌టిఆర్ వైద్య సేవా ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఇద్దరు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కమిటీ ఎనిమిది వారాల్లో ఇహెచ్‌ఎస్ పటిష్ట అమలుపై నివేదిక సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల బృందంతో గత నెలలో జరిగిన సమావేశంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కొన్ని అంశాలు ప్రస్తావించారని వెల్లడించారు. వైద్య సేవల కోసం సకాలంలో ఖర్చులు చెల్లించకపోవడం, వివిధ వ్యాధుల ప్యాకేజి ధరలను పెంచకపోవడం, ఇహెచ్‌ఎస్ కింద సేవలందించడానికి ఆస్పత్రుల నిరాసక్తత, పర్యవేక్షణ లోపం, ఫిర్యాదుల పరిష్కారం జరగకపోవడం, ఇహెచ్‌ఎస్ ఆన్‌లైన్ పోర్టల్ పరిమిత సామర్థ్యం వంటి అంశాలు ప్రస్తావించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్యాన్సర్ రిజిస్ట్రీ, ట్యూమర్ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించిందని మంత్రి మరో ప్రకటనలో తెలిపారు.

ఉర్దూ అకాడమీ భాషాభివృద్ధికి చేయాలి

● మంత్రి ఫరూక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేయాలని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్ సూచించారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌గా ఫారూక్ శుబ్లీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉర్దూ అకాడమీ ప్రణాళికాబద్ధంగా ఉర్దూ ఘర్, షాదీ ఖానాలు, శిక్షణ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ ఫారూక్ శుబ్లీ మాట్లాడుతూ ఉర్దూ అకాడమీ పేరు ప్రతిష్టలను మరింతగా పెంచేందుకు కృషి చేస్తానని అన్నారు.

బిజెపికి టాటా
భూరి విరాళం..
తెర వెనుక
జరిగిందేమిటి?
5

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 117 | విజయవాడ, శుక్రవారం 28 నవంబర్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 28 November 2025 | Rs



దీప్తి శర్మ టాప్
అత్యధిక పారితోషికం ఆమెకే..
• శ్రీచరణికి రూ.1.30కోట్లు, అరుంధతి రెడ్డి రూ.75లక్షలు
• ముగిసిన డబ్ల్యుపిఎల్ వేలం
10

ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ కష్టమే..!



ఐఎంఎఫ్ అంచనా • రూపాయి పతనంతో దెబ్బ • లక్ష్యాన్ని చేరడానికి మరో ఏడాది పట్టొచ్చు


వాషింగ్టన్ : భారత ఆర్థిక వ్యవస్థ అనుకున్న సమయంలో 5 ట్రిలియన్ డాలర్లకు చేరడం కష్టమేనని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) స్పష్టం చేసింది. ఆ స్థాయికి చేరడానికి గతంలో అంచనా వేసిన దానికంటే ఎక్కువ సమయం పట్టవచ్చని విశ్లేషించింది. అంచనాల కంటే తక్కువ జిడిపి వృద్ధి చోటు చేసుకోవడంతో పాటుగా అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి మారకం విలువ పతనం ఆర్థిక వ్యవస్థకు ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి.

ఆర్థిక సంవత్సరం 2027-28 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు చేరనుందని 2025 ఫిబ్రవరిలో తొలుత వేసిన అంచనాలను ఐఎంఎఫ్ తాజాగా సవరించింది. ఈ లక్ష్యం మరో ఏడాది ఆలస్యమై 2028-29 నాటికి నెరవేరొచ్చని విశ్లేషించింది. ఐఎంఎఫ్ రిపోర్ట్ వివరాలు.. 2025-26 నాటికి 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ నమోదు కావొచ్చని అంచనా. 2027-28 మార్చి ముగింపు నాటికి 4.96 ట్రిలియన్ డాలర్లుగా ఉండొచ్చు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో జిడిపి 6.6 శాతంగా, వచ్చే ఏడాది 2026-27లో 6.2 శాతం వృద్ధి ఉండొచ్చు. డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోతున్నందున బలహీనమైన వృద్ధికి దారితీస్తుంది.

సవాళ్లు..

దేశీయ డిమాండ్ బలహీనపడటం, ద్రవ్యోల్బణం తగ్గడం వల్ల నామమాత్రపు వృద్ధి మందగించింది. తక్కువ ద్రవ్యోల్బణం కుటుంబాలకు మంచిదే అయినప్పటికీ.. నామమాత్రపు జిడిపి పెరుగుదలను తగ్గిస్తుంది. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డ్ స్థాయిలో పడిపోతున్న విషయాన్ని ఐఎంఎఫ్ పరిగణలోకి తీసుకుంది. ఇటీవల డాలర్‌తో రూపాయి దాదాపు 90కి చేరువలో పడిన విషయం తెలిసిందే. రాబోయే ఏళ్లలో రూపాయి బలహీనంగా ఉంటుందని ఐఎంఎఫ్ హెచ్చరించింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితినే ఇందుకు కారణమని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో డాలర్‌తో రూపాయి విలువ సగటున 87గా, వచ్చే 2026-27లో మరింత బలహీనపడి 87.7గా ఉండొచ్చని తెలిపింది.

ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ



లక్ష్యం	సవాళ్లు
- 2028-29 నాటికి ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ - 2027-28 నాటికి అంచనా 4.96 ట్రిలియన్లు..	- రూపాయి బలహీన పడుతూ ఉండటం - దేశీయ డిమాండ్ గణనీయంగా తగ్గడం -ట్రంప్ సుంకాలతో ప్రతికూల వాతావరణం

అమెరికా సుంకాలతో ఒత్తిడి..

భారత్‌పై అమెరికా విధించిన అధిక టారిఫ్‌లు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయని ఐఎంఎఫ్ తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50 శాతం టారిఫ్‌లు దేశ ఎగుమతుల వృద్ధిని, పెట్టుబడుల విశ్వాసాన్ని, వాణిజ్యాన్ని ప్రభావితం చేస్తాయని హెచ్చరించింది. అధిక సుంకాలు, ప్రపంచ వాణిజ్య భారం, భౌగోళిక అంశాలు భారత ఆర్థిక వ్యవస్థకు నష్టాన్ని కలిగిస్తాయని ఐఎంఎఫ్ తెలిపింది. కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియకు (సిఐఆర్‌పి) తీసుకుంటున్న సమయం 700 రోజులకు పైగా పెరిగిందని, దీనివల్ల పెట్టుబడి సామర్థ్యం, విశ్వాసం పడిపోనుందని పేర్కొంది. దేశంలో ప్రయివేటు పెట్టుబడులు అస్థిరంగా ఉన్నాయని తెలిపింది. వాటి స్థానంలో ప్రభుత్వ పెట్టుబడులు అధికంగా నమోదవుతున్నాయని పేర్కొంది. ప్రభుత్వం చేస్తోన్న అధిక అప్పులు నామమాత్రపు జిడిపి పెంచడానికి సరైన మార్గం కాదని సూచించింది.

అనంతపురంలో విషాదం

రామగిరి డిప్యూటీ తహశీల్దార్ భార్య, కుమారుడు అనుమానాస్పద మృతి



ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలో గురువారం రాత్రి విషాద ఘటన చోటు చేసుకుంది. నగరంలోని శారదా నగరంలో ఓ ఇంట్లో రక్తపు మడుగులో ఐదేళ్ల బాలుడు, ఉరేసుకున్న స్థితిలో బాలుని తల్లి ఉన్న ఘటనను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతులిద్దరూ శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం డిప్యూటీ తహశీల్దార్ భార్య, కుమారుడు.

పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అనంతపురం శారదా నగర్‌లో రవికుమార్ తన భార్య అమూల్య (30), ఐదేళ్ల కుమారుడు ప్రహర్షతో కలిసి నివసిస్తున్నారు. రామగిరి తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా రవికుమార్ విధులు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి ఇంటి తలుపులు మూసి ఉండడంతో స్థానికులకు అనుమానం వచ్చి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకుని తలుపులు బద్దలుకొట్టి లోపలికి వెళ్లారు. రక్తపు మడుగులో కుమారుడు, ఫ్యాన్‌కు ఉరేసుకున్న స్థితిలో అమూల్య ఉన్నారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. డిఎస్‌పి శ్రీనివాసులు పర్యవేక్షణలో వన్‌టౌన్ పోలీసులు కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఈ రెండు మరణాలకు కుటుంబ కలహాలా? లేక ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా.? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అమూల్య బంధువులు మాత్రం తమ అమ్మాయి ఇబ్బందులు ఏమిటో తమతో ఎప్పుడూ చెప్పలేదని, ఇంత ఘోరం ఎందుకు జరిగిందో అంటూ కన్నీటి పర్యంతం అవుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

అమరావతే గ్రోత్ ఇంజన్

- రెండోదశ ల్యాండ్ పూలింగ్‌కు సహకరించండి
- రాజధానిగా గుర్తించాలని కేంద్రాన్ని కోరతాం
- రైతులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతే రాష్ట్రానికి గ్రోత్ ఇంజన్‌గా ఉండాలని, రాజధాని అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సచివాలయంలో రాజధాని రైతులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని రైతులకు న్యాయం చేయడం తన బాధ్యత అని అన్నారు. ఇక్కడ జరిగిన అభివృద్ధి ఫలాలను రాజధాని రైతులే ముందు అందుకోవాలని చెప్పారు. రాజధానిలో రెండో విడత ల్యాండ్ పూలింగులో భూములు తీసుకుని అభివృద్ధి చేద్దామని చూస్తున్నామని సిఎం తెలిపారు. తన హయాంలో ఎప్పుడూ భూసేకరణలో ఇబ్బందులు రాలేదన్నారు. భూముల ధరలు పెరగబోతున్నాయని, రిటర్నబుల్ ప్లాట్లను రైతులు అమ్ముకోవద్దని చెప్పారు. కొందరు రైతులు ఎఫ్‌ఎస్‌ఐ పెంచాలని కోరుతున్నారని, దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. రైతులు చెప్పే ఏ సమస్యనైనా వీలైనంతవరకు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అందరూ కలిసి కట్టుగా ఉండాలని, ఐకమత్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. రెండో విడత భూ సమీకరణకు పూర్తిగా సహకరిస్తామని ముఖ్యమంత్రితో రైతులు చెప్పినట్లు సిఎం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సిఎం రూపొందించిన ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తే తమకు మేలు జరుగుతుందని రైతులు అన్నారు. రెండోదశ పూలింగ్‌కు అంగీకరించకపోతే అమరావతి మున్సిపాల్టీగానే మిగిలిపోతుందని ముఖ్యమంత్రి రైతులతో అన్నట్లు సమాచారం. ఈ సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ, ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబు, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సమస్యలు వినిపించండి
ఎంపిలకు సిఎం దిశానిర్దేశం

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాష్ట్ర సమస్యలను స్పష్టంగా వినిపించాలని టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఎంపీలకు సూచించారు. పార్టీ ఎంపీలంతా సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన టిడిపి పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మొంథా తుపాను నష్టపరిహారం త్వరగా రాష్ట్రానికి అందేలా చూడాలని సూచించారు. కృష్ణా - గోదావరి జలాల్లో, గోదావరి ట్రిబ్యునల్, సాగునీటి ప్రాజెక్టుల అనుమతులపై కేంద్రాన్ని ఒప్పించేలా పార్లమెంట్‌లో రాష్ట్ర గొంతుకను వినిపించాలన్నారు. వంశధార మిగతా 5లో

ట్రంప్ టారిఫ్‌లతో సమస్యలు

- మోడీ పాలనలో లక్ష మంది రైతుల ఆత్మహత్య
- స్వామినాథన్ సిఫార్సులు అమలు చేసే ఏకైక రాష్ట్రం కేరళ
- నాడు వ్యవసాయ చట్టాలు, నేడు కార్మిక చట్టాల మార్పు కార్పొరేట్ల కోసమే
- అఖిల భారత కిసాన్ సభ ఆలిండియా అధ్యక్షులు అశోక్ ధావలే



సెమినార్‌లో మాట్లాడుతున్న అఖిల భారత కిసాన్ సభ ఆలిండియా అధ్యక్షులు అశోక్ ధావలే

ప్రజాశక్తి - భీమవరం

ట్రంప్ టారిఫ్‌లతో దేశంలోని రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఆయినా మోడీ ప్రభుత్వం స్పందించడం లేదని అఖిలభారత కిసాన్ సభ ఆల్ ఇండియా అధ్యక్షులు అశోక్ ధావలే అన్నారు. స్థానిక ఎఎస్‌ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్దరాజు రామం 31వ వర్ధంతిని పురస్కరించుకుని 'రైతాంగ సమస్యలు-ప్రభుత్వాల బాధ్యత' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. తొలుత అల్లూరి సాంస్కృతిక కేంద్రం ప్రాంగణంలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి, ఉద్దరాజు రామం, స్వామినాథన్ చిత్రపటాలకు అశోక్ ధావలె, వి.కృష్ణయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సెమినార్‌కు ఉద్దరాజు రామం ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన సీతారాం అధ్యక్షత వహించారు. ముఖ్య వక్త అశోక్ ధావలె మాట్లాడుతూ విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, రైతాంగ ఉద్యమ నేత ఉద్దరాజు రామం, పుచ్చలపల్లి సుందరయ్య వంటి మహనీయులు నడియాడిన నేలకు తాను రావడం ఆనందంగా ఉందన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యంపై పోరాడి సాధించుకున్న 78 ఏళ్ల స్వాతంత్ర భారతంలో రైతాంగం అనేక సమస్యలు ఎదుర్కొంటుందన్నారు. ముఖ్యంగా ప్రతి సంవత్సరం సుమారు 10 వేల మందికిపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. దేశంలో ట్రంప్ టారిఫ్ భారాలతో రైతాంగం తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోయిందన్నారు. ముఖ్యంగా ఆక్వా రైతులు నష్టపోతున్నారన్నారు. అమెరికా నుంచి పత్తి దిగుమతికి 11 శాతం పన్ను చెల్లించాల్సి ఉండగా, నేడు ట్రంప్‌కు లొంగిపోయిన మోడీ ఆ పన్నును ఎత్తివేశారని, దీంతో మన దేశంలోని పత్తి రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 40 ఏళ్లలో నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ఒక్క మోడీ హయాంలోనే సుమారు లక్ష మంది ఆత్మహత్య చేసుకున్నారని, ఇది మిగతా 5లో

వికలాంగుల రక్షణకు కఠిన చట్టాలు అవసరం

- కేంద్రానికి సుప్రీంకోర్టు హితవు
- కండరాల క్షీణత బాధితులపై నోరుపారేసుకున్న యుట్యూబర్ సమయ్ రైనా క్షమాపణలు

న్యూఢిల్లీ : వికలాంగులను కించపరిచే వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా ఎస్‌సి-ఎస్‌టి అట్రాసిటి నిరోధక చట్టం తరహాలో కఠినమైన చట్టాలు అవసరమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ దిశగా ఆలోచన చేయాలని కేంద్ర ప్రభుత్వానికి హితవు పలికింది. యూట్యూబర్ సమయ్ రైనా, ఇతరులకు సంబంధించి పిటిషన్ల విచారణ సందర్భంగా గురువారం నాడు సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. కండరాల క్షీణత సమస్యపై అవగాహన కల్పిస్తూ బాధితులతో కలిసి ఒక ప్రదర్శన నిర్వహించాలని ఈ సందర్భంగా సమయ్ రైనాకు సుప్రీం కోర్టు సూచించింది. ఒక ఆన్‌లైన్ షోలో వెన్నెముక కండరాల క్షీణత (ఎస్‌ఎంఎ)తో బాధపడుతున్న ఓ చిన్నారికి అవసరమైన ఔషధాల గురించి ప్రస్తావిస్తూ వారిని కించపరిచే విధంగా సమయ్ రైనా వ్యాఖ్యలు చేశారు. దీంతో సమయ్ రైనాతో పాటు ఈ షోలో పాల్గొన్న వారిపై తీవ్ర విమర్శలు వచ్చాయి.

ఈ అరుదైన వ్యాధిపై పోరాడుతున్న స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం.. ఆ షోలో పాల్గొన్న వారు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. ఈ మేరకు సమయ్ రైనా క్షమాపణలు చెప్పారు. రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాలకు సంబంధించిన పిటిషన్లను సుప్రీంకోర్టు గురువారం విచారించింది. బాధితుల తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్.. కమెడియన్ వ్యాఖ్యలు చిన్నారులను కించపరిచేలా ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. వారు ఎంతో ప్రతిభావంతులని, ఇలాంటి వ్యాఖ్యలు క్రౌడ్ ఫండింగ్‌కు ఇబ్బందిగా మారుతాయన్నారు. ఈ వ్యాఖ్యలతో సిజెఐ జస్టిస్ సుర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఏకీభవించింది. వికలాంగులపై ఎవరైనా కించపరిచే వ్యాఖ్యలు చేస్తే.. ఎస్‌సి-ఎస్‌టి చట్టం మాదిరిగా కఠిన చట్టాన్ని తీసుకువచ్చే విషయంపై ఎందుకు ఆలోచించరు? అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం ప్రశ్నించింది.

శని, ఆదివారాల్లో భారీ వర్షాలు

- తుపాన్‌కు 'దిత్వా'గా నామకరణం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నైరుతి బంగాళాఖాతం, ఆగ్నేయ శ్రీలంక భూమధ్యరేఖ భారత మహాసముద్రానికి అనుకుని ఉన్న ప్రాంతాల్లో ఏర్పడిన వాయుగుండం వల్ల శని, ఆది వారాల్లో రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ తుఫాన్‌కు 'దిత్వా'గా నామకరణం చేసినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి అనుకుని ఉన్న దక్షిణకోస్తా తీరాలకు గడిచిన 6 గంటల్లో 15 కిలోమీటర్ల(కిమీ) వేగంతో తుపాన్ కదిలినట్లు తెలిపింది. ట్రింకోమలీ(శ్రీలంక)కు 200కిమీ, పుదుచ్చేరికి 610 కిమీ, చెన్నైకి ఆగ్నేయంగా 700కిమీ దూరంలో కేంద్రీకృతమయినట్లు పేర్కొంది. ఆదివారం తెల్లవారుజామునకి నైరుతి బంగాళాఖాతం తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాలకు చేరుకునే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో శని, ఆదివారాల్లో భారీ వర్షాలు ఉంటాయని ప్రకటించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించింది.



అంతర్జాతీయ ముఠా వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి

అంతర్జాతీయ డిజిటల్ ముఠా గుట్టురట్టు

- 13 మంది అరెస్టు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అంతర్జాతీయ డిజిటల్ ముఠాను పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మొత్తం 13 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.61,35,231 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి గురువారం విలేకరులకు వెల్లడించారు. భీమవరం టూ టౌన్ పరిధిలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ప్రొఫెసర్‌కు ఈ నెల 17న కొందరు వ్యక్తులు ఫోన్ చేసి అతని బ్యాంకు ఖాతా నుంచి రూ.78.6 లక్షలు మాయం చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కార్డు డీల్ పద్ధతిలో ముంబైకు చెందిన రహతే జే నయన్ అనే వ్యక్తి కాంబోడియాలో డిజిటల్ నేరాలకు పాల్పడు తున్నాడు. బ్యాంకు ఖాతా వ్యక్తికి ఫోన్ చేసి మాయ మాటలతో అతని అకౌంట్ నుంచి డబ్బులు ఖాళీ చేసి, వాటిని కమిషన్ల పద్ధతిలో ముఠా బ్యాంకు ఖాతాలకు వేస్తారు. వీరు కమిషన్ తీసుకుని మిగిలిన సొమ్మును కంబోడియా వ్యక్తికి జమ చేస్తారు. అయితే అదే సాంకేతికతను ఉపయోగించిన పోలీసులు ముఠాలోని 13 మందిని విజయవాడలో అరెస్ట్ చేశారు. మరొకరు పరారీలో ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ.42 లక్షలు నగదు, వివిధ బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ.19,35,231 నగదు సీజ్ చేసినట్లు ఎస్‌పి తెలిపారు. అంతర్జాతీయ సిమ్ కార్డులతో కూడిన 15 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

కొత్త జిల్లాలకు.. ప్రాథమిక నోటిఫికేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కొత్త జిల్లాలకు రాష్ట్రప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ గురువారం విడుదల చేశారు. మదనపల్లె, మార్కాపురం జిల్లాలతో పాటు రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేశారు. నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర, అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, మదనపల్లె జిల్లాలో పీలేరు, ప్రకాశం జిల్లాలో అద్దంకి రెవెన్యూ డివిజన్‌ను నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే 30 రోజుల్లో ఆయా జిల్లాల కలెక్టర్లకు లిఖిత పూర్వకంగా తెలపాలని తెలిపారు. కొత్త జిల్లాలు, నూతన రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో పాటు కొన్ని మండలాలను వేరే జిల్లాలకు మారుస్తూ మరో నోటిఫికేషన్ విడుదల చేశారు.

రేషన్‌లో రాగులు

వచ్చే నెలలో బియ్యం బదులుగా మూడు కేజీల వరకు పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

డిసెంబరు నెల రేషన్‌లో రాగులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని చౌక ధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ అందించనుంది. బియ్యం బదులు కేజీ రాగులు ఇవ్వాలని భావిస్తోంది. ఈ ఏడాది ఆగస్టులో రాగులు అందించిన ప్రభుత్వం సేకరణ జరగకపోవడంతో మూడు నెలల పాటు ఆపేసింది. మళ్లీ దానిని పునరుద్ధరించాలని నిర్ణయించింది. కార్డుదారులకు కేజీ నుంచి మూడు కేజీల వరకు ఉచితంగా రాగులు ఇవ్వనుంది. ఆ మేరకు బియ్యంలో కోత విధించనుంది. రాగులతో పాటు బియ్యం, పంచదార అందించనుంది. కందిపప్పు ఈ నెలా ఇవ్వడం లేదు. ఏయే డిపోలకు ఎంత మేరకు రాగులు అవసరమో డీలర్ల నుంచి అధికారులు ఇండెంట్‌లు తీసుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 29, 796 చౌక ధరల దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం ఒక కోటి 48 లక్షల 3 వేల 221 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో 4 కోట్ల 34 లక్షల 81 వేల 193 మంది సభ్యులుగా ఉన్నారు. కార్డుదారులకు రాగులు అందించేందుకు 43,142 మెట్రిక్ టన్నుల మేర రాగులు అవసరమని గుర్తించింది. అందులో ఇప్పటివరకు 42,374 టన్నుల వరకు విడుదల చేసింది. ఏయే డిపోలకు



ఎంత మేర రాగులు కావాలో డీలర్ల నుంచి ఇండెంట్ తీసుకుంటున్నారు. అందుకనుగుణంగా డిపోలకు కావాల్సినంత పరిమాణంలో రాగులను ఇవ్వాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఒక్కో కార్డుదారునికీ కేజీ నుంచి మూడు కేజీల వరకు ఉచితంగా రాగులు అందించనుంది. ఆ మేరకు బియ్యంలో కోత పెట్టనుంది.

ఈ నెలా కందిపప్పు లేనట్టే

రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు ఎప్పుడు ఇస్తారో, ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 డిసెంబరులో 50 శాతం కుటుంబాలకు, 2025 జనవరిలో కార్డుదారులందరికీ పంపిణీ చేశారు. తర్వాత అక్కడ నుంచి రేషన్‌లో కందిపప్పు ఇవ్వడమే మానేశారు. రేషన్‌లో కందిపప్పు కోసం పది నెలలుగా లబ్ధిదారులు ఎదురుచూస్తునే ఉన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా కందిపప్పు పంపిణీ నిలిచిపోవడంతో కార్డుదారులు బయట మార్కెట్లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. బహిరంగ మార్కెట్‌లో కేజి కందిపప్పు రూ.135 ఉంది. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా రాయితీపై కేజీ రూ.67లకే కందిపప్పు అందించేది. ఇది కార్డుదారులకు అధిక ధర నుంచి ఉపశమనం కలిగించేది. ప్రభుత్వం ఆపేసిన తర్వాత బహిరంగ మార్కెట్లో ధరలను దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులు స్థానికంగా ఉన్న రైతు బజార్ల ద్వారా గతంలో కందిపప్పు అందించేవారు. ఇప్పుడు అదీ లేకపోవడంతో బయట మార్కెట్‌లో కందిపప్పును అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

సంపాదకీయం


అన్నదాతను ఆదుకోవాలి

"రైతు దు:ఖిస్తే రాజ్యం వర్ధిల్లదు" అని పెద్దలు అంటారు. కానీ, మనదేశంలో రైతు కన్నీరు పెట్టుకోని రోజే లేకుండాపోయింది. బలవంతపు భూసేకరణలు, ప్రకృతి వైపరీత్యాలు, పంటలకు మద్దతు ధర దక్కని పరిస్థితులు ... అన్నదాతను నిత్యం అవస్థల పాలు చేస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది మన రాష్ట్రంలో ఖరీఫ్‌లో యూరియా కొరత దగ్గర నుంచి ప్రతి పంట కాలంలోనూ సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. మామిడి, బర్లీ పొగాకు, మిరప, పత్తి, ఉల్లి, చెరుకు, మొక్కజొన్న, టమాటా, ధాన్యం, తాజాగా అరటి రైతులు పెట్టుబడి కూడా తిరిగి చేతికి రాకపోవటంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రతి ఏటా ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమవుతున్నా- రైతాంగాన్ని ఆదుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళిక చేపట్టకపోవటం విచారకరం. సమస్య ముందుకొచ్చినప్పుడు సానుభూతి చూపించటం, ఏవో కొన్ని ఉపశమన చర్యలు తీసుకోవటంతోనే పాలకులు చేతులు దులుపుకోవటం శోచనీయం.

సంపన్నులైనా సామాన్యులైనా బతకటానికి అన్నం తినాల్సిందే! అలాంటి ఆహారాన్ని ఆరుగాలం శ్రమించి దేశానికి అందించేది రైతులు, వ్యవసాయ కార్మికులు. ఇంత కీలకమైన ఆహారోత్పత్తిని సాధిస్తున్న వ్యవసాయరంగం పట్ల పాలకులు ప్రత్యేకమైన శ్రద్ధ చూపించాలి. ఆసరా అందించాలి. దురదృష్టవశాత్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటిలోనూ అలాంటి స్పృహ లోపించింది. ఎరువులు, విత్తనాలపై ఇచ్చే రాయితీలకు ఏటేటా దిగ్గోత కొనసాగుతోంది. పోనీ, అధిక ధరలకిచ్చే ఎరువులు, విత్తనాలనైనా సకాలంలో సమకూర్చుతున్నారా అంటే అదీ లేదు. ఈ ఏడాది ఖరీఫ్‌లో యూరియా కొరతతో విలవిల్లాడిన రైతులు పోలీసు లాఠీలను కూడా రుచి చూడాల్సి వచ్చింది. తోతాపురి మామిడి ధర దారుణంగా పడిపోయింది. ఆ తరువాత ఉల్లి పంటకూ అదే పరిస్థితి! మార్కెట్టుకు తెచ్చిన పంట అమ్ముడుపోక, నిరాశ చెందిన రైతులు దానిని రోడ్లపైనే పారబోసి, నిరసన వ్యక్తం చేసిన దృశ్యాలు ప్రతి ఒక్కరినీ కలచివేశాయి. వీటికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పూర్తిస్థాయిలో అమలు కాకుండానే పోయింది. ఆశలు కల్పించి సాగులోకి దించిన పొగాకు కంపెనీలు ఆ తరువాత పంటను కొనకుండా చేతులెత్తేసినా, రాష్ట్ర ప్రభుత్వం కిమ్మనలేదు. కోసిన కూలి కూడా రానంత స్థాయికి ధర దిగజారిపోయి టమాటా రైతులు కూడా కన్నీరు పెట్టుకున్నారు. లక్షల రూపాయల పెట్టుబడిని నష్టపోయామని నెత్తీనోరూ కొట్టుకున్నా పాలకుల చెవికెక్కింది లేదు. ఇప్పుడు రిటైల్ మార్కెట్లో అరటి ధర బాగానే ఉన్నా - రైతుల దగ్గర మాత్రం కొనుగోలు ధర కుప్పకూలిపోయింది! పంటలకు ప్రభుత్వం నుంచి కనీస ధర మద్దతు, మార్కెట్లో పర్యవేక్షణ, జోక్యమూ ఉంటే ఇలాంటి దుస్థితి దాపురించదు. దళారుల దయాదాక్షిణ్యాల మీద, మార్కెట్ శక్తుల మాయోపాయాల మీద వదిలిస్తే- దిగుబడులు ముమ్మరంగా ఉన్న వేళ ధరల తగ్గింపు నాటకాలు యథేచ్ఛగా సాగుతూ ఉంటాయి. ఒక వేళ నిజంగానే మార్కెట్టు ఒడిదుడుకులకు గురైనా రైతు పడిపోకుండా ప్రభుత్వం ఆదుకోవాలి. తగినంత స్థాయిలో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి. ఇరవై ఏళ్ల క్రితమే స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను అమలు చేయాలి. సి2 ప్లస్ 50 ఫార్ములా ఉన్నంతలో రైతులను కష్టాల ఊబిలోనుంచి బయటకు తేగలిగిన ఆచరణీయ సిఫార్సు. దానిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ అమలు చేయాల్సిన అవసరం ఉంది.

ప్రకృతి వైపరీత్యాలకు, పాలకుల అరిష్టాలకు ఎదురొడ్డి సాగుతున్న మన వ్యవసాయ రంగంలోకి చొచ్చుకురావాలని అమెరికా కార్పొరేటు కంపెనీలు ఎన్నేళ్ళ నుంచో కాచుక్కూచున్నాయి. అన్నదాతల గురించి ఒకపక్క మొసలి కన్నీరు కారుస్తూనే- మరోపక్క కార్పొరేట్లకు తాకట్టు పెట్టే కుటిల యత్నాలను బిజెపి ప్రభుత్వం కొనసాగిస్తూ ఉంది. పత్తి దిగుమతి అంశంలో మోడీ సర్కారు లొంగుబాటు మన రైతుల కష్టాలను పెంచబోతోంది. ట్రంపు ఒత్తిళ్లకు తలొగ్గి, వ్యవసాయ రంగంలో చేసుకుంటున్న ఒప్పందాలు భారత రైతాంగానికి వెన్ను విరుపే అవుతుంది. భారత రైతాంగమూ, వారి శ్రేయస్సును కోరుకునే ప్రజలూ ఐక్యంగా రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి. పంటలను, రైతులను మార్కెట్ల గాలికి వదిలేయకుండా తగు రక్షణ, భరోసా కల్పించేలా పాలకులపై ఒత్తిడి తేవాలి.

మహనీయుని మాట



విజ్ఞానం ద్వారా బలమైన తాత్త్వికత, నిజాయితీ, బుద్ధి కుశలత లభిస్తాయి. శ్రమ పట్ల గౌరవం ఏర్పడుతుంది.

- గోర్కీ
ప్రసిద్ధ రష్యన్ రచయిత

బకాయిలు కొండంత! ఇచ్చేది గోరంత!!


వ్యాఖ్య

జె. రవికుమార్

మన రాష్ట్రంలో ఉన్నత విద్య చదువుతున్న వేలాదిమంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ అనేది జీవనాధారం. గత మూడేళ్లుగా స్కాలర్‌షిప్‌లు అరకొరగా విడుదల చేయడంతో 14 లక్షల మంది విద్యార్థులలో అధిక భాగం విద్యార్థులు బతుకులు చిద్రమయ్యాయి. వారిపై తీవ్రమైన ఆర్థిక , మానసిక ఒత్తిడి పెరిగిపోతోంది. ఫీజు రీయింబర్స్మెంట్ అనేది భిక్ష కాదు , ఎంతోమంది విద్యార్థులు పోరాడి సాధించుకున్న హక్కు. ప్రభుత్వ అధికార లెక్కల ప్రకారం 2023 నుండి ఇప్పటి వరకు దాదాపుగా 6,800 కోట్ల రూపాయల స్కాలర్‌షిప్ పెండింగ్ ఉంది. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం, గత వైసిపి ప్రభుత్వం ఇద్దరిదీ తప్పు ఉంది. అధికారం నుంచి దిగిపోతున్నాం మాకేంటి అనే ఆలోచనలో వైసీపీ ప్రభుత్వం 3.8 వేల కోట్ల రూపాయలు పెండింగ్ పెడితే, తన యువగళం పాదయాత్రలో విద్యా రంగాన్ని గాడిన పెడతా అని చెప్పిన నారా లోకేష్ నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్టు సంవత్సరం ఆరు నెలల కాలంలో పాత బకాయిలు ఇవ్వకపోగా 3 వేల కోట్ల రూపాయల పెండింగ్ పెట్టారు.

విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు

డిగ్రీ , ఇంజనీరింగ్ విద్యార్థులకు సాధారణంగా మన రాష్ట్రంలో ఫీజులు లక్షల్లోనే ఉంటున్నాయి. ప్రధానంగా నూతన జాతీయ విద్యా విధానం అమల్లోకి వచ్చాక ఎయిడెడ్, ప్రభుత్వ విద్యా సంస్థలు మూతపడి పెద్ద ఎత్తున కళాశాలలు అన్ని కార్పొరేట్ హస్తాల్లోకి వెళ్లిపోయాయి. కాబట్టి ఈ లక్షల రూపాయల ఫీజు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో అవి చెల్లించలేక అప్పులు చేస్తున్నారు. కొన్ని సార్లు ఈ అప్పులు ప్రైవేటు ఫైనాన్స్ వారి వద్ద మరియు లోన్ ఆప్స్ లో తీసుకోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక వైపు హాస్టల్ ఫీజులుతో పాటు మెస్ బిల్లులు , కళాశాలకు ప్రయాణపు ఖర్చులు , పుస్తకాలు , ఎగ్జామ్ ఫీజులు మారుతున్న సమాజంలో పెరిగిన ధరలతో ఆ ఖర్చులన్నీ వారి కుటుంబానికి మోయలేని భారాన్ని ఇస్తున్నది. అనేక మంది ఆ భారాన్ని భరించలేక చదువు మధ్యలోనే ఆపేసే పరిస్థితి. మా ఊరిలో ప్రతీ ఏడాది ఇంటర్మీడియట్ 50 మంది చదివితే ఉన్నత విద్యకు వచ్చేసరికి 10 మంది కూడా ఉండడం లేదు. దీనికి కారణం చదువుకోలేక కాదు చదువు కొనలేక! కళాశాలల్లో ఫీజులు చెల్లించలేకపోవడంతో ఆ కళాశాలలు పరీక్ష హాల్ టికెట్స్ ఆపేసి విద్యార్థులను రోడ్డు మీద పడేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం మీడియా ముందుకు వచ్చి ఎవరూ విద్యార్థులను ఇబ్బంది పెట్టకూడదు అని చెప్తుంది. కానీ ఆ ప్రభుత్వం లోనే భాగస్వాములుగా ఉన్న అశోక గజపతిరాజు గారి మహారాజా కళాశాలలోనే విద్యార్థులపై ఫీజుల కోసం దారుణమైన వేధింపులు జరుగుతున్నాయి. ఇంత కష్టపడి ఉన్నత విద్య పూర్తయిన తరువాత పూర్తి స్థాయి స్కాలర్‌షిప్ విడుదల కాకపోవడంతో సర్టిఫికెట్స్ ఇవ్వని పరిస్థితి. ఆ సర్టిఫికెట్స్ ఇవ్వకపోవడంతో ఉద్యోగాల విషయంలో అనేక ఇబ్బందులు గురవుతున్నారు.



ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆ ప్రాంతంలో విద్యావ్యవస్థ పునాదిగా ఉంటుంది. మరి అటువంటి విద్యావ్యవస్థకి మన రాష్ట్రం బడ్జెట్లో 30% నిధులు కేటాయించాల్సి వస్తే కేవలం 12% నిధులు విదిలిచండం చూస్తే వారికి విద్యా వ్యవస్థ పై ఉన్న శ్రద్ధ ఏంటో అర్థమవుతుంది. పోనీ కేటాయించిన ఆ నిధులైన ఖర్చు చేస్తున్నారా అంటే అవసరానికి తగ్గట్టు వేరే శాఖలకు ఆ నిధులను మళ్లిస్తున్నారు.

విద్యార్థుల పోరాటాలు

ఎప్పుడూ లేనంతగా నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యార్థుల నుండి తీవ్ర ఆందోళన చవి చూసింది. ఉన్నత విద్య చదివే వారిలో 72.9% మంది వెనకబడిన తరగతులకు చెందిన వారే. ఆర్థికంగా బలం లేకపోవడంతో వారు పడుతున్న కష్టాలలో నుండి తిరుగుబాటు ప్రారంభం అవుతుంది. గతం ప్రభుత్వ పతనం లో విద్యార్థుల పోరాటాలది ముఖ్యమైన పాత్ర అనేది ఎవరు కాదనలేని సత్యం. రాష్ట్ర వ్యాప్తంగా స్కాలర్‌షిప్స్ కోసం అనేక సార్లు విద్యార్థులు కలెక్టరేట్ ను ముట్టడించి, తమ గళం విప్పారు. ప్రతీ జిల్లాల్లో వేలాది మంది ఈ పోరాటాల్లో పాల్గొంటున్నారు. ఈ 16 నెలల కాలంలో విజయనగరం జిల్లాలో ఏడుసార్లు విద్యార్థుల ప్రత్యక్ష ఆందోళనకు దిగడం చూస్తుంటే విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అర్థమవుతున్నాయి. ఒక విజయనగరం జిల్లానే కాక విశాఖపట్నం, పార్వతీపురం, ఉభయగోదావరి జిల్లాలు , కర్నూలు ,అనంతపురం ,తిరుపతి ఇలా రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో విద్యార్థులు ఫీజు రియంబర్స్మెంట్ కోసం పోరాటం కొనసాగిస్తున్నారు. సాక్షాత్తు రాష్ట్ర మంత్రులైన గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్‌లను విజయనగరం జడ్పీ హాల్‌లో వేల సంఖ్యలో విద్యార్థులు నిర్బంధించడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. జిల్లాలో ఉన్న ఏడుగురు ఎమ్మెల్యేలను, కలెక్టర్, ఎంపీలను కూడా ఆ నిర్బంధంలో చిక్కుకున్నారు. ఆందోళన నుంచి తప్పించుకోవడానికి మంత్రివర్గంలో మాట్లాడతామని చెప్పిన ఇద్దరు మంత్రులు మంత్రివర్గ సమావేశంలో పన్నెత్తుమాట కూడా మాట్లాడకపోవడం విడ్డూరం.

మన రాష్ట్రంలో ఫీజ్ రీయంబర్స్‌మెంట్ పథకం 2002-03 లో చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రి ఉన్నప్పుడు మొదలైంది. దీనికి ప్రధాన కారణం ఆనాడు ఎస్ఎఫ్ఐతో పాటు పలు విద్యార్థి సంఘాలు చేసిన పోరాటమే. ఇది మొదట ఎస్‌సి. ఎస్‌టి, బిసి విద్యార్థుల కోసం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత 2007లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ పథకాన్ని విస్తరించి, అన్ని సామాజిక వర్గాల విద్యార్థులకు 100% రీయంబర్స్‌మెంట్ కల్పించారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు వారి కాలేజీ ఫీజులు, పరీక్ష ఫీజులు మొదలైన ఖర్చులను ప్రభుత్వం ద్వారానే భరించటం ద్వారా ఉన్నత విద్యలో విద్యార్థులకు చేయూత అందించడం. ఫీజు భారం వల్ల విద్యార్థులు విద్యను మధ్యలోనే నిలిపివేయకుండా చూడటం, సమానంగా విద్య అవకాశాలు పొందేలా చేయడం ఈ పథకం లక్ష్యం. కానీ ఆ లక్ష్యం ఇప్పటివరకు ఏ ప్రభుత్వ హయాంలోనూ నెరవేరలేదు. ఎందుకంటే అప్పటి నుండి ఇప్పటి వరకు ఉన్న ప్రభుత్వాలన్నీ ఎంత సేపు ప్రచారం చేసుకోవడం తప్ప పూర్తిస్థాయిలో అవసరమైన నిధులను విడుదల చేయలేదు.

ప్రభుత్వం మారితే పథకం పేరు మార్చడమే తప్ప పేద , బడుగు , బలహీన వర్గాల విద్యార్థులకు న్యాయం చేయాలనే ఆలోచన లేదు. దీన్ని ఈ మధ్య కాలంలో విద్యార్థులు గమనించి రోడ్డు ఎక్కుతున్నారు. 14 లక్షల మందికి న్యాయం చేయడం కోసం పెట్టిన ఈ పథకం కనీసం 14 వేల మందికి కూడా ఉపయోగపడలేదు. ఒక ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి దాదాపుగా 90 వేల రూపాయల వరకు స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వం ఆ స్కాలర్‌షిప్ విడుదల చేయకపోవడంతో నాలుగు సంవత్సరాలకు గాను దాదాపుగా మూడున్నర లక్షల రూపాయలు కళాశాలకు బాకీ పడుతున్నాడు. ఆ బాకీ చెల్లించలేక సర్టిఫికెట్లు పొందే అవకాశాన్ని కోల్పోతున్నారు.

విద్యార్థులు ఏం కోరుతున్నారు?

ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదలకు అకడెమిక్ క్యాలెండర్‌తో లింక్ ఉన్న టైమ్‌బౌండ్ షెడ్యూల్‌ను చట్టబద్ధం చేయాలి. జ్ఞానభూమి వంటి పోర్టల్స్‌లో ప్రతి విద్యార్థికి తన అప్లికేషన్, బిల్లు ప్రాసెసింగ్, రీలీజ్ స్టేజీల వివరాలు పారదర్శకంగా, రియల్ టైమ్‌లో కనిపించేలా సిస్టమ్ బలోపేతం చెయ్యాలి. ఆలస్యాన్ని కారణం చూపి కాలేజీలు విద్యార్థులను అవమానించడం, పరీక్షలకు అనుమతించకపోవడం, సర్టిఫికెట్లను ఆపివేయడం వంటి చర్యలను నిరోధించడానికి కఠినమైన గైడ్‌లైన్స్ రూపొందించి అమలు చేయాలి. గ్రామీణ, గిరిజన, బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థుల పెండింగ్ బకాయిలన్నీ నిర్దిష్ట గడువులో పూర్తిగా విడుదల చేయాలని, భవిష్యత్తులో ఈ పరిస్థితి రాకుండా చూసేందుకు ప్రత్యేక మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేయాలని విద్యార్థులు కోరుతున్నారు. అత్యంత న్యాయమైన ఈ డిమాండ్లు కూడా పరిష్కారానికి దూరంగా ఉన్నాయి,. గత 16 నెలలుగా సాక్షాత్తు ముఖ్యమంత్రి కుమారుడు విద్యాశాఖ మంత్రిగా ఉన్నా సరే వీటిలో ఒక్క డిమాండ్ కూడా పరిష్కరించే పరిస్థితి లేకుండా పోయింది. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆ ప్రాంతంలో విద్యావ్యవస్థ పునాదిగా ఉంటుంది. మరి అటువంటి విద్యావ్యవస్థకి మన రాష్ట్రం బడ్జెట్లో 30% నిధులు కేటాయించాల్సి వస్తే కేవలం 12% నిధులు విదిలిచండం చూస్తే వారికి విద్యా వ్యవస్థ పై ఉన్న శ్రద్ధ ఏంటో అర్థమవుతుంది. పోనీ కేటాయించిన ఆ నిధులైన ఖర్చు చేస్తున్నారా అంటే అవసరానికి తగ్గట్టు వేరే శాఖలకు ఆ నిధులను మళ్లిస్తున్నారు.


చదువు హక్కు! దయ కాదు. చదువుకునే విద్యార్థికి స్కాలర్‌షిప్ ఇవ్వడం అంటే రాజ్యాంగం ఇచ్చిన విద్యా హక్కును ఆచరణలో పెట్టడానికి తీసుకున్న బాధ్యత. ఆ బాధ్యతను నిర్లక్ష్యంతో నిర్వర్తించడం అంటే పేద, మధ్యతరగతి, అణగారిన వర్గాల భవిష్యత్తుతో రాజీ పడటమే. ఆంధ్రప్రదేశ్‌లో గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న స్కాలర్షిప్‌ల సమస్యను తక్షణమే పరిష్కరించాలి. ఇకనుంచి ఒక్క విద్యార్థి కూడా "డబ్బుల్లేవని" చదువు మానేయాల్సిన దుస్థితి రాకూడదు. దీనికి బాధ్యత వహించాల్సింది విద్యా శాఖ మంత్రే!

చదువు హక్కు! దయ కాదు. చదువుకునే విద్యార్థికి స్కాలర్‌షిప్ ఇవ్వడం అంటే రాజ్యాంగం హామీ ఇచ్చిన విద్యా హక్కును ఆచరణలో పెట్టడానికి తీసుకున్న బాధ్యత. ఆ బాధ్యతను నిర్లక్ష్యంతో నిర్వర్తించడం అంటే పేద, మధ్యతరగతి, అణగారిన వర్గాల భవిష్యత్తుతో రాజీ పడటమే. ఆంధ్రప్రదేశ్‌లో గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న స్కాలర్షిప్‌ల సమస్యను తక్షణమే పరిష్కరించాలి. ఇకనుంచి ఒక్క విద్యార్థి కూడా "డబ్బుల్లేవని" చదువు మానేయాల్సిన దుస్థితి రాకూడదు. దీనికి బాధ్యత వహించాల్సింది విద్యా శాఖ మంత్రే! గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన మొత్తాన్ని విడుదల చేయమని విద్యార్థులు అడుగుతుంటే అది విడుదల చేయకపోగా, 16 నెలల కాలంలో 3.8 వేల కోట్ల రూపాయలకు కేవలం 800 కోట్ల రూపాయలు మాత్రమే విడుదల చేయడం దుర్మార్గం కాక మరేమవుతుంది. రాజ్యాంగ హక్కును నెరవేర్చే విధంగా విద్య అందరికీ అందే విధంగా పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి.

ఎస్ఎఫ్ఐ జిల్లా వైస్ ప్రెసిడెంట్
విజయనగరం, 7288849236

పీడిత జన బాంధవుడు జ్యోతిబా ఫూలే

నేడు వర్ధంతి



జాతిపిత మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ కన్నా ముందే 'మహాత్మునిగా' మన్ననలందుకున్న భారత సామాజిక తత్వవేత్త జ్యోతిబా పూలే. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, అణచివేతకు గురవుతున్న ప్రజల తరపున జీవితాంతం పోరాడారు. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలో పూలే జన్మించారు. ఆయన తండ్రి గోవిందరావు పీష్వాల కాలంలో పూల వ్యాపారం చేయడం వల్ల పూలే అని పేరు వచ్చింది. చిన్నతనంలో చదువు మానేసిన ఆయన.. ఆ తరువాత పుణేలో 1941లో క్రైస్తవ, ముస్లిం మిత్రుల సహకారంతో స్కాటిష్ మిషన్‌లో చేరి విద్యాభ్యాసం కొనసాగించారు. 1948లో బ్రాహ్మణ స్నేహితుని వివాహానికి హాజరైన సందర్భంగా బిసి "మాలి" కులానికి చెందిన పూలే కుల వివక్షకు గురయ్యారు. మిత్రుడు సదాశివ బిల్లాల్ గోవింద్‌తో పరిచయం, సాన్నిహిత్యం, "థామస్" రచనలు ఆయనపై ఎంతగానో ప్రభావం చూపాయి. కులం, వర్గం, ప్రాంతం, లింగం తదితర వివక్షతలకు అవిద్యే కారణమని భావించి, తన భార్య సావిత్రిని చదివించారు. 1848 ఆగస్టులో బాలికల పాఠశాలను 1851, 1852లో మరో రెండు పాఠశాలలను ఆదర్శ దంపతులు స్థాపించారు. 1853లో దేశంలోనే ప్రప్రథమంగా పూలే వితంతువుల అనాథ శిశువుల కోసం సేవా సదనం స్థాపించారు. శ్రామిక ప్రజల కోసం 1855లో 'రాత్రి బడి' స్థాపించారు. 1864లో "బాలహత్య ప్రతిబంధక్ గృహ" గర్భస్రావ వ్యతిరేక కేంద్రాన్ని స్థాపించారు. వితంతువులైన గర్భిణులకు అండగా నిలిచారు. 1868లో తన ఇంటి దగ్గరున్న స్నానాల తొట్టి వద్ద స్నానం చేసేందుకు అంటరానితనాన్ని అనుభవిస్తున్న పేదలను అనుమతించారు. బాల హత్య ప్రతిబంధక్ గృహలో జన్మించిన బ్రాహ్మణ వితంతు కుమారున్ని 1872లో దత్తత స్వీకరించారు. తనలా కుల వివక్ష ఇతరులకు అనుభవానికి రాకూడదని ఆకాంక్షించారు. తన భార్య సావిత్రితో కలిసి 40 ఏళ్ల పాటు నిర్వహించిన సామాజిక ఉద్యమాలు వారికి పేద జనోద్ధారకులుగా సమాజంలో గుర్తింపు తెచ్చాయి. ఎక్కడ అన్యాయం, వివక్ష చోటు చేసుకున్నా... అక్కడ ఉద్యమం నడిపారు. అణగారిన వర్గాలకే కాదు, సమాజంలో ఉన్నత కులాలుగా చెప్పబడుతున్న తరగతుల్లోని బాధిత వితంతువుల పునర్వివాహాలకు విశేష కృషి చేశారు. బ్రాహ్మణ వితంతువులకు శిరో ముండనాలు చేయబోమని క్షురకులచే సమ్మెలు చేయించారు. 1871లో దీనబంధు పత్రిక నడిపారు. సహపంక్తి భోజనానికి సంసిద్ధత ప్రకటించారు. 1873 సెప్టెంబరు 24న సత్య శోధక సమాజాన్ని పూలే స్థాపించారు.

బొంబాయిలో సత్యశోధక్ సమాజ్ ఏర్పాటుకు తెలుగువారైన సయాజీ నాగు, వెంకయ్య తదితరులు ఎంతో సహకరించారు. ఆర్థిక, హార్దిక సహాయాలను అందించారు. వెంకయ్య ఇల్లే అనాథ బాలల ఆశ్రమంగా ఉండేది. పూలే ప్రసిద్ధ గ్రంథం "గులాంగిరి" పుస్తకాన్ని 1873లో వెంకయ్యనే ప్రచురించారు.

1882లో హంటర్ కమిషన్‌కు' శూద్రాతి శూద్రులకు చదువు చెప్పించాల్సిన అవసరం ఉందని నివేదికలిచ్చి, అస్పృశ్యుల కోసం బ్రిటీష్ వారిచే పాఠశాలల్ని ఏర్పాటు చేయించారు. 83లో కల్టివేటర్ విప్ కార్డ్ (సేద్య గాడిపై చర్నాకోల) ముప్పై మూడు వ్యాసాల పుస్తకాన్ని సార్వజనిక సత్య ధర్మ పేరున ప్రచురించారు. బ్రాహ్మణేతరులు చేసిన కులాంతర వివాహాలు చెల్లవని బ్రాహ్మణులు తీర్మానాలు చేస్తే, సత్యశోధన మండలి ద్వారా కోర్టుకు వెళ్లారు. 1990లో కోర్టు పూలే వాదనను సమర్థించింది. 33 వ్యాసాలతో "సార్వజనిక్ సత్యధర్మ" పుస్తకం రచించి, కుటుంబ సృష్టి, నియమాల గురించి వివరిస్తూ ప్రపంచం మొత్తాన్ని ఒకే కుటుంబంగా వ్యక్తీకరించారు. సామాజిక ప్రజాస్వామ్యం సాధించటం భారత దేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మ పూలే తన గురువు అని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రకటించారు. కుల వ్యవస్థనే కాదు సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించిన పూలేకు కార్మికవర్గ, రైతాంగ పక్షంగా పోరాడే అవగాహన, కార్యాచరణ ఉన్నాయి. అనారోగ్యానికి గురై మృత్యుముఖంలో ఉన్న సమయంలో కూడా తన మరణానంతరం తన ఆదర్శాలను కొనసాగించేందుకు ఏర్పాట్లు చేసి, 63వ ఏట 1890 నవంబర్ 28న గురువారం రాత్రి కన్నుమూశారు.

- రామ కిష్టయ్య సంగనభట్ల,
సీనియర్ జర్నలిస్ట్,
సెల్ : 9440595494

సహారా రిఫండ్ ప్రక్రియకు ఇంత జాప్యమేల?

డా. ముచ్చుకోట సురేష్ బాబు

సహారా గ్రూప్ తమ ఆప్షనల్లి పుల్లీ కన్వర్టిబుల్ డిబెంచర్లు ద్వారా సేకరించిన నిధులను తిరిగి చెల్లించే అంశం దీర్ఘకాలిక వివాదంగా మారింది. భారత్‌లో సాగుతున్న సంక్లిష్ట ఆర్థిక వివాదాలలో ఇది అత్యంత ప్రధానమైనది. సుప్రీంకోర్టు అనేకసార్లు జోక్యం చేసుకున్నప్పటికీ, సహారా పథకాలలో ముఖ్యంగా సహకార సంఘాల ద్వారా పెట్టుబడి పెట్టిన కోట్లాది మంది ప్రజలు తమ డబ్బు ఎప్పుడు వస్తుందో ఇప్పటికీ తెలియక ఆందోళనలో ఉన్నారు. ఈ వివాదం దాదాపు దశాబ్దం క్రితం ప్రారంభమైంది. సహారా గ్రూప్ తమ ఓఎఫ్‌సిడి లు హైబ్రిడ్ ఇన్‌స్ట్రుమెంట్స్ అని, అవి సెబీ పరిధిలోకి కాకుండా కంపెనీల రిజిస్ట్రార్ పరిధిలోకి వస్తాయని వాదించింది. తాము ఇప్పటికే ఆర్‌ఓసి అనుమతి తీసుకుని, అవసరమైన పత్రాలను సమర్పించి బాండ్లు జారీ చేశామని సహారా పేర్కొంది. కానీ సెబీ దీనిని అంగీకరించలేదు. సహారా కంపెనీలు బాండ్ల జారీని ఆపి, పెట్టుబడిదారులకు డబ్బు తిరిగి చెల్లించాలని ఆదేశించింది. ఈ నిర్ణయాన్ని సహారా కోర్టులో సవాలు చేయడంతో కేసు చివరకు సుప్రీంకోర్టుకు చేరింది. 2012 జూన్‌లో జరిగిన తుది విచారణ సమయంలో, సహారా 93 శాతం పెట్టుబడిదారులకు ఇప్పటికే చెల్లింపులు పూర్తయ్యాయని, మొత్తం రూ. 23,500 కోట్లు తిరిగి ఇచ్చిందని తెలిపింది. ఇంకా సుమారు రూ. 2,260 కోట్లు మాత్రమే బాకీ ఉన్నాయని, అయితే ఇప్పటికే రూ. 12,000 కోట్లను కోర్టు ఆదేశాల మేరకు జమచేశామని, వడ్డీలతో అది రూ. 16,000 కోట్లకు పెరిగిందని తెలిపింది. 2012 ఆగస్టులో సుప్రీంకోర్టు తుది ఉత్తర్వు ఇచ్చేటప్పటికి మెజారిటీ పెట్టుబడిదారులకు తాము చెల్లింపులు పూర్తి చేశామని, ఇప్పుడే మళ్లీ డబ్బు చెల్లించడం "ఒకే బాధ్యతపై రెండోసారి చెల్లింపు" అవుతుందని సహారా వాదించింది. ఇదిలా ఉండగా, సెబీ 144 కంటే ఎక్కువ పత్రికల్లో నాలుగు సార్లు ప్రకటనలు ఇచ్చి పెట్టుబడిదారులను రిఫండ్ కోసం దరఖాస్తు చేయమని పిలుపునిచ్చింది. అయినప్పటికీ చాలా కొద్ది మంది మాత్రమే ముందుకు వచ్చారు. 2014 అక్టోబరు నాటికి కేవలం 4,600 మంది మాత్రమే రిఫండ్ దరఖాస్తులు చేశారు. సెబీ వద్ద ఉన్న రూ. 16,000 కోట్లలో కేవలం రూ. 64 కోట్లు మాత్రమే తిరిగి చెల్లించగలిగింది. ఇది రిఫండ్ ప్రక్రియలోని లోపాలపై ప్రశ్నలు రేకెత్తించింది. సహారా మాత్రం తాము చాలా మందికి నేరుగా డబ్బు ఇచ్చేశామని, సెబీ వద్ద ఉన్న రికార్డులు సరికాదని వాదించింది. బ్యూరోక్రసీ కూడా ఈ ప్రక్రియను మరింత క్లిష్టం చేసింది. 2013లో సహారా మూడు కోట్లకుపైగా అప్లికేషన్ ఫారాలు, రెండు కోట్ల రిడంప్షన్ ఓచర్లు ఉన్న 127 లారీలను సెబీ కార్యాలయానికి పంపింది. అయితే అవి కార్యాలయ సమయం తర్వాత రావడంతో సెబీ రెండో విడత డాక్యుమెంట్లను స్వీకరించలేదు. చాలా రికార్డులు అసంపూర్ణంగా ఉండటంతో పెట్టుబడిదారుల నిజమైన వివరాలను నిర్ధారించడం కష్టమైంది. సహారా మాత్రం 95 శాతం పెట్టుబడిదారులకు తాము ఇప్పటికే చెల్లించినట్టు మళ్లీ చెబుతోంది.



ఇన్ని సమస్యల మధ్య, ఇటీవల కొంత పురోగతి కనిపించింది. 2023లో సుప్రీంకోర్టు సెబీ సహారా రిఫండ్ అకౌంట్‌లోని రూ. 5,000 కోట్లను సహారా సహకార సంఘాల పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించేందుకు కేంద్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ కు బదిలీ చేయాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో నడుస్తున్న ఈ ప్రక్రియలో కొంతమంది పెట్టుబడిదారులు డబ్బు పొందారు. 2025 జూలై నాటికి 27 లక్షల మందికి పైగా పెట్టుబడిదారులకు రూ. 5,000 కోట్లకుపైగా చెల్లించారు. అయితే మరో 1.08 కోట్ల మంది ఇంకా వేచి ఉన్నారు.

సహారా సహకార సంఘాల పెట్టుబడిదారుల కోసం ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. చిన్న పెట్టుబడిదారులకు ప్రాధాన్యత ఇవ్వాలని హామీ ఇచ్చింది. రిఫండ్ ప్రక్రియ క్లిష్టతను దృష్టిలో పెట్టుకుని సుప్రీంకోర్టు గడువును డిసెంబర్ 2025 వరకు పొడిగించింది. అయితే సమస్య ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదు. సహారా వివిధ పథకాల ద్వారా సేకరించిన మొత్తం రూ. 25,000 కోట్లకు పైగానే ఉంది. సెబీ వద్ద ఉన్న ఈ నిధుల్లోనూ ఇప్పటి వరకు 20,000 కంటే తక్కువ రిఫండ్ దరఖాస్తులు మాత్రమే అందాయి. అసంపూర్ణ వివరాలు, ధ్రువీకరించలేని ఫారాలు, స్పందన రాని పెట్టుబడిదారులు వంటి సమస్యలతో చాలా దరఖాస్తులు మూసివేశారు. దీంతో అసలు పెట్టుబడిదారుల అందరికీ నిజంగా డబ్బు చేరుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సహారా స్థాపకుడు సుబ్రత రాయ్ మరణం తర్వాత, సెబీ వద్ద మిగిలి ఉన్న రూ. 25,000 కోట్ల భవితవ్యంపై ప్రశ్నలు మరింత పెరిగాయి. కొంతమంది పెట్టుబడిదారులు డబ్బు పొందినా, పెద్ద భాగం పెట్టుబడిదారులు ఇప్పటికీ నెమ్మదిగా సాగుతున్న ఈ ప్రక్రియలో ఇరుక్కుపోయారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు ఈ మొత్తం రిఫండ్ వ్యవస్థను పర్యవేక్షిస్తూనే ఉంది. అయితే ప్రధాన ప్రశ్న మాత్రం ఇంకా అలాగే ఉంది. అదే 'మిగిలిన పెట్టుబడిదారుల డబ్బు ఎప్పుడు తిరిగి వస్తుంది' ? అన్నది!

సెల్ : 9989988912

బిజెపి మిత్రపక్షం ఆర్ఎల్ఎంలో తిరుగుబాటు

పాట్నా : బీహార్‌లో బిజెపి మిత్రపక్షం రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం) తిరుగుబాటు పరిస్థితిని ఎదుర్కొంటుంది. ఆర్ఎల్ఎం అధ్యక్షులు ఉపేంద్ర కుష్వాహ పార్టీలో కష్టపడే కార్యకర్తలను కాదని, తన కుటుంబ సభ్యులకే పదవులు కట్టబెడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఏడుగురు కీలక నాయకులు పార్టీకి రాజీమానా చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్ఎల్ఎం నాలుగు స్థానాల్లో విజయం సాధించగా రాష్ట్ర ప్రభుత్వంలో ఒక మంత్రి స్థానం కేటాయించారు. ఆ ఒక్క పదవికి గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలను కాదని..ఉపేంద్ర కుష్వాహ తన కుమారుడు దీపక్ ప్రకాశ్‌ను మంత్రి పదవికి ఎంపిక చేశారు. ఇప్పటికే ఉపేంద్ర రాజ్యసభ సభ్యునిగా ఉండగా..ఆయన భార్య స్నేహలత.. ససారాం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈ నేపథ్యంలో పార్టీలో ఉపేంద్ర తర్వాత అంతటి ప్రభావమున్న నేతగా భావించే జితేంద్ర నాథ్, రాష్ట్ర అధ్యక్షులు మహేంద్ర కుష్వాహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాహుల్ కుమార్, పార్టీ నలంద జిల్లా ఇన్‌ఛార్జి రాజేష్ రంజన్ సింగ్, జముయి ఇన్‌ఛార్జి బిపిన్‌కుమార్ చౌరాసియా, లఖిసరాయ్ ఇన్‌ఛార్జి ప్రమోద్ యాదవ్, షేక్‌పురా జిల్లా అధ్యక్షులు పప్పు మండల్ ఆర్ఎల్ఎంకు రాజీనామా చేశారు.

ఆఫ్రికా దేశం గినియా బిస్సావులో సైనిక తిరుగుబాటు

- అధికారం స్వాధీనం చేసుకున్నామని ప్రకటించిన సైనిక అధికారులు

బిస్సావు : ఆఫ్రికా దేశాల్లో సైన్యం తిరుగుబాటులు కొనసాగుతున్నాయి. తాజాగా గినియా బిస్సావులో సైన్యం తిరుగుబాటు చేసింది. అధ్యక్షుడు ఉమారో సిసోకోను అదుపులోకి తీసుకుని అధికారాన్ని హస్తగతం చేసుకుంది. ఆ దేశ సైన్యం ఉన్నతాధికారి డినిస్ ఎన్‌ట్చామా గురువారం మీడియాతో మాట్లాడుతూ జాతీయ, ప్రజాశాంతి పునరుద్ధరణ కోసం హై మిలటరీ కమాండ్ అధ్యక్షుడిని పదవి నుండి తొలగించింది, కొత్త ఆదేశాలు వచ్చే వరకూ దేశంలో అన్ని సంస్థలను నిలిపేయాలని ప్రకటించారు. ఆదివారం నాడు దేశంలో అధ్యక్ష స్థానానికి ఎన్నికలు జరిగాయి. ఫలితాలు కొద్ది రోజుల్లో వెలువడనున్న నేపథ్యంలో సైన్యం తిరుగుబాటు చేసింది. బుధవారం అధ్యక్ష భవనంలో కాల్పుల శబ్దాలు వినిపించాయని, రహదారులన్నీ మూసేశారని పలువురు స్థానిక మీడియాకు తెలిపారు. ఎన్నికల కమిషన్ కార్యాలయంను కూడా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుని కమిషనర్‌ను అరెస్ట్ చేసింది. ఐక్య రాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ సైన్యం సంయమనం పాటించాలని, న్యాయ సూత్రాలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఆఫ్రికన్ యూనియన్ సైన్యం తిరుగుబాటును ఖండిస్తూ ప్రకటన విడుదల చేసింది. ప్రజాస్వామ్య ప్రక్రియకు అంతరాయం అని, వెంటనే రాజ్యాంగాన్ని తిరిగి పునరుద్ధరించాలని ప్రకటనలో కోరింది.

అవినీతి కేసులో హసీనాకు 21 ఏళ్ళ జైలు శిక్ష



ఢాకా : పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాకు 21 ఏళ్ళ కారాగార శిక్ష, ఆమె ఇద్దరు పిల్లలకు చెరో ఐదేళ్ళు శిక్ష విధిస్తూ ఢాకా కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ గృహ నిర్మాణ ప్రాజెక్టు కింద ప్లాట్‌ల కేటాయింపులో అవకతవకలకు పాల్పడ్డారన్న కేసులో వారు ముగ్గురు లేకుండానే విచారణ సాగి, తీర్పు వెలువడింది. రాజధానికి సమీపంలోని పూర్వాచల్ వద్ద ప్రభుత్వం నిర్మిస్తున్న గృహ నిర్మాణ ప్రాజెక్టులో అవినీతి చోటు చేసుకుందన్న ఆరోపణలపై మూడు కేసులు నమోదయ్యాయి. వాటిపై విచారణ జరిపిన ఢాకా ప్రత్యేక న్యాయమూర్తి కోర్టు-5 హసీనాకు, అమె కుమారుడు సాజిబ్ వజీద్, కుమార్తె సైమా వజీద్ పుతుల్‌లకు ఈ శిక్ష విధించింది. ఎలాంటి దరఖాస్తు చేయకుండానే షేక్ హసీనాకు ప్లాట్ కేటాయించారని, అది కూడా చట్టబద్ధమైన పరిధులు అధిగమించి మరీ కేటాయింపు జరిగిందని న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్లా అల్ ముమున్ తీర్పునిస్తూ తెలిపారు.

అమరావతే గ్రోత్ ఇంజన్

(మొదటి పేజి తరువాయి)

గోదావరి, నల్లమల సాగర్ అనుసంధానం, వెలిగొండ, ఉత్తరాంధ్ర జల ప్రాజెక్టులన్నీ రాష్ట్ర భవిష్యత్‌ని నిర్ణయిస్తాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును 2027లో జాతికి అంకితం చేసేందుకు కేంద్ర సహకారాన్ని కోరాలన్నారు. పత్తి, మొక్కజొన్న, అరటి ధరల పతనం, సిసిఐ నియమాలతో వచ్చిన సమస్యలను కేంద్రానికి వివరించి రైతులకు ఉపశమనం కల్పించేలా చూడాలన్నారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్, డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్, వసతులపై కేంద్ర సహాయం సాధించాలన్నారు. ఎంఎస్ఎంఇ పార్కులు, క్వాంటం వ్యాలీ, ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్‌కు మద్దతు సాధించేలా ఎంపీలు కృషి చేయాలన్నారు. మెట్రో రైల్ ప్రాజెక్టులు, ఎకనామిక్ రీజియన్స్, భోగాపురం ఎయిర్ పోర్టు, విశాఖ రైల్వే జోన్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి అంశాలపై కేంద్రంతో చర్చలు జరపాలన్నారు. ఎంపీలు తమ నియోజకవర్గాల్లో పేదల సేవలో వంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని స్పష్టం చేశారు. పార్టీ కార్యక్రమాల్లో ఎంపీలు క్రియాశీలకంగా ఉండాలని సూచించారు. లాజిస్టిక్ కార్పొరేషన్ ద్వారా రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నట్లు తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మరో మెట్టుగా ఎస్క్రో అకౌంట్ నిలుస్తుందన్నారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. గత పాలకులు మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో కేవలం 42 శాతమే సీట్లు విద్యార్థులకు ఇస్తామన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం 50 శాతం సీట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు.

లేబర్ కోడ్‌లు ఉపసంహరించాల్సిందే

- కేరళ శ్రామిక ప్రజానీకం ఏకగ్రీవ తీర్మానం
- కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల సమావేశం
- రాష్ట్రంలో అమలు చేయబోమని మంత్రి శివన్ ప్రకటన

తిరువనంతపురం : శ్రమల జీవుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని కేరళ శ్రామిక ప్రజానీకం ముక్తకంఠంతో డిమాండ్ చేసింది. కేరళ రాష్ట్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని కార్మిక సంఘాలతో గురువారం నాడు నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వి.శివన్‌కుట్టీ మాట్లాడుతూ, కార్మిక ప్రయోజనాలకు వ్యతిరేకంగా వున్న లేబర్ కోడ్‌లపై సరైన రీతిలో చర్చలేవీ జరపకుండానే ఏకపక్షంగా రూపొందించి వాటినే బలవంతంగా రద్దుతున్నారని విమర్శించారు. అందువల్ల కేంద్రం వెంటనే వీటని ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాల సమావేశంలో తీర్మానించినట్లు చెప్పారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న ఈ లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో ఎట్టిపరిస్థితుల్లోనూ అమల్జేయబోమని ఆయన స్పష్టం చేశారు. మెజారిటీ రాష్ట్రాలు వీటిని అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాయని, కానీ కేరళ మాత్రం తీసుకోదని చెప్పారు. లేబర్ కోడ్‌లపై ముసాయిదా నిబంధనలు సిద్ధం చేయాలని కేంద్రం తీసుకువచ్చిన ఒత్తిడికి రాష్ట్రం లొంగిపోయిందా అని విలేకర్లు ప్రశ్నించగా లేదంటూ తిరస్కరించారు. ఒత్తిడికి లొంగిపోయినట్లైతే లేబర్ కోడ్‌లను ఆమోదిస్తున్నట్లు లేఖ ఇవ్వాలని, కానీ తాము అలా చేయలేదని చెప్పారు. అయినా ముసాయిదా నిబంధనలు కూడా రహస్యంగా ఏమీ రూపొందించలేదన్నారు. అంతా బహిరంగంగానే జరిగిందని, దానిపై ప్రజాభిప్రాయాన్ని కూడా కోరామన్నారు. తర్వాత దానిపై ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోలేదన్నారు.

ముసాయిదా, ముసాయిదాగానే మిగిలిపోయింది

2021లోనే లేబర్ కోడ్‌ల ముసాయిదాను రాష్ట్రం నోటిఫై చేయడంపై తలెత్తిన వివాదం గురించి మాట్లాడుతూ, ఆనాడు కేంద్రం, రాష్ట్ర కార్మిక శాఖ కార్యదర్శుల సమావేశం ఏర్పాటు చేసిందని, ఇందుకు సంబంధించి నిబంధనలను రూపొందించాల్సిందిగా రాష్ట్రాలను కేంద్రం ఆదేశించిందని చెప్పారు. దాంతో రాష్ట్ర కార్మిక కార్యదర్శి నిబంధనలను రూపొందించారన్నారు. వాటిని చర్చ నిమిత్తం పబ్లిక్ డొమైన్‌లో ప్రచురించడం కూడా జరిగిందన్నారు.

తర్వాత 2022 జులైలో ముసాయిదాపై చర్చించేందుకు గానూ కార్మిక సంఘాల వర్క్‌షాప్ ఒకటి జరిగిందన్నారు. ఇప్పటివరకు, దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ముసాయిదా కేవలం ముసాయిదాగానే మిగిలిపోయిందని వ్యాఖ్యానించారు. గత మూడేళ్ళలో రాష్ట్రం దీనిపై ఎలాంటి చొరవ తీసుకోలేదంటేనే ఈ అంశంపై కేరళ ధృఢ వైఖరి తెలుస్తోందని అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్మిక శాఖ మంత్రుల సమావేశంలో లేబర్ కోడ్‌ల్లో కార్మిక వ్యతిరేక నిబంధనలపై రాష్ట్రానికి గల తీవ్ర వ్యతిరేకతను కేంద్ర కార్మిక శాఖ మంత్రికి తెలియచేసినట్లు కూడా చెప్పారు.

డిసెంబరు 19న సదస్సు



లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తున్న రాష్ట్రాల మంత్రులతో వచ్చే నెల్లో కార్మిక సదస్సు నిర్వహించనున్నట్లు శివన్ కుట్టీ చెప్పారు. లేబర్ కోడ్‌లు కార్మికుల జీవితాలను ఏ విధంగా ప్రభావితం చేస్తాయన్నారు. అలాగే తమ స్వంత లేబర్ కోడ్‌లను రూపొందించుకోవడానికి రాష్ట్రానికి గల సాధ్యాసాధ్యాలపై డిసెంబరు 19న జరిగే ఒక రోజు సదస్సు చర్చిస్తుందని చెప్పారు. ఈ సదస్సులో నిపుణులు, కార్మిక సంఘాల నేతలు కూడా పాల్గొంటారని తెలిపారు. ఈ విషయంలో రాష్ట్రం ఎంతవరకు జోక్యం చేసుకోగలదో కూడా ఈ సదస్సులో పరిశీలిస్తామన్నారు.

ఓటు హక్కుకు ఆధార్ ధ్రువీకరణ కాదు

- 'ఎస్ఐఆర్' సమర్థనీయమే - సిజెఐ వ్యాఖ్యలు
- పిటిషన్లపై విచారణ 2కు వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వయోజన ఓటు హక్కు పొందేందుకు ఆధార్ ధ్రువీకరణ పత్రం కాబోదని, అది కేవలం సంక్షేమ పథకాల అమలు కోసం ఏర్పాటు చేసింది మాత్రమేనని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కసరత్తుపై ఎన్నికల సంఘం (ఇసి) నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పౌరసత్వానికి ఆధార్ ధ్రువీకరణ పత్రం కాదని స్పష్టం చేసింది. 'ఆధార్ సామాజిక సంక్షేమ ప్రయోజనాలు అందరికీ చేరేలా చూసుకోవడానికి ఏర్పాటుచేసింది మాత్రమే. రేషన్ కోసం ఆధార్ పొందిన వ్యక్తిని.. ఓటర్‌ను చేయాలా? విదేశాలకు చెందినవారు ఇక్కడ కార్మికుడిగా పనిచేస్తే.. వారికి కూడా ఓటు హక్కు కల్పించాలా?' అని ధర్మాసనం ప్రశ్నించింది. ఓటరు నమోదు ఫారం-6లో పేర్కొన్న వివరాలు సరైనవో, కావో నిర్ధరించుకునే అధికారం ఇసికి ఉందని పేర్కొంది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో సర్ నిర్వహించడాన్ని ప్రత్యేకంగా సవాల్ చేసిన పిటిషన్ల విచారణకు సుప్రీం షెడ్యూల్ చేసింది. డిసెంబరు 1లోపు వీటిపై స్పందన తెలియజేయాలని ఇసిని ఆదేశించింది. తరువాత తదుపరి విచారణను డిసెంబర్ 2కి ధర్మాసనం వాయిదా వేసింది.

పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ..ఎస్ఐఆర్ ప్రక్రియ సాధారణ పౌరులపై రాజ్యాంగ విరుద్ధమైన భారాన్ని మోపుతుందన్నారు. దీనివల్ల నిరక్షరాస్యులు తమ ఓటు హక్కు కోల్పోయే ప్రమాదముందన్నారు. ఈ మొత్తం ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. అలాగే ఒక వ్యక్తికి మానసిక స్థితి సరిగా లేకపోతే బిఎల్‌వో తీర్పు చెప్పగలరా? చట్టం పరిధికి వెలుపల ఉన్న అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు ఈ హక్కును నిర్ణయించ కూడదు. అందుకే ఇది అసమంజసమైనదని కపిల్ వాదించారు.

పిటిషనర్ల తరపున మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తూ ఆర్టికల్ 324 నుండి ఎన్నికల సంఘం తీసుకున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో కొన్నింటికి అనుమతి లేదని, అధికార పరిధి లేదని వాదించారు. దీనికి సిజెఐ సూర్యకాంత్ జోక్యం చేసుకుని ఎన్నికల సంఘానికి ఎప్పటికీ ఎస్ఐఆర్ అధికారం ఉండదా? అని ప్రశ్నించారు. ఇది సాధారణ నవీకరణ కాదని, ప్రత్యేక సవరణ జరుగుతుందని అన్నారు. అందుకే ఈ ప్రక్రియను సమర్థించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. దీనికి సింఘ్వి బదులు ఇస్తూ గత ఆరు నెలల్లో ఎస్ఐఆర్ ప్రక్రియకు ఈ కోర్టు చాలా మెరుగులు దిద్దిందని, కానీ చట్టం కానిది చట్టంగా మిగిలిపోయిందని అన్నారు. ఎస్ఐఆర్ వంటి ఏ ప్రక్రియనైనా నిర్వహించే ముందు రాజ్యాంగాన్ని అనుసరించాలని సింఘ్వి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

సులభంగా ఆస్తుల రిజిస్ట్రేషన్ !

- పంజాబ్‌లో 'ఈజీ రిజిస్ట్రీ' ప్రారంభం

చండీఘఢ్ : పంజాబ్‌లో ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసే లక్ష్యంతో 'ఈజీ రిజిస్ట్రీ' అనే పథకాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ గురువారం ప్రారంభించారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ అనేది చాలా సంక్లిష్టమైన వ్యవహారంగా, సమయం ఎక్కువ తీసుకునే ప్రక్రియగా దశాబ్దాల కాలంగా వుంటూ వచ్చిందని, తరచుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్ళాల్సి రావడం, పనులు అవక జాప్యం ఎదుర్కొనడం పైగా అవినీతి సమస్య వీటన్నింటితో ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. రూ.500 నామినల్ ఫీజు చెల్లించి సేవా కేంద్రాల్లో లేదా ఆన్‌లైన్ ద్వారా ముసాయిదా సేల్ డీడ్‌లను పొందవచ్చన్నారు. 'సర్కార్ తుహడె ద్వార్' పథకంలో భాగంగా ఫోన్ ద్వారా కూడా ఈ సేవలు అందుకోవచ్చు, కేవలం 48 గంటల్లో ఆన్‌లైన్ డాక్యుమెంట్ల ప్రక్రియ పూర్తయిపోతుందన్నారు. 'డ్రాఫ్ట్ మై డీడ్' ఫీచర్ ద్వారా ఎవరైనా సేవా కేంద్రాలు లేదా సేవా అసిస్టెంట్ల సాయంతో తమ సొంతంగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సిద్ధం చేసుకోవచ్చని తెలిపారు.

బల్గేరియాలో వేలాదిమంది పార్లమెంట్ ముట్టడి




- బడ్జెట్ ముసాయిదాలో పన్నుల పెంపును వ్యతిరేకిస్తూ నిరసన

సోఫియా : బాల్కన్ దేశం బల్గేరియాలో వేలాదిమంది నిరసనకారులు పార్లమెంట్ భవనాన్ని ముట్టడించారు. వచ్చే ఏడాది ప్రవేశ పెట్టె బడ్జెట్‌కు సంబంధించిన ముసాయిదాను ప్రభుత్వం విడుదల చేసింది. దీనిలో పన్నులను పెంచుతామని స్పష్టం చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష వి కంటిన్యూ ది చేంజ్, డెమొక్రటిక్ బల్గేరియా పార్టీల ఆధ్వర్యంలో గురువారం పార్లమెంట్‌ను ముట్టడించారు. పార్లమెంట్ భవనం నుండి బయటకి ఎంపీలు రాకుండా, వాహనాలను లోపలకి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. దీంతో ఘర్షణలు చెలరేగాయి. సోఫియా డైరెక్టరేట్ ఆఫ్ ఇంటీరియల్ (ఎస్‌డివిఆర్) పోలీసులు ఆందోళనాకారులు తమపై గాజు సీసాలు, రాళ్లతో దాడి చేశారన్నారు. అయితే పోలీసులు తమపై అనుచితంగా ప్రవర్తించారని, బాష్ప వాయువులను ప్రయోగించారని పలువురు విమర్శించారు. ప్రభుత్వం డివిడెంట్ పన్నులను పెంచడం ద్వారా సామాజిక భద్రత తగ్గిపోతుందని, వ్యాపారాలపై, ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని ఆ దేశ ఆర్థిక వేత్తలు హెచ్చరిస్తున్నారు.

అమెరికా శ్రామిక శక్తిలో 11.7 శాతంపై ఎఐ ప్రభావం

- మసాచుసెట్స్ అధ్యయనంలో వెల్లడి



న్యూయార్క్ : అమెరికాలో ప్రస్తుతం కృత్రిమ మేధస్సు (ఎఐ)ను స్వీకరించడం అనేది ప్రధానంగా అన్ని రాష్ట్రాల వ్యాప్తంగా టెక్నాలజీ ఉద్యోగాల్లో కేంద్రీకృతమై వుందని ఒక అధ్యయనంలో వెల్లడైంది. లేబర్ మార్కెట్ వేతన విలువలో ఇది 2.2 శాతంగా వుందని పేర్కొంది. ఇప్పటికే అమెరికా శ్రామిక శక్తిలో 11.7 శాతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆక్రమించిందని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి) నిర్వహించిన అధ్యయనం పేర్కొంది. అక్టోబరులో ఈ అధ్యయనాన్ని నిర్వహించగా, బుధవారం నివేదికను ప్రచురించారు. అమెరికా లేబర్ మార్కెట్‌లోని 11.7 శాతం మంది కార్మికులకు సంబంధించి మేథోపరమైన ఆలోచనా, అవగాహనా ప్రక్రియలు, అలాగే పాలనాపరమైన విధులు, కర్తవ్యాల వరకు ఎఐ సాంకేతిక సామర్ధ్యాలనేవి విస్తరించి వున్నాయని ఆ నివేదిక పేర్కొంది. దేశంలోని 15.1కోట్ల మంది కార్మికులకు ప్రాతినిధ్యం వహించే ఎంఐటి, ఓక్ రిడ్జ్ నేషనల్ లేబరేటరీ రూపొందించిన సాధనం ఐస్‌బెర్గ్ ఇండెక్స్‌ను ఉపయోగించి ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. కార్మికుల ఉపాధులపై ఎఐ ప్రభావాలు వంటి వివరాలను సేకరించారు. ఎఐ అమెరికా లేబర్ మార్కెట్‌ను ఏ విధంగా మారుస్తోందో ఈ ఇండెక్స్ పరిశీలించింది. ప్రధానంగా ఉద్యోగుల శిక్షణలో కోట్లాది డాలర్లను ఖర్చు పెట్టాలనుకునే విధాన రూపకర్తలకు ఈ సమాచారం ఉపయుక్తంగా వుంటుందని సిఎన్‌బిసి పేర్కొంది. ఇంత ప్రభావితమైన మార్పులు గురించి ఒక వైపు పేర్కొంటూనే ఎఐ వల్ల ఉద్యోగాలకు వచ్చిన ముప్పేమీ లేదని నివేదిక పేర్కొనడం గమనార్హం. అలాగే క్రమబద్ధీకరణకు సంబంధించిన నిర్ణయాలు, సామాజిక ఆమోదం, మొత్తంగా ఆర్థిక పరిస్థితులు ఇవన్నీ కూడా పాత్ర పోషిస్తాయని నివేదిక పునరుద్ఘాటించింది.

బీహార్‌లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు జెడియు ఎర

అతిపెద్ద పార్టీగా అవతరించే వ్యూహం

పాట్నా : బీహార్‌లో ప్రతిపక్షాల మహాఘట్బంధన్ ఐక్యతను దెబ్బతీసేందుకు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని ఎన్‌డిఎ వ్యూహాన్ని సిద్ధం చేస్తోంది. ఎన్‌డిఎలోని పార్టీల్లో బిజెపి అత్యధిక స్థానాలు సాధించగా..నితీష్ కుమార్ అధినేతగా ఉన్న జెడియు ఆ తర్వాతి స్థానంలో నిలిచింది. ముఖ్యమంత్రిగా నితీష్‌కుమారే తిరిగి పగ్గాలు చేపట్టినా..అతిపెద్ద పార్టీకి అవతరించేదన్న అసంతృప్తితో ఆ పార్టీ శ్రేణులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాల ఐక్యతను దెబ్బతీసి..ఆయా పార్టీల నుంచి కనీసం తొమ్మిది మంది ఎమ్మెల్యేలను జెడియు గూటికి రప్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

రాష్ట్ర మంత్రివర్గంలో తొమ్మిది స్థానాలను వచ్చే జనవరిలో భర్తీ చేయనున్నారు. అయితే ఈ తొమ్మిది కేబినెట్ స్థానాలను ప్రతిపక్షాల ఎమ్మెల్యేలకు ఎరగా వేసి పార్టీలో కలిపేసుకొని అతిపెద్ద పార్టీగా అవతరించాలనేది జెడియు వ్యూహంగా కనిపిస్తోంది. ఈ పరిణామాలపై మహాఘట్బంధన్‌లో ఉన్న ఇండియన్ ఇంక్లూజివ్ పార్టీ (ఐఐపి) అధినేత ఐపి గుప్తా మీడియాతో మాట్లాడుతూ..తమ డిమాండ్లకు నితీష్ కుమార్ అంగీకరిస్తే ..ఎన్‌డిఎతో కలిసి నడిచేందుకు సిద్ధమని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో ఎన్‌డిఎ వ్యూహం బయటపడింది. ఇలాంటి వారి కోసమే కేబినెట్‌లో తొమ్మిది స్థానాలను ఖాళీగా వుంచినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

బీహార్ అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలు ఉన్నాయి. వీటిలో 202 స్థానాల్లో ఎన్‌డిఎ గెల్చుకోగా.. 89 సీట్లతో అతిపెద్ద పార్టీగా బిజెపి నిలిచింది. జెడియు 85 సీట్లతో రెండో స్థానానికి పరిమితమైంది. ముఖ్యమంత్రి కలుపుకొని గరిష్ఠంగా 36 మంది మంత్రులు ఉండొచ్చు. కానీ ఇప్పటివరకు 26 మందినే మంత్రులుగా నియమించారు. సిఎంను కలుపుకుంటే ఈ సంఖ్య 27కు చేరింది. అంటే మరో 9 మందిని మంత్రులుగా చేయొచ్చు. ఖాళీగా ఉన్న ఈ మంత్రి పదవుల్లో 6 జెడియు కోటాకు చెందినవే కావడం గమనార్హం. నితీశ్ వ్యూహాత్మకంగానే ఈ మంత్రి పదవులను భర్తీ చేయకుండా వదిలేశారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను జెడియులోకి చేర్చుకొని వారికి మంత్రి పదవులను కట్టబెట్టే అవకాశాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. 2020 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కూడా బిఎస్‌పి ఏకైక ఎమ్మెల్యే జామా ఖాన్, ఎల్‌జెపి ఏకైక ఎమ్మెల్యేలను జెడియులో నితీశ్ చేర్చుకున్నారని, అప్పట్లో జామా ఖాన్‌కు మంత్రి పదవి ఇచ్చారని నిపుణులు గుర్తు చేశారు. ఐఐపి అధినేత, సహర్సా స్థానం నుంచి గెలుపొందిన గుప్తాపై నితీశ్ కన్నేశారని పరిశీలకులు అంటున్నారు.

బిజెపికి టాటా భూరి విరాళం.. తెర వెనుక జరిగిందేమిటి?

న్యూఢిల్లీ : సెమీ కండక్టర్ యూనిట్లకు మోడీ కేబినెట్ ఆమోద ముద్ర వేసిన వారాల వ్యవధిలోనే టాటా గ్రూపు బిజెపికి భారీ మొత్తంలో విరాళాలను అందచేసింది. ఈ మొత్తం రూ.758కోట్లుగా వుంది. ఇప్పటివరకు ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ఆధారంగా చూసినట్లైతే 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీకి అతిపెద్ద మొత్తంలో విరాళాలిచ్చిన గ్రూపుగా టాటా గ్రూపు నిలిచింది.

ఇదంతా ఎలా సాధ్యమైందంటే... దేశీయంగా సెమీకండక్టర్ పరిశ్రమ నిర్మాణానికి ఊతమివ్వడంలో భాగంగా మూడు సెమీ కండక్టర్ యూనిట్లకు మోడీ ప్రభుత్వం 2024 ఫిబ్రవరి 29న ఆమోద ముద్ర వేసింది. అందులో రెండు యూనిట్లకు టాటా గ్రూపు నేతృత్వం వహిస్తోంది. సెమీ కండక్టర్ ఉత్పత్తిని దేశంలో పెంచేందుకు గానూ వాటికి కొంత మొత్తంలో రాయితీలు ఇచ్చే పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. అందులో భాగంగా ఈ యూనిట్ల నిర్మాణంలో సగం భాగాన్ని భరించేందుకు కేంద్రం అంగకరించింది. ఆ విధంగా టాటా గ్రూపు నిర్మించబోయే రెండు యూనిట్లకు వచ్చే సబ్సిడీ ఏకంగా రూ44,203కోట్ల వరకు వుంది. అంతే కేబినెట్ సమావేశం జరిగి నాలుగు వారాలు తిరిగేసరికల్లా బిజెపికి అతిపెద్ద డోనార్‌గా టాటా గ్రూపు ఆవిర్భవించింది. రూ.758కోట్లను పార్టీకి విరాళంగా అందచేసింది. 2023-24లో రాజకీయ పార్టీలకు వచ్చిన విరాళాలన్నింటినీ అధిగమించి బిజెపి అగ్ర భాగంలో నిలిచింది. 2024-25లో మొత్తంగా టాటా గ్రూపునకు చెందిన 15 సంస్థలు దాదాపు రూ.915కోట్ల మొత్తాలను రాజకీయ విరాళాలుగా అందచేశాయి.

టాటా గ్రూపు ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్టు ద్వారా రాజకీయ పార్టీలకు ఈ విరాళాలు బదిలీ అవుతాయి. అన్నింటిలోకి టాటా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అత్యధికంగా రూ.308కోట్లు అందచేసింది. 2021 నుండి 2024 వరకు రాజకీయ పార్టీలకు ఎలాంటి విరాళాలను టాటా ట్రస్టు ఇవ్వలేదు. కేవలం లోక్‌సభ ఎన్నికలకు రోజుల వ్యవధి ముందుగా అంటే గతేడాది ఏప్రిల్‌లో రూ.758కోట్లను బదిలీ చేసింది.

బిజెపి తర్వాత అధికంగా విరాళాలు అందుకున్నది కాంగ్రెస్ పార్టీనే. ఈపార్టీకి రూ.77.3కోట్లు వచ్చాయి. అంటే బిజెపి అందుకున్న దాంట్లో దాదాపు పదో వంతు. మరో 8 రాజకీయ పార్టీలు రూ.10కోట్లు చొప్పున ఈ గ్రూపు నుండి విరాళాలు అందుకున్నాయి. వాటిల్లో తృణమూల్, డిఎంకె, శివసేన, బిజూ జనతాదళ్, వైఎస్ఆర్ కాంగ్రెస్, జనతాదళ్(యునైటెడ్), లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్), భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) వున్నాయి.

ఇక తమిళనాడుకు చెందిన మురుగప్ప గ్రూపు మూడో కండక్టర్ యూనిట్‌ను పొందింది. ఉత్పత్తి వ్యయంలో 50శాతాన్ని కేంద్రం భరించడంలో భాగంగా ఈ సంస్థకు రూ.3501 కోట్లు సబ్సిడీగా వచ్చాయి దాంతో కొద్ది రోజుల వ్యవధిలోనే బిజెపికి మురుగప్ప గ్రూపు రూ.125కోట్లు విరాళంగా ఇచ్చిందని వెల్లడైంది. ఈ ఏడాది ప్రారంభంలో స్క్రోల్ ఇన్ వెబ్‌సైట్ పేర్కొంది. కేన్స్ టెక్నాలజీకి మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ కన్ని కన్నన్ కూడా 2024-24లో రూ.12కోట్లు విరాళంగా ఇచ్చినట్లు పార్టీ కాంట్రిబ్యూషన్ రిపోర్టు తెలిపింది. గుజరాత్‌లోని సంసద్‌లో సెమీకండక్టర్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు కేన్స్ సంస్థ అయిన సెమికాన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు గతేడాది సెప్టెంబరులో అనుమతి లభించింది.

బిజెపికి అందిన విరాళాల సమయంపై అటు టాటా గ్రూపునకు ఇటు కేంద్రానికి స్క్రోల్ గ్రూపు ప్రశ్నలు సంధించినా ఇప్పటివరకు ఎవరి నుండి ఎలాంటి స్పందన లేదు. ప్రభుత్వం అందచేసిన సమాచారం ప్రకారం టాటా గ్రూపు ఈరెండు యూనిట్లపై రూ.1.18 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 46వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు కల్పించనుంది.



భోపాల్‌లో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న యువజన కాంగ్రెస్ కార్యకర్తలు

ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా భోపాల్‌లో యూత్ కాంగ్రెస్ ఆందోళన

- జల ఫిరంగులు ప్రయోగించిన పోలీసులు

భోపాల్ : ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో యూత్ కాంగ్రెస్ ఆందోళన నిర్వహించింది. ఈ ఆందోళనను అడ్డుకోవడానికి పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయితే ఈ బారికేడ్లను పక్కకి నెడుతూ, వాటిపై ఎక్కుతూ ముందుకు వెళ్లడానికి యూత్ కాంగ్రెస్ సభ్యులు ప్రయత్నించారు. దీంతో వీరిని చెదరగొట్టడానికి పోలీసులు జల ఫిరంగులను ప్రయోగించారు. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఎస్ఐఆర్ రెండో దశకు వ్యతిరేకంగా కాంగ్రెస్ దేశవ్యాప్తంగా 'ఓటు చోర్, గడ్డి ఛోడో' క్యాంపెన్‌ను ప్రారంభించింది. ఇందులోభాగంగానే భోపాల్ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో కూడా కాంగ్రెస్ ఇలాంటి ఆందోళననే నిర్వహించింది. ఈ ఆందోళనను అడ్డుకోవడానికి నగరంలోని ప్రధాన రోడ్లను మూసివేస్తూ బారికేడ్లను పోలీసులు ఏర్పాటు చేశారు. వీటిని దాటడానికి కూడా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించినప్పుడు ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి విధానసభ వైపు కాంగ్రెస్ కార్యకర్తలు మార్చ్‌ను ప్రారంభించారు. 'ఓట్ చోర్, గడ్డి ఛోడో' వంటి నినాదాలు చేశారు. ఎస్ఐఆర్ ఆందోళనలపై తక్షణ చర్య తీసుకోవాలని, ప్రభుత్వం బాధ్యతవహించాలని డిమాండ్ చేశారు. పోలీసులు రోడ్లను దిగ్బంధించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొవడానికి పోలీసులు అదనపు బలగాలను మోహరించాల్సి వచ్చింది.

కాగా, గురువారం ముందుగా రెండో దశ ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ నాయకులు సచిన్ పైలట్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాయ్‌పూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో అనేక సార్లు ఎస్ఐఆర్‌ను నిర్వహించినా ఈసారి ఈ ప్రక్రియపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. అనేక రాష్ట్రాల్లో బిఎల్‌ఓలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఒక్క అనర్హమైన ఓటు కూడా జాబితాలో ఉండకూడదని తాము కోరుకుంటున్నామని తెలిపారు. డిసెంబరు 14న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఒక భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పైలట్ తెలిపారు.

ట్రంప్ టారిఫ్‌లతో సమస్యలు

(మొదటి పేజి తరువాయి)

మోడీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. రైతుల ఆత్మహత్యల్లో దేశంలో మొదటి ఐదు స్థానాల్లో మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మధ్యప్రదేశ్ ఉన్నాయన్నారు. ఆకలి సూచిలో 123 దేశాల్లో 103వ స్థానంలో మన దేశం ఉందన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల ధరలు భారీగా పెరగడం వల్ల పండించిన పంటకు ఫలితం లేకుండా పోతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తామని చెబుతున్న గిట్టుబాటు ధర ఎక్కడా ఇవ్వడం లేదని, క్వింటాకు రూ.3 వేలిస్తూ ఎంఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కేరళ ఒక్కటేనన్నారు. మోడీ ప్రభుత్వం పదేళ్లలో రూ.16 లక్షల కోట్లు రుణ బకాయిలను కార్పొరేట్లకు రద్దు చేసిందన్నారు. రైతులకు మాత్రం ఒక్కరూపాయి కూడా ఇవ్వడం లేదన్నారు. దేశంలో రైతాంగ పోరాటం ఆదర్శనీయమన్నారు. మోడీ మెడలు వంచిన ఘనత ఆ రైతాంగానికి ఉందన్నారు. నేడు లేబర్ చట్టాలు కుదించి నాలుగు కోడ్‌లుగా చేసి కార్పొరేట్లకు అనుకూలంగా మార్చారని మండిపడ్డారు. మోడీ నిరంకుశ పాలనపై సమరశీల పోరాటాలు, ఐక్య ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వ రంగాన్ని, రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అదే ఉద్దరాజు రామంకు ఇచ్చే ఘన నివాళు లన్నారు. అనంతరం అశోక్‌ధావలేను ఘనంగా సత్కరించారు. సెమినార్‌లో ఇంకా ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, ఉద్ధరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ కార్యదర్శి, రైతుసంఘం రాష్ట్ర నేత బి.బలరాం, ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన సీతారాం, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఢిల్లీలో నిర్మిస్తున్న రైతు భవనానికి రైతు కార్యాచరణ సమితి నేతలు పాతపాటి మురళీ రామరాజు రూ.20 వేలు, కలిదిండి గోపాలకృష్ణంరాజు రూ.20వేలు, పేరిచర్ల లక్ష్మణవర్మ రూ.10 వేలు మొత్తం రూ.50 వేలు అందించారు. అలాగే ఆర్.రఘురామరాజు రూ.25 వేలు అందించారు. ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ తరపున రూ.50 వేల చెక్కును ఫౌండేషన్ ఛైర్మన్, కార్యదర్శి, సభ్యుల చేతుల మీదుగా అశోక్‌ధావలేకు అందజేశారు.

నిబంధనల సడలింపుపై స్పందించని కేంద్రం

- ఆంక్షలతో సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి రైతుల ఇక్కట్లు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

పత్తి కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూపొందించిన నిబంధనలు సడలించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా ఇప్పటి వరకు సానుకూల స్పందన రాలేదు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంలో రైతులకు సంబంధించి అనేక విజ్ఞప్తులు చేసినా ఫలితం కనిపించడం లేదు. ఈ ఏడాది మార్చిలోనే మిర్చి రైతులకు సాయం అందిస్తామని చెప్పిన కేంద్రం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ధరలు తగ్గి ఒక్కో రైతు సగటున రూ.లక్ష వరకు నష్టపోయారు. కానీ, ఇటీవల గుంటూరు వచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి శివరామ సింగ్ చౌహాన్ మాత్రం రాష్ట్రంలో మిర్చి రైతులను ఆదుకున్నామని గొప్పగా ప్రకటించారు. తాజాగా, పత్తి కొనుగోలులో రైతులకు సిసిఐ నిబంధనలు తీవ్ర ప్రతిబంధకంగా మారాయి. రాష్ట్రంలో 11 మార్కెట్ కమిటీల పరిధిలో 64 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలను సిసిఐ ప్రారంభించింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో రాష్ట్రంలో 5.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. దాదాపు ఎనిమిది లక్షల క్వింటాళ్ల ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.

సిసిఐ ద్వారా ఇప్పటి వరకు నాలుగు వేల మంది రైతుల నుంచి 90 వేల క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు. పత్తి విక్రయానికి అనేక ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇ-క్రాప్‌లో నమోదు నమోదై ఉండాలి. దీంతోపాటు రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద పేరు నమోదు చేసుకోవాలి. సిఎం యాప్, కపాస్ కిసాన్ యాప్‌లో పేర్లు నమోదు చేశాక సమీప కొనుగోలు కేంద్రంలో ఉన్న జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకొని వెళ్లాలి. ఎనిమిది శాతం నుంచి 12 శాతం తేమ ఉంటే మూడు కేజీలు తరుగు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. 12 శాతం మించి తేమ ఉంటే కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో స్లాట్ బుకింగ్ నిబంధన, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం వల్ల పత్తిని అమ్ముకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎకరాకు ఏడు క్వింటాళ్లను మాత్రమే కొనాలన్న నిబంధన రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఎకరాకు గరిష్టంగా 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉండగా, మొత్తం దిగుబడిలో సగం కొనుగోలు చేస్తే మిగతా పత్తి ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం ఎనిమిది నుంచి 12 శాతం వరకు ఉన్నా కనీస మద్దతు ధర రూ.8,110 ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. అంతే కంటే ఎక్కువగా తేమ శాతం ఉంటే కొనుగోలు చేయడం లేదు. ఆరబెట్టి తీసుకురావాలని అధికారులు తెగేసి చెప్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు ప్రస్తుతం మంచు కురుస్తున్నందున 15 నుంచి 18 శాతం వరకు తేమ శాతం ఉన్నా అనుమతించాలని రైతులు కోరుతున్నారు. ఆరబెట్టుకునేందుకు తగిన స్థలం లేదని చెప్తున్నారు.

పత్తి కొనుగోలుకు కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలనే నిబంధనను రద్దు చేయాలని కోరుతున్నారు. వర్షాలకు దెబ్బతిన్న పత్తిని కొనుగోలు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని, సిసిఐ నిబంధనల సడలింపునకు కేంద్రంతో చర్చలు వేగవంతం చేశామని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న యాప్ విధానం మార్చాలని, 12 నుంచి 18 శాతం వరకు తేమ శాతం ఉన్నా కొనుగోలు చేయాలని కోరామని మంత్రి ప్రకటించినా ఇప్పటి వరకు కేంద్రం నుంచి స్పందన లేదు.



మేడికొండూరు మండలం దోకిపర్రులో పత్తి కొనుగోలు కేంద్రంలో పత్తి నిల్వలు



డోకిపర్రు కొనుగోలు కేంద్రం వద్ద పత్తిలో తేమ శాతం పరీక్షిస్తున్న అధికారులు

మొక్కజొన్న సేకరణకు కేంద్రానికి ప్రతిపాదనలు

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కనీస మద్దతు ధరతో మొక్కజొన్న సేకరించేందుకు అనుమతి ఇవ్వాలని ఎపి మార్క్‌ఫెడ్ కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. మొక్కజొన్న కొనుగోలు అంశంపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రైవేటు సంస్థల ప్రతినిధులతో విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొక్కజొన్న రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. పౌల్ట్రీ, విత్తన సంస్థలు, ఫార్మా రంగం, ట్రేడర్లు రేట్లు తగ్గించకుండా, క్వాంటిటీ తగ్గించకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. మార్క్‌ఫెడ్ మొక్కజొన్న సేకరణకు అవసరమైన నిధులను ఆర్థిక శాఖ నుంచి మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు చెప్పారు. ఈ సీజన్‌లో 2,32,301 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేసినట్లు తెలిపారు. రైతులను ఆదుకునేందుకు ధరల స్థిరీకరణ నిధి నుంచి రూ.780.32 కోట్లను విడుదల చేయాలని కేంద్రాన్ని కోరినట్లు పేర్కొన్నారు. అదనంగా నంద్యాల జిల్లాలో ఎపి మార్క్‌ఫెడ్, ఫార్‌మార్కెట్, అగ్‌టెక్ ప్లాట్ ఫార్మ్, ఐఎఫ్‌సి మద్దతుతో కొత్త మార్కెట్ అనుసంధాన పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పౌల్ట్రీ, పశువుల దాణా తయారీ, స్టార్చ్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, డిస్టిలరీలు, ఎథనాల్, బయోఫ్యూయల్ యూనిట్లు, వాణిజ్య సంస్థలతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొక్కజొన్న వినియోగించే అన్ని పరిశ్రమలను ఒక వేదికపైకి తీసుకురావడం ద్వారా రైతులకు మార్కెట్ అవకాశాలను పెంచడం లక్ష్యమని చెప్పారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి : పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



సమీక్షలో పాల్గొన్న మంత్రి పెమ్మసాని, నారాయణ, కన్నబాబు తదితరులు

అమరావతి రైతుల భూ సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతోందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో గురువారం మునిసిపల్ మంత్రి నారాయణ, మున్సిపల్ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబుతో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతుల సమస్యలైన అసైన్డ్ ల్యాండ్స్, లంక భూములు, జరీబు, మెట్ట భూములు రైతుల ప్లాట్ల విభజన, గ్రామ కంఠం, రాజధానికి సంబంధించిన ఆర్ అండ్ బి రోడ్లు ఏర్పాట్లు, టిడిఆర్ బాండ్లు, వీధి పోటు అంశాలపై అధికారులను పెమ్మసాని అడిగి తెలుసుకున్నారు. అధికారులకు, కాంట్రాక్టర్లకు ఇచ్చిన కాలప్రాతిపదికన పనులు వేగవంతంగా జరగాల్సిందేనని తెలిపారు. తదుపరి సమావేశంలో రైతుల సమస్యలకు సంబంధించి ప్రభుత్వ గైడ్ లైన్ల ప్రకారం నిర్ణయాలు, మినహాయింపులు తదితర అంశాలపై ఆయన మాట్లాడారు. రాజధాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని త్వరలోనే వారి వారి సమస్యలకు పరిష్కారం చూపిస్తామన్నారు. రాబోయే ఆరు నెలల్లో రాజధానికి కావాల్సిన మౌలిక సదుపాయాలను పూర్తి చేసే దిశగా పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు. మరో నాలుగు రోజుల్లో జరగబోవు రెండోదశ సమావేశంలో రైతులకు మరిన్ని వివరాలు అందజేస్తామని ఈ సందర్భంగా పెమ్మసాని స్పష్టం చేశారు.

వసతిగృహ విద్యార్థులకు కంచాలు పంపిణీ

- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



విద్యార్థులకు కంచాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు, పక్కన గ్రామ సర్పంచ్, విద్యాకమిటీ ఛైర్మన్, హెచ్‌ఎం, వార్డెన్

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం తోణాం గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఇద్దరు దాతలు కంచాలు, కూరగిన్నెలు పంపిణీ చేశారు. 'మంత్రి ఇలాకాలో కంచాలు కరువు' అనే శీర్షికతో అక్టోబర్ 26న 'ప్రజాశక్తి' మెయిన్ పేజీలో ప్రత్యేక కథనం వెలువడిన విషయం తెలిసిందే. తినడానికి కంచాలు కూడా లేకపోవడం పట్ల పలువురు విచారం వ్యక్తం చేయగా, మరికొందరు ఆయా విద్యార్థులకు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగానే విజయనగరానికి చెందిన రిటైర్డ్ లీడ్ బ్యాంకు మేనేజర్, రోటరీ క్లబ్ సభ్యులు ఆరిశెట్టి శ్రీనివాసరావు, రోటరీ బ్లడ్ బ్యాంకు సెక్రటరీ ఎ.ప్రవీణ్‌కుమార్ అంచాలియా కలిసి 102 మంది విద్యార్థులకు కంచాలు, కూరగిన్నెలు పంపిణీ చేసేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు శ్రీనివాసరావు ఆయన భార్య కామేశ్వరి, సుధీర్ రాజా, ప్రజాశక్తి బృందంతో కలిసి ఆ గిరిజన ఆశ్రమ పాఠశాలను గురువారం సందర్శించి, కంచాలు, గిన్నెలు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను కూడా పూర్వం ఈ ప్రాంతంలో బ్యాంకు మేనేజర్‌గా పనిచేశానని, పిల్లలకు సాయం చేయాలనే తలంపుతో వచ్చానని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.రామారావు మాట్లాడుతూ తమ విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయ బృందానికి శ్రీనివాసరావు, ప్రవీణ్ కుమార్ ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో తోణాం సర్పంచ్ ఎ.ఆదయ్య, పాఠశాల విద్యాకమిటీ ఛైర్‌పర్సన్ కె.రజినీకుమారి, స్థానిక డిప్యూటీ వార్డెన్ ఎం.లచ్చయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు పాల్గొన్నారు.



డోలీ కట్టి... నాలుగు కిలోమీటర్లు మోసుకెళ్లి

- రోగిని రక్షించిన గిరిజనులు

ప్రజాశక్తి -కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా)

డోలి కట్టి.. నాలుగు కిలోమీటర్లు రోగిని మోసుకెళ్లి గిరిజనులు రక్షించారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం తోలుంగూడకు రహదారి సౌకర్యలేమితో గురువారం మరోసారి తీవ్ర సమస్య ఏర్పడింది. ఈ గ్రామానికి చెందిన మండంగి కింబప్పు నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఆరోగ్యం క్షీణించింది. ఈ గ్రామానికి వాహనాలు వచ్చే మార్గ లేకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం నాడు డోలికట్టి సుమారు నాలుగు కిలోమీటర్ల కొండదారిలో గంట పాటు శ్రమించి రోగిని కొండ దిగువకు తీసుకొచ్చారు. అనంతరం నీలకంఠాపురం పిహెచ్‌సికి తరలించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రాణాలను ప్రమాదంలో పెట్టి ఇలా డోలి మోస్తూ కొండ ఎగువకు రావాల్సి వస్తోందని, వెంటనే తోలంగూడకు రహదారి నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు. ఈ ఒక్క గ్రామమే కాకుండా గిరిశిఖర గ్రామాల వారంతా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో అధికారులు ఈ సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

బావమరిది కుమారుడి హత్య

- అడగ్గానే డబ్బులివ్వలేదని బావ ఘాతుకం

ప్రజాశక్తి - తలుపుల (శ్రీ సత్యసాయి జిల్లా)



హర్షవర్ధన్ (ఫైల్)

శ్రీ సత్యసాయి జిల్లా తలుపుల మండలానికి చెందిన ఓ బాలుడు హత్యకు గురయ్యాడు. అడగ్గానే డబ్బులివ్వలేదన్న అక్కసుతో బాలుని తండ్రి అక్క భర్త ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇందుకు సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం గరికవారిపల్లి గ్రామానికి చెందిన చంద్రకళ, గంగాధర్ భార్యాభర్తలు. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు హర్షవర్ధన్(4). గంగాధర్ భవన నిర్మాణ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. సత్యసాయి జిల్లా కదిరి మండల పరిధిలోని మూర్తిపల్లిలో గంగాధర్ అక్క భర్త ప్రసాద్ నివాసం ఉంటున్నాడు. అతని కుమారుడు దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. కుమారుని వైద్య చికిత్సల నిమిత్తం తన బావ గంగాధర్‌ను డబ్బులు అడగగా పలుమార్లు సాయం చేశారు. ఇటీవల మరలా డబ్బులు అడగ్గా గంగాధర్ తన వద్దలేవని చెప్పడంతో బావపై కక్ష పెంచుకున్నాడు. గంగాధర్ కుమారుడు హర్షవర్ధన్‌ను బుధవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రం నుంచి తన ద్విచక్రవాహనంపై తీసుకెళ్లాడు. నంబులపూలకుంట మండలం మరకమ్మదిన్నె-జకవకల గ్రామాల మధ్యలోని అటవీ ప్రాంతంలో బాలుడిని గొంతునులిమి హత్య చేసినట్లు తెలుస్తోంది. అనంతరం ఏమీ తెలియని వాడిలా ఇంటికి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం ఒంటి గంట అయినా కుమారుడు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు వెంటనే అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి విచారించగా బాలుడిని ప్రసాద్ తీసుకువెళ్లినట్లు అక్కడి సిబ్బంది చెప్పారు. వెంటనే ప్రసాద్‌కు ఫోన్ చేయగా తన వద్ద బాలుడు లేడని, అప్పుడే మీ ఇంటి వద్ద వదిలి వచ్చేశాని సమాధానం ఇచ్చాడు. దీంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. బాలుని తల్లిదండ్రులు ప్రసాద్‌పై అనుమానం వ్యక్తం చేయడంతో ఆ దిశగా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రసాద్ వెళ్లిన ప్రాంతాలను ప్రత్యేక బృందాలు, డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలించారు. ఇందులో భాగంగా నంబులపూలకుంట మండలం మరకమ్మదిన్నె-జకవకల గ్రామాల మధ్యలోని అటవీ ప్రాంతంలో బాలుని మృతదేహాన్ని గుర్తించారు. బాలుడిని గంగాధర్ బావ ప్రసాద్ హత్య చేసినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చామని, అతనిని అదుపులోకి తీసుకుని పూర్తి వివరాలు తెలియజేస్తామని సత్యసాయి జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ విలేకరులకు తెలిపారు.



అంతిమ యాత్రలో పాల్గొన్న పలువురు నాయకులు

ముగిసిన రామనాథం అంత్యక్రియలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ, ప్రజాశక్తి బుక్‌హౌస్ మేనేజరు కొమ్మాలపాటి లక్ష్మయ్య మాతృమూర్తి రామనాథం అంత్యక్రియలు గురువారం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఒమ్మెవరంలో ముగిశాయి. భౌతికకాయానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతిమ యాత్రలో సిపిఎం బాపట్ల, ప్రకాశం జిల్లాల నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటం చేద్దాం

- నాయకులతో మాజీ సిఎం జగన్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

వచ్చేది మన ప్రభుత్వమేనని, అందరూ ధైర్యంగా ఉండాలని, సమస్యలపై పోరాటం చేద్దామని నాయకులు, కార్యకర్తలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భరోసానిచ్చారు. పులివెందుల నియోజకవర్గ వైసిపి ముఖ్య నేతలు గురువారం జగన్‌ను కలిసి నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. జగన్ స్పందిస్తూ.. గ్రామాలలో టిడిపి కూటమి నాయకులు చేస్తున్న ఆగడాలకు ఎవరూ భయపడకూడదని, ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానన్నారు. కార్యకర్తలకు ధైర్యాన్ని నింపి పార్టీని బలోపేతం చేయాలని, ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉండి అన్ని విధాల ఆదుకుంటామని భరోసానిచ్చిరు. ఉదయం 8.30 గంటలకు బెంగళూరుకు వెళ్లాల్సిన జగన్ వాతావరణం అనుకూలించకపోవడంతో ఉదయం 9:30 గంటలకు హెలికాప్టర్‌లో బెంగళూరుకు వెళ్లిపోయారు.

చిన్న నగరాల్లో తగ్గిన ఇళ్ల అమ్మకాలు

- టైర్2లో 4 శాతం పతనం
- ప్రాప్ ఈక్విటీ రిపోర్ట్



న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ సన్నగిల్లుతోంది. నివాసాల కొనుగోళ్లు తగ్గిపోతున్నాయి. ముఖ్యంగా దేశంలోని టాప్ 15 ద్వితీయ శ్రేణీ నగరాల్లో అమ్మకాలు క్షీణించాయి. ప్రస్తుత ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 4 శాతం విక్రయాలు తగ్గాయని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ ప్రాప్‌ఈక్విటీ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. గతేడాది ఇదే కాలంలోని 39,201 యూనిట్ల అమ్మకాలతో పోల్చితే ఈ ఏడాది క్యూ3లో 4 శాతం తగ్గదలలో 37,409 యూనిట్లకు పడిపోయాయి. నూతన గృహాల అమ్మకాలు ఏకంగా 10 శాతం క్షీణించి 28,721 యూనిట్లకు పరిమితమయ్యాయి. యూనిట్ల అమ్మకాల సంఖ్య తగ్గినప్పటికీ.. ప్రీమియం గృహాల అమ్మకాల్లో మాత్రం పెరుగుదల చోటు చేసుకుంది. 15 ప్రధాన నగరాలలో 8 నగరాల్లో అమ్మకాలు తగ్గాయి.

భువనేశ్వర్‌లో అత్యధికంగా 26 శాతం క్షీణత నమోదయ్యింది. అహ్మదాబాద్, సూరత్, వడోదర, నాసిక్, నాగ్‌పూర్, కోయంబత్తూరులో అమ్మకాలు 6 శాతం మేర తగ్గాయి. తిరువనంతపురంలో మాత్రం 19 శాతం అమ్మకాలు పెరగడం విశేషం. గాంధీనగర్, జైపూర్, మొహాలీ, లక్నో, భోపాల్, గోవాలలో వృద్ధి చోటు చేసుకుంది. "ముడి పదార్థాల ధరలు పెరగడం, ఇళ్ల ధరలు, పరిమాణాలు పెరగడంతో సరసమైన, మధ్య ఆదాయ గృహాల అమ్మకాల వేగం నెమ్మదించింది," అని ప్రాప్‌ఈక్విటీ వ్యవస్థాపకులు, సిఇఒ సమీర్ జసుజా పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో మరింత విస్తరిస్తాం

- దేశంలో 1.5 లక్షల కోట్ల ఎయుఎం లక్ష్యం
- పిరమిల్ ఫైనాన్స్ వెల్లడి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో మరింత విస్తరించడం ద్వారా ఇక్కడ వ్యాపారాన్ని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పిరమిల్ ఫైనాన్స్ రిటైల్ లెండింగ్ సిఇఒ జగ్‌దీప్ మల్లారెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మీడియా సమావేశంలో ఆ సంస్థ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అరవింద్ అయ్యర్‌తో కలిసి జగ్‌దీప్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో తమకు 59 శాఖలున్నాయని.. వీటిని మరింత విస్తరిస్తామని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా 428 నగరాల్లో 517 బ్రాంచ్‌ల ద్వారా 52 లక్షల వినియోగదారులకు సేవలందిస్తున్నామన్నారు. వీటిలో అత్యధిక శాఖలు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనే ఉన్నాయన్నారు. వచ్చే రెండు, మూడు నెలల్లో కొత్తగా మరో 75 శాఖలను అందుబాటులోకి తేనున్నామన్నారు. తమ మొత్తం అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ (ఎయుఎం) వ్యాపారం రూ.75,000 కోట్లుగా ఉండగా.. ఇందులో తెలుగు రాష్ట్రాల వాటా రూ.8,300 కోట్లుగా ఉందన్నారు. గృహ రుణాలు సహా ముఖ్యంగా ఎంఎస్‌ఎంఇ రంగంలో రుణాల కోసం డిమాండ్ మరింత బలంగా ఉందన్నారు. గృహ రుణాలపై 10 శాతం నుంచి 14 శాతం వరకు, ఎంఎస్‌ఎంఇలకు 15 శాతం వరకు వడ్డీ రేట్లను అమలు చేస్తోన్నామన్నారు. పిరమల్ ఫైనాన్స్ రిటైల్ ఎయుఎం ఇప్పటికే రూ.75,000 కోట్లు దాటిందన్నారు. 2026 మార్చి నాటికి రూ.1 లక్ష కోట్లను, 2028 మార్చి నాటికి రూ.1.5 లక్షల కోట్ల ఎయుఎంను చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.




సెన్సెక్స్ 110 పాయింట్ల పెరుగుదల

ముంబయి : వరుసగా రెండో సెషన్‌లోనూ మార్కెట్లు రాణించాయి. గురువారం ఇంట్రాడేలో జీవనకాల గరిష్టాలకు చేరిన సూచీలు తుదకు లాభాల స్వీకరణ వల్ల స్వల్ప పెరుగుదలతో సరిపెట్టుకున్నాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 110 పాయింట్లు పెరిగి 85,720కు చేరింది. ఉదయం 85,745 పాయింట్ల దగ్గర ప్రారంభమైన సెన్సెక్స్ ఇంట్రాడేలో 86,055 వద్ద జీవనకాల గరిష్టాన్ని నమోదు చేసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 10 పాయింట్ల లాభంతో 26,215 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ఐసిఐసిఐ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌యూఎల్, హెచ్‌సిఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ఉండగా.. మారుతీ, ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్‌బిఐ, టాటా స్టీల్, టిసిఎస్ షేర్లు నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

వృద్ధ దంపతులపై దాడి

- భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి (చిత్తూరు జిల్లా)



వైసిపి శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి తల్లిదండ్రులపై గుర్తు తెలియని అగంతకుడు కత్తితో దాడికి తెగబడ్డాడు. ఈ దాడిలో మధుసూధన్ రెడ్డి తల్లి జయమ్మ (70) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, తండ్రి మహాదేవరెడ్డి (81) తీవ్రంగా గాయపడ్డారు. అత్యంత సంచలనం సృష్టించిన ఈ సంఘటన గురువారం తెల్లవారు జామున శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని పుల్లారెడ్డి కండ్రిగలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... పుల్లారెడ్డి కండ్రిగ వ్యవసాయ క్షేత్రంలో నిర్మించిన ఓ విలాసవంతమైన ఇంటిలో మధుసూదన్ రెడ్డి తల్లిదండ్రులు నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని ఓ అగంతకుడు గ్యాస్ కట్టర్ సాయంతో స్టోర్ రూమ్ నుంచి వంట గదిలోకి ప్రవేశించాడు. బెడ్రూమ్‌లో గాఢ నిద్రలో ఉన్న జయమ్మ, మహాదేవరెడ్డి దంపతులపై కత్తితో దాడి చేశాడు. తీవ్ర వృద్ధాప్యంలో ఉన్న మహాదేవరెడ్డి దుండగుడి దాడితో కింద పడి అపస్మారకస్థితికి చేరుకోగా, జయమ్మ ప్రతిఘటించింది. దీంతో దుండగుడు ఆమెను హత మార్చాడు. ఆమె చెవికి ఉన్న కమ్మలు, బంగారు గాజులు లాక్కెళ్లిపోయాడు. గురువారం ఉదయం ఇంటి వద్దకు వచ్చిన పనిమనిషి ఎంత కొట్టినా జయమ్మ దంపతులు తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు లోపలకొచ్చి చూడగా జయమ్మ దంపతులు రక్తపు మడుగులో ఉన్నారు. జయమ్మ మృతిచెందిందని నిర్ధారించుకున్న బంధువులు మహాదేవరెడ్డిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణులు సైతం ఘటన జరిగిన ఇంటితోపాటు సమీప ప్రాంతాల్లో ఆధారాల కోసం ముమ్మర తనిఖీలు చేపట్టారు. చోరీ కోసం దాడి జరిగిందా..? లేక పాత కక్షలు, రాజకీయ నేపథ్యంలో జరిగిందా..? అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఒంటరిగా ఉన్న వృద్ధ దంపతులపై దాడి చేసి నగలు, డబ్బు దోచుకోవాలని ఉద్దేశంతోనే స్థానికంగా ఉంటున్న కొందరు ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని మధుసూదన్ రెడ్డి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అనుమానితుల పేర్లను పోలీసులకు తెలిపినట్లు సమాచారం. ఈ ఘటనపై విచారణ ముమ్మరంగా సాగుతోందని, త్వరలోనే నిందితులను అదుపులోకి తీసుకుంటామని తిరుపతి అదనపు ఎస్‌పి రవి మనోహరాచారి మీడియాకు వెల్లడించారు.

ఉపాధి నిధులు మురిగిపోనివ్వొద్దు

- రోడ్లు, పాఠశాలల ప్రహరీలకు ప్రతిపాదనలు చేయాలి
- రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు

ప్రజాశక్తి-కంటోన్మెంట్ (విజయనగరం)

గ్రామీణ ఉపాధిహామీ నిధులతో పాఠశాలల ప్రహరీలు, లింకు రోడ్లు, సిమ్మెంటు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వి.జోగేశ్వరరావు కోరారు. నిధులను పూర్తిగా వినియోగించుకోవాలని, మురిగిపోకుండా చూడాలని అధికారులకు సూచించారు. గతంతో పోల్చితే ప్రస్తుతం జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందని, దీనిని మరింత ముందుకు తీసుకువెళ్లి, రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. చైర్మన్‌తోపాటు కమిటీ సభ్యులు నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, డాక్టర్ పివివి సూర్యనారాయణరాజు, వరుదు కళ్యాణి గురువారం జిల్లాలో పర్యటించారు. కలెక్టరేట్లో వివిధ శాఖలకు మంజూరైన నిధులు, వినియోగం, అవసరాలపై సమీక్షించారు. వ్యవసాయం, ఉద్యానశాఖ, పశు సంవర్థకశాఖ, మైక్రో ఇరిగేషన్, నీటిపారుదల, వైద్యారోగ్యం, విద్య, తాగునీరు, పంచాయితీరాజ్, జిల్లా పరిషత్, పబ్లిక్ హెల్త్, ఆర్అండ్‌బి, డిఆర్‌డిఎ, స్త్రీ శిశు సంక్షేమ తదితర శాఖలపై చర్చించారు. మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో సేంద్రీయ వ్యవసాయం ద్వారా కూరగాయలు పండించి మధ్యాహ్న భోజన పథకానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయడానికి డిఆర్‌డిఎ చేసిన ప్రణాళికను అభినందించారు. ఈ ప్రణాళికను రాష్ట్రమంతా అమలు చేయడానికి కృషి చేస్తామని చైర్మన్ ప్రకటించారు. జిల్లాలో మహిళా అక్షరాస్యత తక్కువగా ఉందని, దీనిని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. వరి ఉత్పాదకత పెంచాలని సబ్సిడీపై రెయిన్ గన్‌లను అందజేసేందుకు ప్రతిపాదనలు చేయాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ హెల్త్ సెంటర్ భవనాలను పూర్తిచేయడంపై దృష్టి పెట్టాలన్నారు. చాలాచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థలో, అద్దె భవనాల్లో ఉన్నాయని, సమీపంలో ఖాళీగా ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని సూచించారు. కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ చాలాచోట్ల పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరాయని చెప్పారు. ఉపాధిహామీ ద్వారా పాఠశాలల ప్రహరీలు నిర్మించాలని సూచించారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మాట్లాడుతూ వర్షాల వల్ల వరిపంట కొంతమేర దెబ్బతిందని, నూకలు ఎక్కువగా వస్తుండటం వల్ల ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు రైతు నష్టపోకుండా చూడాలని కోరారు.

శ్రీలంకను ముంచెత్తిన భారీ వర్షాలు..

- 31 మంది మృతి

కొలంబో : కొన్ని రోజుల నుండి కురుస్తున్న భారీవర్షాలతో శ్రీలంక అతలాకుతలమైంది. కొండచరియలు విరిగిపడటంతో పాటు వరదలు ముంచెత్తడంతో సుమారు 31 మంది మరణించినట్లు అధికారులు గురువారం ప్రకటించారు. కొలంబోకు తూర్పున 300 కి.మీ దూరంలో ఉన్న మధ్యప్రావిన్స్‌లోని పర్వతప్రాంతాలైన బదుల్లా, నువారా ఎలియాలో 18 మంది మరణించినట్లు ప్రభుత్వ విపత్తు నిర్వహణ కేంద్రం గురువారం తెలిపింది. ఇవే ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో మరో 14మంది గల్లంతైనట్లు వెల్లడించింది. వారాంతంలో కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు, పొలాలు, రహదారులను వరదలు ముంచెత్తాయి.

పర్వతప్రాంతాలను రాళ్లు, బురద మరియు చెట్లు పట్టాలపై పడటంతో రైల్వే వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమైంది. పలు ప్రాంతాల్లో ప్యాసింజర్ రైళ్లను నిలిపివేశామని అధికారులు తెలిపారు. మరికొన్ని ప్రాంతాల్లో రోడ్లను కూడా మూసివేశామని ప్రకటించారు. వర్షాలు, ప్రతికూల వాతావరణంతో సుమారు 4,000 కుటుంబాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు విపత్తు నిర్వహణ కేంద్రం ప్రకటించింది.

జాసిర్‌కు ఎన్ఐఎ కస్టడీ పొడిగింపు


న్యూఢిల్లీ : ఢిల్లీ పేలుళ్ల కేసులో కీలక నిందితుడు జాసిర్ బిలాల్ వానికి ఢిల్లీకోర్టు ఎన్ఐఎ కస్టడీని పొడిగించింది. ఈ నెల 18న ప్రిన్సిపల్ సెషన్స్ మరియు జిల్లా జడ్జి అంజు బజాజ్ చంద్నా మంజూరు చేసిన 10రోజుల కస్టడీ నేటితో ముగియడంతో .. ఆయనను గురువారం కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఎన్ఐఎ కస్టడీని మరో వారం రోజుల పాటు పొడిగిస్తున్నట్లు ఢిల్లీ కోర్టు వెల్లడించింది. ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో నవంబర్ 10న పేలుడు జరిగిన సంగతి తెలిసిందే.

భార్యని చంపిన భర్తకు జీవిత ఖైదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

భార్యను హతమార్చిన కేసులో ముద్దాయి జీరు వెంకట రమణకి శ్రీకాకుళం కోర్టు జీవిత ఖైదు శిక్షను గురువారం ఖరారు చేసిందని ఎస్‌పి కె.వి. మహేశ్వర రెడ్డి తెలిపారు. కర్ణపు నీలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు... ముద్దాయి తన భార్య జీరు రమణమ్మ (24) వేరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుందన అనుమానంతో ఏడాది పాటు ఆమె తన కన్నవారి ఇంట్లో ఉండేదన్నారు. అనంతరం ముద్దాయి తండ్రి మరణంతో అంత్యక్రియల నిమిత్తం ఇంటికి ఇంటికి వచ్చిందని చెప్పారు. 2018 మార్చి 14న బాణంలోని ముద్దాయి ఇంటి వద్ద భాభార్యభర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుందన్నారు. నీతో ఉండనని ఆమె స్పష్టంగా చెప్పిందన్నారు. దీంతో ఆగ్రహంతో ముద్దాయి పదునైన కత్తితో ఆమె మెడపై విచక్షణారహితంగా దాడి చేయగా, ఆమె అక్కడికక్కడే మృతి చెందిందని అన్నారు. ఆమె బంధువుల ఫిర్యాదు మేఉకు అప్పటి జె.ఆర్.పురం సిఐ వై.రామకృష్ణ కేసు దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారని చెప్పారు. తరువాత ముద్దాయి బెయిల్‌పై విడుదలై కొన్ని వాయిదాలకు హాజరయ్యారని అన్నారు. అనంతరం గత ఐదేళ్లుగా కోర్టుకు హాజరుకాకపోవడంతో ముద్దాయిపై నాన్ బెయిల్‌బుల్ వారంట్ జారీ చేసినట్లు వివరించారు. ప్రత్యేక టీం ఏర్పాటు చేసి ముద్దాయి ఉన్నచోట విచారణ చేపట్టి గుంటూరు పట్టణంలో అతడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఆ తరువాత కోర్టులో హాజరుపరచగా కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించి, తదుపరి కోర్టు కేసును త్వరితగతిన విచారణ కోసం ట్రయల్ షెడ్యూల్‌ను ప్రకటించిందని అన్నారు. ఈ నేపథ్యంలో కేసులోని సాక్షులను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఆమదాలవలస సర్కిల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, పొందూరు పోలీసుల సమన్వయం, సాక్షుల పక్కా హాజరుపరిచారని చెప్పారు. కోర్టు ట్రయల్‌ను వేగవంతంగా పూర్తి చేసి తీర్పును వెల్లడించిందని అన్నారు. ఆయనకు జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ రోర్టు తీర్పునిచ్చిందని అన్నారు. జిల్లాలో తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, ఇలాంటి కేసుల్లో చట్టపరమైన చర్యలను వేగవంతం చేసేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నేర నియంత్రణ, తప్పు చేసిన వారికి శిక్ష లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు.

తొలిసారిగా అత్త పాత్రలో రేణు దేశాయ్




టాలీవుడ్ కథానాయిక రేణు దేశాయ్ మళ్లీ సినిమాల్లో బిజీ అయ్యేందుకు సిద్ధమయ్యారు. ఆమెకు దర్శకత్వంపై ఇష్టం ఉంది. తన సినిమా కోసం కథలు రాసుకుంటున్నారు. ఇదే సమయంలో నటనపై కూడా ఆమె ఫోకస్ వుంది. కాకపోతే సరైన ప్రాజెక్ట్ కుదరడం లేదని సమాచారం. టైగర్ నాగేశ్వరరావు సినిమాలో ఆమె ఓ పాత్రలో నటించిన విషయం తెలిసిందే. అయితే సినిమా ఫ్లాఫ్ అవ్వడంతో ఆ పాత్రకి రావాల్సిన గుర్తింపు రాలేదు. నిర్మాత డిఎస్ రావు కుమారుడు సాయి కృష్ణ దమ్మాలపాటి కథానాయకుడిగా పరిచయం అవుతున్న సినిమా '16 రోజుల పండగ' సినిమాలో నటిస్తు న్నారు. ఈ సినిమాలో రేణు అత్త పాత్రలో కనిపించబోతున్నారు. అత్త రోల్‌లో నటించటం ఆమెకు ఇదే మొదటిసారి. పిల్ల జమీందార్, మిస్టర్ నూకయ్య, ద్రోణ లాంటి చిత్రాలని తీసిన నిర్మాత డిఎస్ రావు. అత్త పాత్రలో రేణుదేశాయ్ ఎలా నటిస్తారోననే చర్చ సోషల్‌మీడియాలో బాగా ట్రెండింగ్ అవుతోంది.

ఎక్కువ పనిగంటలు మంచిది కాదు



'రోజుకు 8 గంటల షూటింగ్' అంశంపై తాజాగా కీర్తిసురేష్ తన అనుభవాలని పంచుకున్నారు. కీర్తి మాట్లాడుతూ.. 'ఏ షెడ్యూల్‌కైనా నేను అలవాటు పడగలను. 'మహానటి' సినిమా సమయంలో ఒకే రోజులో మూడు వేర్వేరు సినిమాల సెట్లకు వెళ్లి షూట్ చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కానీ ఇది ప్రతి నటుడికి సాధ్యం కాదు. వారి పరిస్థితులు, సామర్థ్యాలు వేరుగా ఉంటాయి. 9 గంటలకు షూట్ ఉంటే 7:30కి సెట్‌లో ఉండాలి. అంటే.. 5:30 కల్లా నిద్ర లేవాల్సి వుంటుంది. అలాగే సాయంత్రం 6.30కి షూట్ ముగిసినా మేకప్ తొలగించు కోవడం, కాస్ట్యూమ్స్ మార్చుకోవడం, ఇంటికి చేరుకునే సరికి రాత్రి 10.30 అవుతుంది. దీని బట్టి నటులు రోజుకు 6 గంటలు కూడా సరిగ్గా నిద్రపోవడం లేదు. ఇది మంచిది కాదు' అని ఆవేదన వ్యక్తం చేసిన ఆమె, టెక్నీషియన్ల కష్టాల గురించి కూడా మాట్లాడారు. 'నటులు ఆలస్యంగా వచ్చి ముందే వెళ్లిపోతారు కానీ లైట్, కెమెరా, ఆర్ట్ డిపార్ట్‌మెంట్ వంటి టెక్నీషియన్స్ మాత్రం, మాకంటే ముందే వచ్చి చివర్లోనే సెట్ నుండి బయలుదేరుతారు. వారి పని గంటలు మరింత కఠినంగా ఉంటాయి. టాలీవుడ్, కోలీవుడ్‌లలో 9-6 షిఫ్ట్ విధానం పెరుగుతున్నప్పటికీ మాలీవుడ్, బాలీవుడ్‌ల్లో ఇంకా 12 గంటల షిఫ్ట్‌లే పాటిస్తున్నారు. బ్రేక్ లేకుండా పని చేసే పరిస్థితుల్లో లైట్‌మ్యాన్‌లకు రోజుకు కేవలం 3 నుండి 4 గంటల నిద్రే దొరుకుతుంది' అని ఆమె పేర్కొన్నారు.

'శ్రీనివాస మంగాపురం' ఫైనల్




ఘట్టమనేని జయకృష్ణ డెబ్యూ మూవీ టైటిల్ ప్రకటించారు. అజయ్ భూపతి డైరెక్షన్‌లో వస్తోన్న ఈ సినిమాకి 'శ్రీనివాస మంగాపురం' టైటిల్ ఫిక్స్ చేశారు. తాజాగా ఇందుకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. అశ్వినీదత్ సమర్పణలో చందమామ కథలు బ్యానర్‌పై కిరణ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తిరుపతి నేపథ్యంలో జరిగే ప్రేమ కథగా ఈ సినిమా రాబోతుంది. ప్రస్తుతం చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఫస్ట్ లుక్, ఇతర అప్డేట్స్ త్వరలోనే ప్రకటించనున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రవీనా టండన్ కూతురు రష తడానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

నేడు 'జనం' సినిమా విడుదల



విఆర్‌పి క్రియేషన్స్ బ్యానర్‌పై దర్శకుడు వెంకటరమణ పసుపు లేటి తెరకెక్కించిన సినిమా 'జనం'. కథతో పాటు, స్క్రీన్ ప్లే, డైలాగులు, దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తూ తీసిన సినిమా ఇది. శుక్రవారంనాడు థియేటర్లలో విడుదల కానుంది. ప్రముఖ నటులు సుమన్, అజయ్‌ఘోష్‌లతో పాటుగా కె.కిషోర్; వెంకట రమణ, ప్రగ్య నయన్, మౌనిక, లక్కీ, జయవాని, రషీదా తదితరులు కీలక పాత్రల్లో నటించారు. పి.పద్మావతి సమర్పించగా, డాక్టర్ సైమల్లి అరుణ్ కుమార్ సహ నిర్మాతగా వ్యవహరించారు. చిన్న నేపథ్య సంగీతం అందించగా, రాజ్‌కుమార్ పాటల్ని సమకూర్చారు. ఎడిటర్‌గా నందమూరి హరి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

'బైకర్' వాయిదా



శర్వానంద్ నటిస్తున్న కొత్త చిత్రం 'బైకర్'. అభిలాష్ రెడ్డి కంకర తెరకెక్కిస్తున్నారు. చిత్ర యూనిట్ ఈ సినిమాను డిసెంబర్ 6న రిలీజ్ చేస్తున్నట్లు గతంలో వెల్లడించింది. అయితే ఇప్పుడు రిలీజ్ డేట్‌ను వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్ర యూనిట్ ఎక్స్ వేదికగా ఒక ప్రకటనను విడుదల చేసింది. 'సినిమాకు సంబంధించిన వర్క్‌ను పర్ఫెక్ట్‌గా తీర్చిదిద్దే పనుల్లో యూనిట్ బిజీగా ఉందని, ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రాన్ని అందించేందుకు తాము పని చేస్తున్నామని, అందుకే ఈ సినిమాకు మరింత సమయం తీసుకుంటున్న'ట్లు పేర్కొన్నారు. అలాగే 'ఈ సినిమాను 3డి, 4డి లతో పాటు ఇతర ఫార్మాట్లలోనూ రిలీజ్ చేయబోతున్న'ట్లు ప్రకటించారు. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇందులో మాళవిక నాయర్ హీరోయిన్‌గా కనిపించనున్నారు. గిబ్రాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

ఢిల్లీలో వాయు కాలుష్యంపై 3న సుప్రీంకోర్టు విచారణ



న్యూఢిల్లీ : ఢిల్లీ, దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)లో గాలి నాణ్యత రోజురోజుకు దిగజారిపోతున్నది. ఈ క్రమంలో ఢిల్లీలో కాలుష్య కట్టడి కోరుతూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించిన సుప్రీంకోర్టు డిసెంబర్ 3న విచారించనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా ఈ కాలుష్య సమస్యను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. అలాగే, పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఇది ఆరోగ్య అత్యవసర పరిస్థితి అని సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్ చేసిన వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది. 'కాలుష్యం విషయంలో కోర్టు ఏం మాయ చేయగలదు..' అని ఈ సందర్భంగా న్యాయస్థానం ప్రశ్నించింది. 'ఒక న్యాయస్థానంగా సుప్రీంకోర్టు ఏం మాయాజాలం చేయగలదు? ఢిల్లీ- ఎన్‌షిఆర్‌కు ఇది ప్రమాదకరమని తెలుసు. అయితే పరిష్కారం ఎమిటనేది ఇక్కడ ముఖ్యం. దీనికి గల కారణాలను గుర్తించాలి. పరిష్కారాలు కేవలం ఆ రంగానికి చెందిన నిపుణుల నుంచే లభిస్తాయి. దీర్ఘకాలిక పరిష్కారాలు లభిస్తాయని మేం ఆశిస్తున్నాం' అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

ఆల్‌కార్గో లాజిస్టిక్స్ 71 కేంద్రాలకు చేరిక

హైదరాబాద్ : దేశీయ సరఫరా గొలుసు, ఎక్స్‌ప్రెస్ డిస్ట్రిబ్యూషన్, కన్సల్టేటివ్ లాజిస్టిక్స్ వ్యాపారాలను నిర్వహిస్తున్న ఆల్‌కార్గో లాజిస్టిక్స్ లిమిటెడ్ దేశవ్యాప్తంగా తన నెట్‌వర్క్‌ను 21 కేంద్రాల నుండి 71 కేంద్రాలకు విస్తరించినట్లు తెలిపింది. ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ ప్రాంతాల అంతటా మెరుగైన ప్రాంతీయ కనెక్టివిటీని, సేవాల్లో విశ్వసనీయతను పెంచడానికి ఇది దోహదం చేయనుందని ఆల్‌కార్గో లాజిస్టిక్స్ ఎండి, సిఇఒ కేతన్ కులకర్ణి తెలిపారు. దేశవ్యాప్తంగా తమ లాజిస్టిక్స్ నిర్మాణాన్ని బలోపేతం చేయడంలో ఒక కీలకమైన మలుపు అని పేర్కొన్నారు.

పదోన్నతుల్లో రిజర్వేషన్ల అమలుకు విధివిధానాలు ఖరారు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతుల్లో షెడ్యూల్ కులాలకు చెందిన మూడు గ్రూపులకు రిజర్వేషన్ల అమలు విధానంపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకోసం ఎపి స్టేట్ సబ్ ఆర్డినేట్ సర్వీస్ రూల్స్ 1996ను సవరించారు. షెడ్యూల్ కులాలకు మొత్తంగా పదోన్నతుల్లో 15 శాతం రిజర్వేషన్ కల్పిస్తుండగా దీనిని వర్గీకరించి గ్రూప్ 1కు 1 శాతం, గ్రూప్ 2కు 6.5 శాతం, గ్రూప్ 3కు 7.5 శాతం రిజర్వేషన్లు కల్పించారు. అదేవిధంగా రోస్టర్ పాయింట్లు ప్రతి గ్రూపునకు వేర్వేరుగా కేటాయించనున్నారు. అర్హులైన అభ్యర్థులు లేకపోతే ఖాళీలను తదుపరి సంవత్సరానికి బదిలీ చేయాలని, రెండో ఏడాది కూడా లేకపోతే గ్రూపు 1 నుంచి గ్రూప్2కు, గ్రూప్ 2 నుంచి గ్రూప్ 3కి, గ్రూపు 3 నుంచి ఫీడర్ కేటగిరి అభ్యర్థులతో మెరిట్ కమ్ సీనియార్టీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పిస్తారు. షెడ్యూల్ కులాల్లో మహిళా ఉద్యోగులకు పదోన్నతులు 33.50 శాతం హారిజంటల్ విధానం అమలు చేస్తారు. ఈ ఏడాది ఏప్రిల్ 18వ తేదీ నుంచి ఈ రిజర్వేషన్ విధానం అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. ఖాళీల లెక్కింపు, రోస్టర్ రిజిస్టర్ నిర్వహణ తదితర అంశాలను ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

పిఎం ఇ బస్సు.. తుస్సు..!

- బస్సులు నడపలేమంటున్న ఆపరేటర్లు..!
- సర్కారు ఇచ్చే తక్కువ చార్జీలు, ఇన్‌ఫ్రానే సమస్య అని ఆవేదన
- డిపో ఎలక్ట్రిఫికేషన్, చార్జింగ్ స్టేషన్లు సరిపడా లేవని అసహనం




న్యూఢిల్లీ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన పలు పథకాలు ఆర్భాటాలకే పరిమితమనే విమర్శల వేళ పిఎం ఇ-బస్ సేవా స్కీమ్ కూడా తాజాగా ఈ జాబితాలోకి వచ్చి చేరింది. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) విధానంలో తీసుకొచ్చిన ఈ స్కీమ్ తమకు మోయలేని భారంగా మారుతున్నదంటూ ప్రైవేటు కంపెనీలు బస్సులను నడుపడానికి విముఖత వ్యక్తం చేస్తున్నాయి. కేంద్రానికి ముందస్తు ప్రణాళికలు లేకపోవడమే ఈ పథకం వైఫల్యానికి కారణమని నిపుణులు మండిపడుతున్నారు.

పెట్రోల్, డీజిల్ వాహనాల వాడకాన్ని తగ్గిస్తూ పర్యావరణహిత వాహనాలైన ఎలక్ట్రిక్ బస్సులను ప్రోత్సహించడమే లక్ష్యంగా 2023 ఆగస్టులో కేంద్రం 'పిఎం ఇ-బస్ సేవా' పేరిట ఓ స్కీమ్‌ను తీసుకొచ్చింది. దేశంలోని 14 రాష్ట్రాలు, 4 కేంద్రపాలిత ప్రాంతాల్లోని నగరాల్లో 10 వేల ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని ప్రణాళికలను సిద్ధం చేశారు. దీని కోసం రూ. 10,900 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు. ఈ పథకంలో భాగంగా ప్రాథమికంగా బస్సులను నడపడం, వాటి మెయింటెనెన్స్.. ఇలా ఇ-బస్సులకు అవసరమైన మొత్తాన్ని బిడ్డింగ్‌లో గెలిచిన ప్రైవేట్ కంపెనీలే భరించాలి. ఆ తర్వాత ప్రభుత్వం చెల్లింపులు నిర్వహిస్తుంది. పథకంలో నిబంధనల ప్రకారం.. కిలోమీటర్‌కు రూ. 29-రూ. 70 వరకూ చెల్లింపులు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నది. కానీ, విద్యుత్తు చార్జీలు, బస్సు బ్యాటరీ ధర, దాని జీవితకాలం, సిబ్బందికి వేతనాలు, బస్సుల మరమ్మతులు-మెయింటెనెన్స్ అన్నింటినీ కలుపుకొంటే ప్రారంభంలోనే తమకు కిలోమీటర్ బస్సు ప్రయాణానికి రూ.77-రూ.80 వరకూ ఖర్చు వస్తున్నదని ప్రైవేట్ రంగ ఆపరేటర్లు చెబుతున్నారు. బస్సులో అమర్చే బ్యాటరీ ఖరీదు రూ.30-45 లక్షలుగా ఉంటుందని, 8-12 ఏళ్ల మన్నికతో ఉండే ఈ బ్యాటరీ ప్రతీ ఏటా 3 శాతం వరకూ ఛార్జింగ్ సామర్థ్యాన్ని కోల్పోతుందని గుర్తు చేస్తున్నారు. ఇది కూడా నిర్వహణ భారానిన మరింత పెంచుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఆ కనీస చెల్లింపులు కూడా సకాలంలో అందడం లేదని చెబుతున్నారు. పైగా బస్సులకు అవసరమైన ఇవీ ఛార్జింగ్ స్టేషన్లు సరిపడినన్ని ఇంకా అందుబాటులోకి రాలేదని, డిపోల్లో ఎలక్ట్రిఫికేషన్ కూడా పూర్తిస్థాయిలో జరుగలేదని గుర్తు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో ఇ-బస్సులను ఎలా నడిపేదని నిలదీస్తున్న ప్రైవేటు ఆపరేటర్లు.. ఈ పథకం నుంచి వైదొలుగుతున్నారు.

ప్రపంచ జనాభాలో 81 శాతం మంది నగర, పట్టణాల్లోనే..

- 2050 నాటికి 83 శాతానికి పెరుగుతుందని అంచనా
- ఐక్యరాజ్య సమితి నివేదిక వెల్లడి


న్యూయార్క్ : ప్రపంచ జనాభాలో 81 శాతం మంది పట్టణ, నగర ప్రాంతాల్లో నివసిస్తున్నారని ఐక్యరాజ్య సమితి (యుఎన్) తాజా నివేదిక వెల్లడించింది. 'వరల్డ్ అర్బనైజేషన్ ప్రాస్పెక్ట్స్ 2025' పేరిట యుఎన్ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ప్రపంచ జనాభాలో 45 శాతం మంది ఇప్పుడు మెగా నగరాలు, 36 శాతం మంది పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. పాట్రిక్ గెర్లాండ్ నేతృత్వంలోని బృందం ఈ నివేదికను రూపొందించింది. 2018లో ఈ సంఖ్య 55 శాతంగా ఉందని నివేదిక పేర్కొనడం గమనార్హం. అయితే 2050 నాటికి ప్రపంచ జనాభాలో 83 శాతం మంది నగర, పట్టణ ప్రాంతాల్లో నివసించే అవకాశం ఉంది. గతంలో పరిశోధకులు వివిధ దేశాల్లో వేర్వేరు నిర్వచనాలను (ఫార్ములా) అనుసరించారు. కానీ ఈసారి ఒకే ఫార్ములాను ప్రాతిపదికగా తీసుకుని నివేదికను తయారుచేశారు. ఈ నివేదికలో పరిశోధకులు కనీసం 50 వేల మంది నివసించే లేదా చదరపు కిలోమీటరుకు కనీసం 1,500 మంది జనసాంద్రత ఉన్న ప్రాంతాలను మెగా నగరాలుగా నిర్వచించారు. అలాగే కనీసం 5 వేల మంది నివసించే లేదా చదరపు కిలోమీటరుకు కనీసం 300 మంది జనసాంద్రత ఉన్న ప్రాంతాలను పట్టణాలుగా వర్గీకరించారు. మిగిలిన ప్రాంతాలను గ్రామీణ ప్రాంతాలుగా వర్గీకరించారు. దీని ప్రకారం ప్రపంచ జనాభాలో 19 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ప్రపంచమంతటా పట్టణీకరణ పెరుగుతున్నప్పటికీ, ఆయా ప్రాంతాల్లో దీనికి కారణాలు వేరే విధంగా ఉన్నాయి. తూర్పు, దక్షిణ ఆసియాలో విద్య, ఉపాధి కోసం, కొన్నిసార్లు సామాజిక జీవనం కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు ప్రజలు వలస వెళ్లడం ప్రధాన కారణంగా నివేదిక తేల్చింది. ఐరోపా, ఉత్తర అమెరికాలో అంతర్జాతీయ వలసలు పట్టణీకరణ పెరుగుదలకు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఆఫ్రికాలో మరణాల కంటే జననాలు ఎక్కువగా ఉండటం వల్ల పట్టణీకరణ



పెరుగుతోందని నివేదికలో విశ్లేషించారు.

4వ స్థానంలో ఢిల్లీ..

యుఎన్ నివేదిక ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక జనాబా కలిగిన టాప్ 10 నగరాల్లో 33.9 మిలియన్ల జనాభాతో ఢిల్లీ 4వ స్థానంలో నిలిచింది. తరువాత 23.8 మిలియన్ల జనాభాతో కోల్‌కతా 10వ స్థానంలో ఉంది. భారత్‌లో అత్యధిక జనాభా ఉన్న పట్టణ ప్రాంతం. హాజీపూర్ (బిహార్). అదే విధంగా ప్రపంచ వ్యాప్తంగా నగరాల సంఖ్య (10 మిలియన్ లేదా అంతకంటే ఎక్కువ మంది నివాసితులు) పెరుగుతూనే ఉంది. దీనిలో సగానికి పైగా ఆసియాలో ఉన్నాయి. మెగాసిటీల సంఖ్య 1975లో 8 నుండి 2025లో 33కు పెరిగితే ఆసియాలో 19 ఉన్నాయి. అడిస్ అబాబా (ఇథియోపియా), డార్ ఎస్ సలాం (యునైటెడ్ రిపబ్లిక్ ఆఫ్ టాంజానియా), కౌలాలంపూర్ (మలేషియా)లో జనాభా 10 మిలియన్లకు పైగా పెరగడంతో 2050 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 37 మెగాసిటీలు ఉంటాయని నివేదిక సూచిస్తుంది. జకార్తా (ఇండోనేషియా) ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన నగరం, 2025లో దాదాపు 42 మిలియన్ల మంది నివాసితులున్నారు. తరువాత ఢాకా (బంగ్లాదేశ్) దాదాపు 37 మిలియన్లతో, టోక్యో (జపాన్) 33 మిలియన్లతో ఉన్నాయి. కైరో (ఈజిప్ట్) ప్రపంచంలోని పది అతిపెద్ద నగరాల్లో ఒకటి. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఢాకా, ఈ శతాబ్దం మధ్య నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద నగరంగా మారుతుందని నివేదిక వెల్లడించింది.



వచ్చే ఏడాది జి-20లో దక్షిణాఫ్రికాపై నిషేధం

- రాయితీలూ నిలిపివేస్తాం : ట్రంప్

న్యూయార్క్: దక్షిణాఫ్రికాలో మైనార్టీలైన శ్వేతజాతి రైతులను చూస్తున్న తీరుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహంగా ఉన్నారు. ఈ క్రమంలో ట్రంప్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. వచ్చే ఏడాది అమెరికాలో జరిగే జి20 సదస్సు నుంచి దక్షిణాఫ్రికాను నిషేధిస్తున్నట్టు ప్రకటించారు.

2026 జి20 శిఖరాగ్ర సదస్సు అమెరికాలోని మయామిలో జరగనుంది. దీనిలో దక్షిణాఫ్రికా పాల్గొనకుండా నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించారు. ఆ దేశానికి రాయితీలను కూడా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఆ దేశంలో జరిగిన సదస్సుల్లో పాల్గొన్న అమెరికా ప్రతినిధిపై వారు వ్యవహరించిన తీరును తప్పుబట్టారు. ట్రంప్ ప్రకటనపై దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమఫోసా స్పందించారు. జి20లో సభ్యుడిగా చురుకైన తమ పాత్రను కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా ఇటీవల తమ దేశంలో జరిగిన జి20 శిఖరాగ్ర సమావేశం.. అత్యంత విజయవంతమైన వాటిల్లో ఒకటిగా నిలిచిందన్నారు. సదస్సుకు హాజరైనవారే స్వయంగా ఈ ప్రశంసలు చేశారన్నారు. అధ్యక్షుడు ట్రంప్ సదస్సుకు హాజరుకానందున.. ఆయనకు అందించాల్సిన పత్రాలను తమ దేశంలోని అమెరికా రాయబార కార్యాలయ అధికారికి అప్పగించినట్టు రమఫోసా కార్యాలయం తెలిపింది. అమెరికాతో దౌత్య సంబంధాల పునరుద్ధరణకు తమ అధ్యక్షుడు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని వెల్లడించింది. అయినప్పటికీ ట్రంప్ తప్పుడు ప్రచారం చేస్తూ.. తమ దేశంపై శిక్షార్హమైన చర్యలు తీసుకుంటూనే ఉన్నారని మండిపడింది. కాగా.. ఇటీవల దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన జి20 సదస్సుకు ట్రంప్ హాజరుకాలేదు. అంతకుముందు ఆయన ఓ ప్రసంగంలో మాట్లాడుతూ.. దక్షిణాఫ్రికాను జి20 గ్రూప్ నుంచి తొలగించాలని, అక్కడ జరిగే సదస్సును బహిష్కరించాలన్నారు. ఆ దేశంలో ఇలాంటి సదస్సు జరగడం అవమానకరమని వ్యాఖ్యానించారు. అక్కడ తెల్లజాతి రైతులపై జరుగుతున్న హింస, ఆస్తుల స్వాధీనం, హత్యలు వంటి దారుణాలు ప్రపంచానికి తెలియాలన్నారు.

2015 తెలంగాణ గ్రూప్-2 ర్యాంకర్లకు ఊరట

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

2015 గ్రూప్-2 ర్యాంకర్లకు తెలంగాణ హైకోర్టులో కీలక ఉపశమనం లభించింది. ఇటీవల సింగిల్ బెంచ్ ఇచ్చిన వివాదాస్పద తీర్పును హైకోర్టు సిజె ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల హైకోర్టు సింగిల్ బెంచ్ 2015-16లో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను రద్దు చేస్తూ ఆదేశాలిచ్చింది. అభ్యర్థుల జవాబు పత్రాల్లో వైట్నర్, దిద్దుబాట్లు ఉండటం, వాటి మూల్యాంకనంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ తీర్పుతో వేలాది మంది ర్యాంకర్లు ఆందోళనకు గురయ్యారు. తాజా పరిణామంలో సిజె ధర్మాసనం సింగిల్ బెంచ్ ఉత్తర్వులను నిలిపివేయటం ద్వారా గ్రూప్-2 ర్యాంకర్లకు పెద్ద ఊరట లభించింది. తదుపరి విచారణలో తుది నిర్ణయంపై అభ్యర్థులు, ఉద్యోగార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

రాజధానిలో 15 బ్యాంకులకు నేడు శంకుస్థాపన

- హాజరు కానున్న నిర్మలాసీతారామన్, చంద్రబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతిలో మరో ముందడుగు పడుతోంది. దేశంలోని ప్రముఖ బ్యాంకులు, బీమా సంస్థలు తమ రాష్ట్ర ప్రధాన కార్యాలయాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. 15 బ్యాంకులు, బీమా సంస్థలు ఈ మేరకు భవనాల నిర్మాణాన్ని చేపడుతున్నాయి. వీటికి శుక్రవారం ఉదయం 11.22 గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏపీ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, నాబార్డ్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఐడిబిఐ బ్యాంకు, ఎల్ఐసి., న్యూ ఇండియా ఇన్సూరెన్సు కంపెనీ రాష్ట్ర కార్యాలయాలకు శంకుస్థాపన జరగనుంది. రూ.1,334 కోట్లతో ఈ కార్యాలయాలు నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఆయా బ్యాంకుల, బీమా సంస్థల ప్రతినిధులు, మంత్రులు, రాజధాని రైతులు హాజరుకానున్నారు.



పిడికె రావుకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న వెంకయ్య నాయుడు

పిడికె రావుకు భారత జ్యోతి పురస్కారం

- ప్రదానోత్సవం చేసిన వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి- తెనాలిరూరల్ (గుంటూరు జిల్లా)

డాక్టర్ పెమ్మరాజు దుర్గా కామేశ్వరరావు (పిడికె రావు)కు భారత జ్యోతి పురస్కారాన్ని అందజేశారు. గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలోని కొత్తపేట తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో తెనాలి ప్రచురణలు సంస్థ ఈ పురస్కారాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులు మీదుగా అందజేశాయి. ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ... అమెరికాలోని బోస్టన్ విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్ర ప్రొఫెసర్‌గా ఉన్నత స్థానాన్ని వదులుకొని పేదలకు ఉచిత విద్యను అందించాలన్న లక్ష్యంతో భారతదేశానికి తిరిగొచ్చిన పిడికెరావు దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమన్నారు. విజయనగరం జిల్లా చీపురువలసలో అట్టడుగునున్న గ్రామీణ, విద్య, వైద్య రంగాలను మెరుగుపరచాలన్న సంకల్పంతో కామేశ్వరరావు తన శేష జీవితాన్ని పేదలకు అంకితం చేయడం ఆదర్శప్రాయమని కొనియాడారు. పురస్కార గ్రహీత డాక్టర్ పెమ్మరాజు దుర్గా కామేశ్వరరావు మాట్లాడుతూ... శోధన సంస్థ ద్వారా వేలాది మంది ఉద్యోగులను తీర్చిదిద్దగలిగామని, వందలాది ఎస్‌సి, ఎస్‌టి, బిసిలను విద్యావంతులుగా తీర్చిదిద్దగలిగామని చెప్పారు. దళితులకు దక్కాల్సిన ఆస్తులను, విలువైన భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించగలిగామని వివరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎపి హైకోర్ట్ న్యాయవాది కె.ఇంద్రనీల్‌బాబు మాట్లాడారు. కామినేని శ్రీనివాసరావు, డబుల్ హార్స్ మినపగుళ్ల అధినేత మునగాల శ్యామ్ ప్రసాద్, కుమార్ పంప్స్ అధినేత కొత్తా సుబ్రహ్మణ్యం, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు, సురేష్, ఓలేటి పార్వతీశం పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకోవడమే ప్రపంచంలో అతిపెద్ద శక్తి

- డికె శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్య



బెంగళూరు : కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై కొన్నాళ్లుగా విస్తృత చర్చ జరుగుతోంది. ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల రెండేన్నరేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకోవడంతో దీనిపై ఊహాగానాలు ఊపందుకున్న సంగతి విదితమే. ఈ క్రమంలో ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ సామాజిక మాధ్యమాల్లో గురువారం నాడు ఆసక్తికర ప్రకటన పోస్టు చేశారు. 'పద శక్తి .. ప్రపంచ శక్తి' అని ఒక సందేశాత్మక చిత్రాన్ని జతం చేసి..'ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే ప్రపంచంలోని అతిపెద్ద శక్తి' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. మాటను నిలబెట్టుకోవడంలో న్యాయమూర్తి అయినా, రాష్ట్రపతి అయినా ఇచ్చిన మాట ప్రకారమే నడుచుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రి పీఠం విషయంలో వెలువడుతున్న కథనాలపై ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ 'ఈ విషయానికి అధిష్టానం వీలైనంత త్వరగా తెర దించాలి' అని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ నెల 26న పేర్కొన్న సంగతి తెలిసిందే.

తెరపైకి పరమేశ్వర

మరోవైపు కర్ణాటక హోంమంత్రి జి పరమేశ్వర కూడా ముఖ్యమంత్రి మార్పుపై కీలక ప్రకటన చేశారు. తనకు కూడా ముఖ్యమంత్రి అవ్వాలనే కోరిక ఉందని పేర్కొన్నారు. అయితే అధికార మార్పిడి జరిగి, శివకుమార్‌కు సిఎం బాధ్యతలు అప్పగించినా తాను దానికి అంగీకరిస్తానని తెలిపారు.

ఒకరిద్దరు తేల్చే విషయం కాదు : ఖర్గే

అయితే ముఖ్యమంత్రి మార్పు అనేది ఏదో ఒకరిద్దరు కూర్చొని తేల్చేసే వ్యవహారం కాదని, సమిష్టిగా నిర్ణయించాల్సివుంటుందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే అన్నారు. అందరినీ పిలిచి చర్చలు నిర్వహించాలని, ఈ చర్చల్లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య, శివకుమార్ ఉంటారని తెలిపారు. వీరందరితో కలిసి చర్చించిన తర్వాతే అసలు నిర్ణయం తీసుకుంటామని ఖర్గే మీడియాకి వెల్లడించారు.

మనీలాండరింగ్ కేసులో విన్‌జో వ్యవస్థాపకులు అరెస్టు




పవన్ నందా



సౌమ్య సింగ్ రాథోడ్

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ కేసులో ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్ విన్‌జో వ్యవస్థాపకులు సౌమ్య సింగ్ రాథోడ్, పవన్ నందాలను ఇడి అరెస్టు చేసింది. బెంగళూరు, గుర్గావ్, ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి, రూ. 523 కోట్లకు పైగా విలువైన ఆస్తులను స్థంభింపచేసిన కొన్ని రోజుల తరువాత వీరిని ఇడి అదుపులోకి తీసుకుంది. 'విన్‌జో గేమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు సౌమ్య, పవన్‌లను బుధవారం అరెస్టు చేశాం. కోర్టు ముందు వారిని హాజరుపర్చగా ఇడి కస్టడీకి అనుమతించింది' అని గురువారం ఒక ప్రకటనలో ఇడి తెలిపింది. మోసం, ఖాతాల బ్లాకింగ్, వంచన, పాన్ దుర్వినియోగం వంటి అభియోగాలతో విన్‌జో, ఇతరులపై నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి దర్యాప్తు నిర్వహిస్తోంది. బ్రెజిల్, అమెరికా, జర్మనీ వంటి దేశాల నుంచి విన్‌జో కంపెనీ రియల్ మనీ గేమ్‌లను భారత్‌లో నిర్వహిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైనట్లు ఇడి తెలిపింది. రియల్ మనీ గేమ్‌లను కేంద్ర ప్రభుత్వం నిషేధించిన తరువాత కూడా గేమర్లు, కస్టమర్‌లకు నగదును తిరిగిచెల్లించకపోవడంతో విన్‌జో వద్ద రూ 43 కోట్ల మొత్తం ఇప్పటికీ ఉందని ఇడి తెలిపింది.



హాంకాంగ్‌లో అగ్ని ప్రమాదం

- 85కు చేరిన మృతుల సంఖ్య

హాంకాంగ్ : హాంకాంగ్‌లో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 85కు చేరుకుంది. గురువారం కూడా సహాయక చర్యలు కొనసాగాయి. హాంకాంగ్‌లోని తాయ్ పో జిల్లాలో వేలాది మంది నివాసం ఉంటున్న టవర్లలో బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా వ్యాప్తించాయి. ఈ ప్రమాదంలో గురువారం సాయంత్రానికి 85 మంది మరణించారు. మరో 70 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో 40 మంది పరిస్థితి విషమంగా ఉంది. అలాగే మరోవైపు ఈ ప్రమాదం తరువాత నుంచి ఇంకా సుమారు 280 మంది అచూకీ తెలియడం లేదు. వీరి గురించి తీవ్రంగా గాలింపు చర్యలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, ఇంకా అనేక మంది ఇంకా భవనాల్లోనే చిక్కుకున్నట్లు తెలుస్తోంది. మొత్తం ఏడు బ్లాకులు మంటల్లో చిక్కుకోగా.. గురువారానికి నాలుగింటిలో మంటలు అదుపులోకి వచ్చాయి. మిగతా మూడు భవనాల పైభాగంలో గురువారం సాయంత్రం కూడా మంటలు చెలరేగుతూనే కనిపించాయి. బాధితులను వెలికి తీసేందుకు ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సురక్షితంగా బయటకు తీసుకువచ్చిన 900 మందిని తాత్కాలిక శిబిరాలకు తరలించారు.భవనాలకు గ్రీన్ మెష్, వెదురు బొంగులు ఉండడంతో ప్రమాద తీవ్రత పెరిగినట్లు సమాచారం. ముఖ్యంగా కిటికీలకు అత్యంత మండే స్వభావం ఉండే పాలిస్టరైన్ బోర్డులను అమర్చడం ప్రమాద తీవ్రత పెరగడానికి కారణంగా అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా 304 ఫైర్‌ఇంజిన్లు, రెస్క్యూ వాహనాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి.

థాయ్ పో జిల్లాలో ఈ భవన సముదాయాన్ని 1983లో నిర్మించారు. ఎనిమిది టవర్లలో 1984 అపార్టుమెంట్‌లు ఉండగా.. 4600 మంది నివసిస్తున్నారు. వీరిలో 40శాతం మంది 60ఏళ్ల వయసు వారేనని అధికారులు అంచనా. ఈ భవన సముదాయానికి మరమ్మతులు నిర్వహిస్తున్న క్రమంలోనే మంటలు చెలరేగి ఏడు బ్లాకులకు వ్యాపించాయి. హాంకాంగ్‌లో గత 70ఏళ్లలో ఇంత భారీ ప్రమాదాన్ని ఎన్నడూ చూడలేదని అధికారులు చెబుతున్నారు.

బంతి అంటే భయం.. భయం...

- టాప్ ఆర్డర్ బ్యాటర్లు ఒకలా..
- లోయర్ ఆర్డర్ బ్యాటర్లు పోరాడేలా..

దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా వైట్‌వాష్ గురైంది. ఈ ఓటమికి ప్రధాన కారణం టాప్ ఆర్డర్ బ్యాటర్ల వైఫల్యమేనని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దక్షిణాఫ్రికా బౌలర్ల బంతులను ఎదుర్కొనేందుకే భారత టాపార్డర్ భయపడిపోయే పరిస్థితి గత రెండు మ్యాచుల్లో కనిపించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. పట్టుమని పది ఓవర్లు కూడా ఆడడంలో విఫలమయ్యారంటే వారిపై వారికే నమ్మకం లేకుండా పోయిందనే చెప్పాలి. తిరిగే బంతులు, ఎగిసే బంతులన్న తేడా లేకుండా అన్ని బంతులు భారత బాట్స్‌మన్ వైఫల్యాలకు అద్దంపట్టాయి.

విదేశీ పిచ్‌లపై చెలరేగి ఆడే ప్రధాన బ్యాటర్లు భారత పిచ్‌లపై డీలా పడడం సగటు ప్రతి ఒక్క అభిమానిని కలచివేస్తోంది. ఈ సిరీస్‌కు ముందే ఇంగ్లండ్ గడ్డపై టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పరుగుల వరద పారించాడు. కానీ దక్షిణాఫ్రికాతో స్వదేశీ పిచ్‌పై ఒక్క ఇన్నింగ్స్ మాత్రమే ఆడి ఘోరంగా విఫలమయ్యాడు. ఆ తర్వాత గాయపడి టెస్ట్ సిరీస్‌కు దూరమయ్యాడు. కెప్టెన్ ఒక్కరే కాదు.. జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్, ధృవ్ జురెల్, రిషబ్ పంత్.. ఇలా టాపార్డర్ బ్యాటర్లంతా దక్షిణాఫ్రికా బౌలర్లు వేసిన బంతులను ఎదుర్కోలేకపోయారు. కానీ లోయర్ ఆర్డర్ బ్యాటర్లు వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, జడేజా దక్షిణాఫ్రికా బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు.

టీమిండియా 1470బంతుల్లో...

దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా ఆటగాళ్లు మొత్తం 1470బంతులు ఆడారు. ఇందులో భారత టాపార్డర్ బ్యాటర్లు జైస్వాల్, రాహుల్, జురెల్, పంత్ నాలుగు ఇన్నింగ్స్‌లో కలిపి 496బంతులు ఆడగా.. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు ముగ్గురు సుందర్; కుల్దీప్,



జడేజా కలిసి 677 బంతులు ఆడి దక్షిణాఫ్రికా ఆటగాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. రెండు టెస్టుల్లో కలిపి జైస్వాల్(158బంతులు), రాహుల్(217), జురెల్(62), పంత్(59) బంతులు ఆడగా.. సుందర్(310బంతులు), కుల్దీప్(193), జడేజా(174) కలిసి నాలుగు ఇన్నింగ్స్‌లో ఆడారు. వాస్తవానికి స్పిన్ అంటే చాలు భారత ఆటగాళ్లు రెచ్చిపోతారు. అయితే ఇటీవల కాలంలో మాత్రం తిరుగుతున్న బంతికి బ్యాటర్లు కూడా గిరగిరా తిరిగిపోతున్నారు. బంతిని అర్థం చేసుకోలేక టాపార్డర్ కకా వికలమైపోతోంది. విచిత్రమేమిటంటే... లోయర్ ఆర్డర్ ఆటగాళ్లు మాత్రం స్పిన్‌ను చక్కగా ఎదుర్కొంటూ టాపార్డర్‌కు పాఠాలు నేర్పుతున్నారు. ఒక ఇన్నింగ్స్‌లో కేవలం బౌలర్ మాత్రమే అయిన కులదీప్ యాదవ్ ఏకంగా 134 బంతులను ఎదుర్కొనడంపై సీనియర్లే హాట్సాఫ్ అంటున్నారు.

తొలి టెస్ట్ :189/10(62.2ఓవర్లు;374 బంతులు), 93/10(35ఓవర్లు; 210బంతులు)

రెండోటెస్ట్ :201ఆలౌట్(83.5ఓవర్లు;503 బంతులు), 140/10(63.5ఓవర్లు; 383బంతులు)

	రెండోటెస్ట్		తొలిటెస్ట్	
టాప్ ఆర్డర్...				
జైస్వాల్	58(97)	13(20)	12(37)	0(4)
రాహుల్	22(63)	6(29)	38(119)	1(6)
జురెల్	0(11)	2(3)	14(14)	13(34)
పంత్	7(8)	12(16)	27(24)	2(11)
లోయర్ ఆర్డర్...				
సుందర్	48(92)	16(44)	29(82)	31(92)
కుల్దీప్	19(134)	5(38)	1(8)	1(13)
జడేజా	6(18)	54(87)	27(45)	18(26)

(బ్రాకెట్లలో: ఆటగాళ్లు ఆడిన బంతులు)

- స్పోర్ట్స్ కరస్పాండెంట్

సత్యదేవ నర్సరీలో ఒడిశా బృందం

ప్రజాశక్తి - కడియం

కడియం మండలంలోని కడియపు లంక సత్యదేవ నర్సరీని ఒడిశా రాష్ట్రానికి చెందిన జడ్‌పి ఛైర్మన్, సర్పంచ్, ఎన్నికల అధికారుల బృందం గురువారం సందర్శించింది. నర్సరీ రైతు పుల్లా పెద్ద సత్యనారాయణ వారికి మొక్కలు ఇచ్చి స్వాగతం పలికారు. ఇక్కడి మొక్కలు ప్రకృతిలో సంభవిస్తున్న కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రిస్తున్నాయని వారికి వివరించారు. నర్సరీలో పలు రకాల మొక్కల శాస్త్రీయ నామాలు, వాటివల్ల ఉపయోగాలను వారు అడిగి తెలుసుకున్నారు. వివిధ పండ్ల జాతి మొక్కలతో పాటు సప్త వర్ణ దళాలు, పుష్పాలు చూపరులను కనువిందు చేస్తున్నాయన్నారు. మొక్కలను పరిశీలించి ప్రపంచంలో గల వింతైన మొక్కలు ఉత్పత్తి చేస్తున్న సత్యదేవ నర్సరీ రైతు పుల్లా పెద్ద సత్యనారాయణను బృందం అభినందించింది.

అరకొరగా ధాన్యం కొనుగోళ్లు

- తరుముకొస్తున్న మరో తుపాను
- పూర్తి స్థాయిలో బ్యాంకు గ్యారంటీలివ్వని మిల్లర్లు



ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం జిల్లాలో అరకొర ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. రైతులు నూర్పులు చేసి అమ్మకానికి ధాన్యం సిద్ధంగా ఉంచారు. అయితే రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. పూర్తిస్థాయిలో కొనుగోళ్ల ప్రారంభం కాకపోవడంతో వ్యవసాయ సిబ్బంది ప్రక్రియలో భాగస్వాములు కాని పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో 2.5 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే చాలా మండలాల్లో ధాన్యం విక్రయానికి సిద్ధం ఉన్నప్పటికీ కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం కాలేదు. జిల్లాలోని మిల్లు యజమానులు కూడా ఇంకా పూర్తి స్థాయిలో బ్యాంక్ గ్యారంటీ లిచ్చిన దాఖలాల్లేవు. ఇంతవరకు 54 మిల్లుల నుంచి రూ.26 కోట్లు బ్యాంక్ గ్యారంటీ రూపంలో వసూలైంది. మరో 53 మిల్లుల నుంచి రూ.40 కోట్ల దాకా అందాల్సి ఉంది. దీంతో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయలేదు. ఫలితంగా రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలు తుఫాన్ల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతును మళ్లీ మరో తుపాను వెంటాడుతున్న పరిస్థితి ఏర్పడింది. ఈ నెలాఖరులోగా మరో తుఫాన్ వుంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించడంతో రైతులు అప్రమత్తమయ్యారు. వరి పంట చేతికొచ్చే సమయంలో మరో తుపాను వస్తుందని తెలియడంతో ఆందోళనకు గురవుతున్నారు. తుపాను వచ్చేలోగా నూర్పులు చేసి ధాన్యం అమ్మేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో కల్లాల్లో ధాన్యం బస్తాలతో సిద్ధంగా ఉన్నారు. అయితే రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది మాత్రం కొనుగోలు ప్రక్రియను పూర్తి స్థాయిలో చేపట్టడం లేదు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను కూడా పూర్తిగా అందుబాటులోకి తీసుకురాలేదు. ఫలితంగా నూర్పులు చేసిన రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కొన్ని మండలాల్లో మిల్లు యజమానులు వ్యాపారుల నుంచి ధాన్యం సేకరణకే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారులతో మిల్లు యజమానులకు వున్న అవగాహన మేరకు వారు రవాణా చేసిన ధాన్యం లోడులకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా సీతానగరం మండలంలో కొంతమంది మిల్లర్లు ఈ కిరికిరి చేస్తున్నట్లు తెలుస్తోంది. తుఫాన్ వస్తుందేమోనన్న భయంతో కొంతమంది రైతులు నిల్వ చేసుకునే సామర్థ్యం లేక వ్యాపారులకు అమ్మకానికే సిద్ధమవుతున్నారు. అంతేకాకుండా మిల్లు యజమానులకు కూడా రోజుకు 2వేల బస్తాల వరకే సేకరణ చేపట్టాలని ఆంక్షలు విధించడంతో వారు వ్యాపారులకు ప్రాధాన్యత ఇస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

7688 టన్నుల సేకరణ
శ్రీనివాసరావు, డిఎం సివిల్ సప్లయ్ కార్పొరేషన్

జిల్లాలో ఇంతవరకు 73కొనుగోలు కేంద్రాల్లో 7866 టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. మొత్తం 181 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తాం. ఇంకా పూర్తి స్థాయిలో ధాన్యం నూర్పులు జరగలేదు. ధాన్యం రవాణాకు 1300 వాహనాలను సిద్ధం చేశాం.

విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-హిందూపురం (సత్యసాయి)

హిందూపురం పట్టణంలోని సత్యనారాయణపేటకు చెందిన భానుతేజ (20) అనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. సెల్ ఫోన్ ఎక్కువగా ఉపయోగిస్తూ ఉండడంతో తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన భాను తేజ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. భాను తేజ పట్టణంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. తల్లి సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

14 నుంచి సివిల్స్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన వచ్చే నెల 14వ తేదీ నుంచి సివిల్స్‌కు ఇంటిగ్రేటెడ్ కోచింగ్ అందజేయనున్నట్లు బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయవాడలోని గొల్లపూడిలో బిసి సంక్షేమశాఖ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన రెండో విడత సివిల్ సర్వీసెస్ కోచింగ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వంద మంది అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేలా గొల్లపూడి బిసి భవన్‌లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. 7వ తేదీన అర్హత పరీక్ష నిర్వహించనున్నామన్నారు. 11న ఫలితాలు ప్రకటించి, 14వ తేదీ నుంచి శిక్షణను ప్రారంభించనున్నట్లు తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు 12వ తేదీన గొల్లపూడిలోని బిసి భవన్‌లో రిపోర్ట్ చేయాలని స్పష్టం చేశారు. రైస్ కార్డ్ కలిగిన బిసి అభ్యర్థులు ఉచిత శిక్షణకు అర్హులన్నారు. గత ఏడాది ఉచిత శిక్షణ పొందిన వారు మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణలో ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు అవకాశమిస్తున్నట్లు చెప్పారు. వంద సీట్లలో బిసిలకు 66, ఎస్‌సిలకు 20, ఎస్‌టిలకు 14 సీట్లు కేటాయించామన్నారు. మహిళలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, అదనపు డైరెక్టర్ రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఆర్‌టిసి బస్సులు.. ప్రయోజనం లేని పాస్‌లు..!

- ఇంటర్ విద్యార్థులకు తప్పని కాలినడక

ప్రజాశక్తి-బొమ్మనహాల్

అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండల కేంద్రమైన బొమ్మనహాల్‌లో ఉన్న విన్సెంట ఫెర్రర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 150 మంది, ద్వితీయ సంవత్సరంలో వంద మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. వారిలో బాలికలు వంద మందికి పైగా ఉన్నారు. ఈ కళాశాలకు మండలంలోని ఉద్దేహాల్, గోనేహాల్, కొలగానహల్లి, కృష్ణాపురం, శ్రీధరఘట్ట, గౌనూరు, శ్రీరంగాపురం, ఉప్పరాల, తదితర గ్రామాల నుంచి విద్యార్థులు ప్రతిరోజూ కళాశాలకు వస్తున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సు పాస్ సౌకర్యం కల్పించింది. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ ఆర్‌టిసి బస్సులు ఆగడం లేదు. దీంతో ఆయా గ్రామాల విద్యార్థులు ప్రధాన రహదారి నుంచి రెండు నుంచి ఆరు కిలోమీటర్లకు పైగా దూరం నడిచి వెళ్లాల్సి వస్తోంది. ఈ మార్గంలో బళ్లారి టూ కళ్యాణదుర్గం, బళ్లారి టూ రాయదుర్గం ఆర్‌టిసి బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ విద్యార్థులు ఆపినా బస్సులు ఆపడం లేదు. ఎందుకనగా సాయంత్రం బళ్లారి నుంచి ప్రయాణికులు ఎక్కువగా వస్తున్నారని పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రిన్సిపల్, ఆర్టీసీ డిఎం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల కోసం బస్సులు ఆపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పేదల భూములపై పెత్తందారుల కన్ను

- స్వాధీనం చేసుకునేందుకు బెదిరింపులు
- సర్వే పనులకు అడ్డుకున్న బాధిత రైతులు

ప్రజాశక్తి -పరిగి (సత్యసాయి)

పేదల భూములపై పెత్తందారులు కన్నేశారు. వాటిని స్వాధీనం చేసుకునేందుకు బెదిరింపులకు దిగారు. అయినా తమకు జరుగుతున్న అన్యాయంపై రైతులు ఎదురు తిరిగారు. భూసర్వేను అడ్డుకున్నారు. తమకు అన్యాయం చేస్తే ఆత్మహత్యకు కూడా వెనుకాడమని హెచ్చరించారు. ఇందుకు సంబందించిన బాధిత రైతులు తెలిపిన వివరాలు... పరిగి మండలంలోని బీచిగానీపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న సర్వే నంబర్లు 171-2,172, 173 లకు సంబంధించి శీగిపల్లి గ్రామానికి చెందిన రైతులు సాగు చేస్తున్నారు. తమ తాత ముత్తాతల కాలం నుంచి సాగు చేస్తున్న ఈ భూములు తమవే అంటూ కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమను బెదిరించడమే కాకుండా అధికారులు పోలీసుల నుండి ఒత్తిడి తీసుకు వస్తున్నారని రైతులు హనుమంతు, మారుతితో పాటు మరో ఏడుగురు రైతులు వాపోతున్నారు. తమకు కేటాయించిన భూములను1932లో భీమారావు వద్ద నుంచి హనుమంతప్ప అలియాస్ కుంటేప్ప, వన్నంపల్లి హనుమంతప్ప కలిసి కొనుగోలు చేశారన్నారు. ఇద్దరు వ్యక్తులు కలిసి సమానవాటాలతో భూమిని సాగు చేస్తూ ఉండేవారన్నారు. 1948లో 171-2, 172 సర్వే నంబర్లలోని ఐదు ఎకరాల భూమిని రెండవ భాగస్వామి అయినా వన్నంపల్లి హనుమంతప్ప, హనుమంతప్ప అలియాస్ కుంటేప్ప విక్రయించారన్నారు. అదే విధంగా 1948లో హనుమంతప్ప అలియాస్ కుంటెప్ప, వన్నంపల్లి హనుమంతప్ప భార్య దేకమ్మ, సోదరుడు గంగప్పకు 12.55 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమిని విక్రయించారన్నారు. మొదటి వాటాదారుడైన హనుమంతప్ప అలియాస్ కుంటేప్పకు 11.50 ఎకరాలు రెండవ వాటాదారుడైన వన్నంపల్లి హనుమంతప్పకు 26.60 ఎకరాల భూమి హక్కు కలిగి ఉన్నారన్నారు. అప్పటి నుండి వన్నంపల్లి హనుమంతప్ప వారసులు వ్యవసాయం సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. మొదటి వాటాదారుడైన హనుమంతప్ప అలియాస్ కుంటేప్ప వారసులు వారికున్న 11.50 ఎకరాల భూమితో పాటు రెండవ వాటాదారుని భూమిని సైతం కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చి కోర్టు ఉత్తర్వులు సృష్టించి బడా బాబులకు విక్రయించారని ఆరోపించారు.

జీవన సౌరభం

ఓ మంచి ఆలోచన లక్షలాదిమందిని కదిలిస్తుంది. లక్షలాది మందిలో కదలిక ఒక సమాజాన్ని కదిలిస్తుంది.

మీకోసం

ధనియాలు నోట్లో వేసుకొని చప్పరిస్తూ ఉంటే నోటి దుర్వాసన తగ్గుతుంది.



బర్త్ డే గిఫ్ట్




నాలుగో తరగతి చదువుతున్న శ్రావణ్‌కి స్కూల్లో జరిగిన ప్రతి సంఘటన గురించీ వాళ్ళ అమ్మతో చర్చించడం ఇష్టం. లెక్కలంటే భయపడే శ్రావణ్ ఎన్ని సార్లు నేర్చుకున్నా ఎక్కాలు చెప్పడంలో తడబడేవాడు. క్లాస్ రూంలో పిల్లలు అది చూసి నవ్వేవారు. ప్రతి చిన్న దానికి భయపడుతూ, ఇలా 'ఇంకా ఎన్నిసార్లు ప్రాక్టీస్ చేయాల'ని అమ్మని రోజూ అడిగేవాడు. 'నిరాశ చెందకుండా ప్రయత్నం చేయాలని, నిరంతరం అలాచేస్తే ఏదో ఒకరోజు కచ్చితంగా గెలుస్తామ'ని అమ్మ శ్రావణ్‌కి చెప్పేది.

కొడుకులో ఇంకా పట్టుదల పెంచాలని అనుకున్న శ్రావణ్ వాళ్ల అమ్మ ఒకసారి తన పుట్టినరోజుకి ఓ ఫొటోఫ్రేమ్ గిఫ్ట్‌గా ఇచ్చింది. అది ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్‌ది. 'ఈయన ఫొటో నాకెందుకు ఇచ్చావమ్మా..!' అని కాసింత జిజ్ఞాసతో శ్రావణ్ అమ్మని అడిగాడు.

'ఎడిసన్ కూడా నీలాగే స్కూల్లో ఒక సాధారణ విద్యార్థే. స్కూల్లో అందరూ అతన్ని ఎగతాళి చేసేవారు. ఇంటికొచ్చాక వాళ్ళ అమ్మతో చెప్పి ఎడిసన్ చాలా బాధపడేవాడు. అప్పుడు వాళ్ళ అమ్మ తనని ఓదార్చుతూ 'నువ్వు కచ్చితంగా గొప్పవాడివి అవుతావు నాన్న' అనేది...! పెద్దయ్యాక ఆ ఎడిసన్, కొన్ని వందల సార్లు ప్రయత్నించి ఇదిగో మనం చూస్తున్న ఈ ఎలక్ట్రిక్ బల్బును కనిపెట్టాడు. బల్బు లాంటి 1000కి పైగా పరికరాలు కనుగొని చరిత్ర సృష్టించాడు. ప్రపంచంలోనే ఒక గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగాడు. నువ్వు కూడా ఎడిసన్ లాగే నిరాశ చెందకుండా కష్టపడుతూ ఉంటే ఎక్కాలే కాదు జీవితంలో అన్నీ వస్తాయి. అందరూ నిన్ను మెచ్చుకుంటారు. నువ్వు కూడా ఎడిసన్‌ను ఆదర్శంగా తీసుకో..!' అంది అమ్మ. 'సరే అమ్మా' అని శ్రావణ్ అమ్మకి మాట ఇచ్చాడు.

- ఫిజిక్స్ అరుణ్ కుమార్,
9394749536



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

నేను గీసిన బొమ్మ





ఏనుగుల శశికుమార్,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్, సిద్దిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

'సెల్'లో చిక్కుకోవొద్దు



పనుల్లోనూ, ప్రయాణాల్లోనూ, తింటున్నప్పుడూ, నిద్రపోయేముందూ... సెల్‌ఫోన్‌కు అతుక్కుపోతున్న వారి సంఖ్య రానురానూ పెరిగిపోతోంది. కొందరైతే రెండేసి చొప్పున మొబైల్ ఫోన్లను వాడేస్తూ తీరిక లేకుండా గడిపేస్తున్నారు. ఇలా ఫోనుల్లో ఉంటూ స్నేహితుల్నీ, కుటుంబ సభ్యుల్నీ నిర్లక్ష్యం కొందరు చేసేస్తున్నారు. కృత్రిమమేథతో డిజిటల్ యుగంలో యువత సెల్‌కు బానిసలౌతూ మానవీయ విలువలు మర్చిపోతున్నారు. మానవ సంబంధాలకు దూరమవుతున్నారు. దాని నుంచి బయటపడడం చాలా అవసరం.

సెల్‌ఫోన్ వాడకం నేటి డిజిటల్ సమాజంలో నిత్యావసరం అయిపోయింది. రోజువారీ పనులకు అవసరమయ్యే సరుకులు, గ్యాస్, నీళ్ల, సినిమాలు, షికార్లు, ప్రయాణాలు ఇలా అన్ని రకాల సౌకర్యాలు నెట్ బ్యాంకింగ్ లేదా ఫోన్, గూగుల్‌పేల ద్వారా చెల్లింపులు చేయొచ్చు. ఓ పూట భోజనం, కాసేపు నీళ్ల లేకుండా జీవించగలమేమో గానీ మొబైల్ ఫోన్లు లేకుండా ఉండలేని పరిస్థితి. మన రోజువారీ దినచర్యలు వాటిపైనే ఆధార పడి ఉండటమే దీనికి కారణం. మొబైల్ ఫోన్ అధిక వినియోగం మన సమయాన్ని వథా చేయడమే కాకుండా శరీరంపై కూడా ప్రభావం చూపుతుంది.

స్క్రీన్‌ను స్క్రోల్ చేస్తూ గడిపేస్తున్నాం

ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టా, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల్లో పోస్టుల జోరు కొనసాగుతోంది. అందుబాటులోకి అనేక బ్లాకింగ్ యాప్‌లూ, ఫోన్ సెట్టింగ్‌లు వచ్చేశాయి. సోషల్ మీడియా, మెసేజింగ్, ఓటీటీ, షాపింగ్ యాప్‌లూ హోరెత్తిస్తున్నాయి. సమాచారం, వీడియోలు, వాటి క్లిప్‌లు, రీల్స్‌లు కూడా పుంఖాను పుంఖాలుగా సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంటున్నాయి. ఈ క్రమంలో ఏమి చేస్తున్నామో, ఎందుకు చూస్తున్నామో తెలీకుండానే స్క్రీన్‌ని స్క్రోల్ చేస్తూ గంటలూ, రోజులు గడిపేస్తున్నాం. ఫోన్ మన నియంత్రణలో ఉందో.. మనం దాని నియంత్రణలో ఉన్నామో తెలియని పరిస్థితులు సర్వత్రా నెలకొన్నాయి.

ఆఫర్ల పేరుతో యాప్‌ల జోరు

సోషల్ మీడియాలో ఏదో చూస్తూ, రాస్తూ.. అందులో ఫొటోలూ, వీడియోలూ పెడుతూ గంటలు గంటలు గడిపేస్తుంటారు. ఓటీటీల్ని వినోదానికే కాకుండా కెరియర్, వ్యాయామం, యోగా సంబంధించిన కార్యక్రమాలు చూడ్డానికి ఆశ్రయిస్తున్నారు. కొనకున్నా షాపింగ్ యాప్‌లలో పెట్టే పోస్టులను మరికొందరు జల్లెడపడుతూ వీక్షిస్తూ తమకి నచ్చినవి మరికొందరికి షేరింగ్‌లు చేసేస్తుంటారు. యాప్‌లు మన జీవితంలో భాగమైపోయాయి. అతిగా వినియోగిస్తున్నామనే స్పృహ కొందరికే. అలాంటివారు గుడ్డిలో మెల్లలా వాటిని చూసే సమయాన్ని తగ్గించుకునే సాధనాలను ఉపయోగిస్తున్నారు. సెల్‌ఫోన్‌ను పరిమితంగా వినియోగిస్తే ప్రమాదం లేదు.

ఇయర్‌బడ్స్, హెడ్‌ఫోన్లతో వినికిడి సమస్యలు

ఆటా పాటా మాటా వినేందుకు చెవిలో ఇయర్‌బర్డ్, హెడ్‌ఫోన్, బ్లూటూత్‌లు వాడుతున్నారు. చెవిలో ఇయర్ ఫోన్ పెట్టుకొని ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు సైతం ఉంటున్నాయి. ఇంకొందరైతే రీల్స్ పేరుతో ప్రమాదకరమైన ప్రదేశాలను ఎక్కుతూ, నదులు, సముద్రాల్లో, జలపాతాల్లో దూకుతూ ప్రమాదాలకు గురవుతున్న ఉదంతాలు కూడా ఉంటున్నాయి. ఇయర్‌ఫోన్స్‌తో వినికిడి శక్తి కూడా బాగా తగ్గిపోతుంది. కొంతమందికి పూర్తిగా చెవుడు వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చెవులు బరువుగా అనిపించడం, చెవిలో నొప్పిగా ఉండటం, కుయ్ లాంటి శబ్దం వినిపించడం లేదా సముద్రపు ఘోష చెవిలో వినిపించినా అలాంటి లక్షణాలేనని గుర్తించాలి. సాఫ్ట్‌వేర్ లాంటి తప్పనిసరిగా హెడ్‌ఫోన్ వాడాల్సిన వారైతే 80 డెసిబుల్స్ కంటే శబ్దం ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలి. గంట కంటే ఎక్కువ సేపు వాటిని వాడకుండా ఉండటం మేలు.



ఈ జాగ్రత్తలు మేలు

నెట్ ఆపేయటం : ఫోన్‌ని ఉపయోగించిన తర్వాత మొబైల్ డేటాను ఆపేస్తే కొంతమేరకు ఉపయోగకరం. అప్పుడు ఫోన్ వైపునకు మన దృష్టిని తగ్గిస్తుంది. ఇతర పనులపై కేంద్రీకరణ పెట్టొచ్చు.

సమయం ఆదా : ఖాళీగా ఉన్నామనే పేరుతో ఎక్కువగా మొబైల్‌ను ఉపయోగిస్తుంటాం. అలా కాకుండా రోజులో ప్రతి ఒక్కరూ తమ కోసం కేటాయించుకుని తమకిష్టమైన పనులు చేసుకోవటం అలవాటు చేసుకోవాలి. గార్డెనింగ్, పుస్తక పఠనం, నృత్యం, సంగీతం వినడం, వంట చేయడం, పెయింటింగ్, డ్యాన్స్ వంటివి ఇలాంటివి చేయొచ్చు. కుటుంబంతో వెచ్చించే సమయం కూడా పెరుగుతుంది.

వృథా కాల్స్ వద్దు : కొందరు ఖాళీగా ఉన్నామనే పేరుతో తమ స్నేహితులు, బయట వ్యక్తులకు ఊరకే ఫోన్లు చేసేస్తుంటారు. ఎక్కువ సమయం ఊసుపోని కబుర్లు చెప్పేస్తుంటారు. ఎవ్వరితోనైనా ఫోన్‌లో అవసరం మేరకు మితంగా మాట్లాడి ఆపేస్తే కొంత సమయం కలిసి వస్తుంది. ఆ సమయంలో మన ఇతర పెండింగ్ పనులను సైతం పూర్తిచేసేసుకోవచ్చు.

స్వీయనియంత్రణ అవసరం : రోజులో ఫోనుకు ఇంత సమయం కేటాయించుకుని ఆనక స్విచ్ఛాఫ్ లేదా ఎరోప్లేన్‌మోడల్‌లోనో, సైలెంట్‌గానే ఉంచుకుంటే మేలు. అదే ఆన్‌లో ఉంటే మన ఫోన్‌లో ఉన్న కాంట్రాక్ట్‌ల నుంచి నిరంతరం వచ్చే పోస్టులకు స్పందించాల్సివుంటుంది. అదే స్వీయనియంత్రణ పాటించి అమలు చేస్తే సమయం, ఆరోగ్యం కాపాడుకున్న వాళ్లం అవుతాము.

అర్ధరాత్రిళ్లు వద్దే వద్దు : చాలాసార్లు మనం పడుకోగానే మొబైల్ ఫోన్లను ఉపయోగించడం ప్రారంభిస్తాము. ఇది మన శరీరానికి హానికరం. చాలాసార్లు మనకు తెలియకుండానే అర్ధరాత్రి ఫోను వాడుతున్నప్పటికీ నిద్ర రాదు. బెడ్‌పై మొబైల్‌ఫోన్‌ను ఉపయోగించకుండా పుస్తకాలను చదవటం చేస్తుంటే నిద్ర వచ్చేస్తుంటుంది. నిద్రను మెరుగుపర్చుకోవాలంటే రోజూ ఒకే సమయానికి పడుకోవడం అలవాటు చేసుకోవాలి. ఫోన్లో స్లీప్ ఫోకస్‌ను కూడా సెట్ చేసుకోవచ్చు. రాత్రిళ్లు వచ్చే వీడియోకాల్స్‌కు ఆన్సర్ చేయకుండా ఉండటమే మేలు.



యువతా మేలుకో...: నేటి యువత సామాజిక మాధ్యమాల్లో గంటల తరబడి కాలక్షేపం చేస్తున్నారు. మొబైల్ వినియోగానికి అతిగా అలవాటు పడుతూ రోగాల బారినపడుతున్నారు. వారిలో పరివర్తన తీసుకురావటానికి మా వంతుగా కృషి చేస్తున్నాం. నిరంతరం మొబైల్‌ఫోన్

దీప్తి శర్మ టాప్

- అత్యధిక పారితోషికం ఆమెకే...
- ఢిల్లీ చెంతకు లారా వోల్వార్ట్
- ముగిసిన డబ్ల్యుపిఎల్ వేలం



ముంబయి: వుమెన్స్ ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)లో భారత స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ రికార్డు ధర పలికింది. గురువారం జరిగిన మినీ వేలంలో దీప్తి శర్మను యుపి వారియర్స్ రూ.3.20 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ డబ్ల్యుపిఎల్‌లో రికార్డు ధర పలికిన తొలి క్రీడాకారిణిగా దీప్తి శర్మ నిలిచింది. ఇక ప్రపంచకప్‌లో తిప్పేసిన శ్రీచరణి రూ.1.30కోట్లు పలికింది. హైదరాబాద్‌కు చెందిన అరుంధతి రెడ్డిని రూ.75లక్షలకు ఆర్సీబీ కొనుగోలు చేసింది. గత నాలుగో సీజన్ వేలంలో క్రికెటర్లపై కాసుల వర్షం కురిసింది. మెగా ఆక్షన్‌లో వరల్డ్ కప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన దీప్తి శర్మ రూ.3.20 కోట్లు పలికింది. స్టార్ ఆల్‌రౌండర్ అయిన దీప్తి కోసం ఆమె గతంలో ఆడిన యూపీ వారియర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ పోటీ పడ్డాయి. చివరకు రైట్ టు మ్యాచ్ ఉపయోగించుకొని దీప్తిని పట్టేసింది యూపి. ఆల్‌రౌండర్ అయిన శిఖా పాండేను రూ.2.40 కోట్లకు యూపి దక్కించుకుంది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణిని రూ.1.30 కోట్లకు ఢిల్లీ తిరిగి సొంతం చేసుకుంది. డబ్ల్యూపీఎల్ వేలంలో అత్యధిక ధర పలికిన వాళ్లలో అమేలియా కేర్ టాప్‌లో ఉంది.

రెండుసార్లు విజేతగా నిలిచిన ముంబయి ఇండియన్స్ టీమ్‌లో సభ్యురాలైన ఈ కివీస్ స్టార్‌ను ఆ ఫ్రాంఛైజీ రూ.3 కోట్లకు దక్కించుకుంది. షికా ఇషికాను ముంబయి ఇండియన్స్ రూ.30లక్షల కనీస ధరకు కొనుగోలు చేయగా.. సబ్బినేని మేఘనను ఏ ఫ్రాంఛైజీ కొనుగోలు చేయలేదు. మొత్తం 73 ఖాళీలకోసం వేలం నిర్వహించగా.. రేసులో 277మంది క్రీడాకారిణులు నిలిచారు. వీరిలో 194మంది ఇండియా, 83మంది విదేశీ ప్లేయర్లు ఉన్నారు. వారిలో 83మందికి అంతర్జాతీయ, 65మంది జాతీయ జట్లకు ఆడిన అనుభవం ఉండగా.. 17మందికి అన్‌క్యాప్డ్ ప్లేయర్లు. 23మంది సభ్యదేశాల తరపున వేలం రేసులో నిలిచారు. గురువారం జరిగిన వేలంలో మొత్తం ఐదు ఫ్రాంఛైజీలు ఆటగాళ్లను కొనుగోలు చేసుకొనేందుకు పోటీపడ్డాయి.

వేలంకు ముందు ఫ్రాంఛైజీలు నిలుపుకున్న ఆటగాళ్లు...

ముంబయి ఇండియన్స్..
1. స్కీవర్ బ్రంట్ : రూ.3.50కోట్లు
2. హర్మన్‌ప్రీత్ : రూ.2.50కోట్లు
3. హీలీ మ్యాథ్యూస్ : రూ.1.75కోట్లు
4. అమన్‌జ్యోత్ కౌర్ : రూ.1.0కోటి
5. కమిలిని : రూ.50లక్షలు

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు...
1. మంధాన : రూ.3.50కోట్లు
2. రీచా ఘోష్ : రూ.2.75కోట్లు
3. ఎలైసే పెర్రీ : రూ.2.0కోట్లు
4. శ్రేయాంక పాటిల్ : రూ.60లక్షలు

గుజరాత్ జెయింట్స్...
1. ఎలైసే గార్డినర్ : రూ.3.50కోట్లు
2. బెత్ మూనీ : రూ2.50కోట్లు

యుపి వారియర్స్...
1. శ్వేతా సెహ్రావత్ : రూ.50లక్షలు

ఢిల్లీ క్యాపిటల్స్...
1. జెమీమా రోడ్రిగ్స్ : రూ.2.20కోట్లు
2. షెఫాలీ వర్మ : రూ.2.20కోట్లు
3. సథర్లాండ్ : రూ.2.20కోట్లు
4. మారిజానే కాప్ : రూ.2.20కోట్లు
5. నికి ప్రసాద్ : రూ.50కోట్లు

అత్యధిక పలికిన ప్లేయర్లలో కొందరు..
1. **దీప్తి శర్మ : రూ.3.20 కోట్లు (యుపి)**
2. **అమేలియా కేర్ : రూ.3.0 కోట్లు (ముంబయి)**
3. **శిఖా పాండే : రూ.2.40 కోట్లు (యుపి)**
4. **సోఫీ డివైన్ : రూ.2 కోట్లు (గుజరాత్)**
5. **మెగ్ లానింగ్ : రూ.1.90కోట్లు(యుపి)**
6. **చినెల్లె హెన్రీ : రూ.1.30 కోట్లు (ఢిల్లీ)**
7. **శ్రీచరణి : రూ.1.30 కోట్లు (ఢిల్లీ)**
8. **ఫౌబె లిచ్‌ఫీల్డ్ : రూ.1.20 కోట్లు (యూపి)**
9. **లారా వోల్వార్ట్ : రూ.1.10కోట్లు(ఢిల్లీ)**
10. **లారెన్ బెల్ : రూ.90 లక్షలు (ఆర్సీబీ)**
11. **ఆశా శోభన : రూ.1.10 కోట్లు(యుపి)**

అదరగొట్టిన హాకీ ఆటగాళ్లు

- న్యూజిలాండ్‌పై గెలుపుతో ఫైనల్‌కు చేరిక
- నేడు కెనడాతో చివరి లీగ్ మ్యాచ్



ఇంపో(మలేషియా): సుల్తాన్ అజ్లాన్ షా హాకీ టోర్నమెంట్‌లో భారత ఆటగాళ్లు అదరగొడుతున్నారు. గురువారం జరిగిన గ్రూప్ లీగ్ నాల్గో మ్యాచ్‌లో భారత హాకీ జట్టు పటిష్ట న్యూజిలాండ్‌పై గెలిచింది. నువ్వా-నేనా అన్నట్లు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో భారతజట్టు 3-2గోల్స్ తేడాతో కివీస్‌ను చిత్తుచేసింది. అమిత్ రోహిదాస్(4వ ని.), సంజయ్(34వ ని.), సెల్వం కార్తి(54వ ని.) ఒక్కో గోల్స్ చేయగా.. న్యూజిలాండ్ తరఫున జార్జి బెకర్(42, 48వ ని.) రెండు గోల్స్ కొట్టారు. మ్యాచ్ ప్రారంభమైన తొలి సెకన్లలోనే న్యూజిలాండ్ జట్టు భారత గోల్‌పోస్ట్‌పై దాడి చేసింది. కానీ భారత రక్షణ శ్రేణి దానిని విఫలం చేయడంలో గోల్ కాలేదు. ఆ తర్వాత భారత్ ఎదురుదాడి చేసి 4వ ని.లోనే రోహిదాస్ చేసిన గోల్‌తో భారత్ 1-0 ఆధిక్యతలో నిలిచింది. దీంతో తొలి క్వార్టర్ ముగిసేసరికి భారత్ 1-0 ఆధిక్యతలో నిలువగా.. రెండో క్వార్టర్‌లో ఏ జట్టూ గోల్ చేయలేదు. మూడో క్వార్టర్ ప్రారంభంలోనే సంజయ్ గోల్ చేయడంలో భారత్ 2-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఆ క్వార్టర్ ముగింపులో న్యూజిలాండ్ ఒక గోల్ చేయడంలో భారత్ ఆధిక్యత 2-1కు తగ్గింది. నాల్గో క్వార్టర్ ప్రారంభంలోనే న్యూజిలాండ్ గోల్ చేయడంలో స్కోర్ 2-2తో సమమైంది. 54వ ని.లో సెల్వం కార్తి చేసిన గోల్‌తో భారత్‌కు విజయం ఖాయమైంది. ఇతర పోటీల్లో కెనడా జట్టు 3-2గోల్స్ తేడాతో కొరియాను, బెల్జియం జట్టు 9-1తో ఆతిథ్య మలేషియాను చిత్తు చేశాయి.

పాయింట్ల పట్టిక...

జట్టు	మ్యా	గె	ఓ	డ్రా	గో.వ్య.	పా
1. బెల్జియం	4	3	1	0	13	10
2. భారత్	4	3	0	1	2	9
3. న్యూజిలాండ్	4	2	1	1	3	7
4. కెనడా	4	1	1	2	-2	4
5. మలేషియా	4	1	1	2	-8	4
6. కొరియా	4	0	0	4	-8	0

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68